ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

శనివారం 14 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 148 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జాతీయ
క్రీడా పురస్కారాల ప్రదానోత్సవం

అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్‌తో పాటు 15 మందికి అర్జున అవార్డులు

వివిధ క్రీడల కోచ్‌లకు ద్రోణాచార్య, సాహస క్రీడాకారులకు టెన్జింగ్ నార్గే పురస్కారాలు 2





బెంగళూరులో 2
మెట్రో పింక్ లైన్ ప్రారంభం
రైలులో మోదీ ప్రయాణం

సజ్జనార్ బదిలీలో సవాలక్ష గుసగుసలు

హీరో ఇమేజ్ నుంచి హాట్‌టాపిక్ వరకు

14 నెలలకే స్థానచలనం... విభేదాలా..సమీకరణాలా..

అవినీతి, కీలక వ్యవహారాలపై పెరిగిన చర్చ.... సీపీ బదిలీతో తెరపైకి కొత్త పరిణామాలు

ఏ శాఖలో నైనా అధికారుల బదిలీలు సహజమే. పోలీసు శాఖలో సైతం ఎప్పటికప్పుడు బదిలీలు అవుతూనే ఉంటాయి.కానీ రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఫాలోయింగ్ ఉన్న అధికారిగా పేరు ఉన్న ఓ పోలీస్ అధికారి ట్రాన్స్ ఫర్ వెనక ఎన్నో గుసగుసలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయి. హీరోగా నీరాజనాలు అందుకున్న అధికారి తన సొంత శాఖతో పాటు చాలా మందిని తొక్కేస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.అదే సమయంలో మాజీ సీనియర్ పోలీసు అధికారి 'యూనిఫామ్ వేసుకున్న నేరస్తుడు సజ్జనార్' అంటూ అభివర్ణించడం కలకలం రేపుతున్నది.

(ప్రత్యేక ప్రతినిధి –సింగిడి)



కీలకమైన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ పోస్టులో ఉన్న వీసీ సజ్జనార్ కేవలం 14 నెలలకే బదిలీ కావడం పోలీస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వరంగల్ ఎన్‌కౌంటర్ తర్వాత ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అధికారి.. తనదైన పోలీసింగ్‌తో వార్తల్లో నిలిచిన అధికారి.. ఉన్నట్టుండి కీలక పోస్టు నుంచి మారడం వెనుక పరిపాలనా కారణాలతో పాటు అంతర్గత పరిణామాలపై చర్చ మొదలైంది.

హీరో ఇమేజ్.. రాజకీయ పరిచయాల ప్రచారం

హైదరాబాద్ సీపీగా పలు మార్పులకు శ్రీకారం చుట్టిన సజ్జనార్.. ప్రజల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కర్ణాటక రాజకీయ వర్గాలతో పరిచయాలు, భవిష్యత్తులో రాజకీయ రంగ ప్రవేశం వంటి అంశాలపై కూడా ప్రచారం సాగింది. అయితే ఆయన భవిష్యత్ వ్యూహాలపై సాగుతున్న ఈ ప్రచారానికి అధికారిక ఆధారాలు లేవు. 2



ప్రపంచ పెట్టుబడులకు
తెలంగాణ గమ్యస్థానం

70 దేశాల నుంచి 1,000 మంది ప్రతినిధులతో భారత్ సమిట్

తెలంగాణలోని అవకాశాలు, ప్రభుత్వ విధానాలను ప్రపంచానికి పరిచయం చేస్తాం

సమిట్‌ను అడ్డుకునేందుకు బీజేపీ ప్రయత్నించిందన్న సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణలో అపారంగా ఉన్న పెట్టుబడి అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే భారత్ సమిట్ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గ్లోబల్ సమిట్‌కు ముందుగానే భారత్ సమిట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే బెంగళూరు, చెన్నై, ఢిల్లీలో సన్నాహక సమావేశాలు నిర్వహించామని, త్వరలో ముంబయి, అహ్మదాబాద్‌లోనూ కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ సమిట్‌కు దాదాపు 70 దేశాల నుంచి 1,000 మంది ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు.

హైదరాబాద్, నవంబర్ 13 (సింగిడి) 2

ఫోన్ ట్యాపింగ్ కేసులో
త్వరలో బిగ్ ట్విస్ట్!

త్వరలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటాయి: రేవంత్‌రెడ్డి

నా ఫోన్ ట్యాప్ చేసినా భయపడేది లేదు..

నాకేం దాపరికం లేదు

మియాపూర్ భూములపై బీఆర్ఎస్ హెచ్చరికలు డబ్బుల కోసమే

కిషన్‌రెడ్డి వస్తానంటే నేనే వెళ్లి ఆహ్వానిస్తా

మోదీతో చర్చకు రాహుల్ సై!

నాతో చర్చకు వస్తే అనేక అంశాలు బయటపడతాయి

ఐదు అంశాలపై మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు.. మైక్ కట్ చేస్తున్నారు

పార్లమెంటే చర్చలకు సరైన వేదిక: నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మరోసారి బహిరంగ చర్చకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. తనతో ముఖాముఖి చర్చకు మోదీ అంగీకరిస్తే రాజకీయంగా అనేక కీలక విషయాలు బయటపడతాయని, ఆ తర్వాత ఆయన ప్రధానిగా కొనసాగలేరని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'అస్క్ మీ' కార్యక్రమంలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

న్యూఢిల్లీ, నవంబర్ 13 (సింగిడి) 2





హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన
మహేశ్ భగవత్

పోలీస్ కమిషనరేట్ లో పదవీ బాధ్యతలు 2

శాంతిభద్రతలు, మహిళా భద్రత, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యమని వెల్లడి

హైదరాబాద్ ఆటో డ్రైవర్లకు గుడ్‌న్యూస్

హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు!

ఆటోనగర్ కాలనీల నిర్మాణం

రూ.220 కోట్లతో 2,000 ఎల్ఐజీ ఫ్లాట్లు

బండ్లగూడ, గంధంగూడ, పేట్‌బషీర్‌బాద్, జల్‌పల్లి లక్ష్మీగూడలో నిర్మాణాలు

రాష్ట్రంలో సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని ఆటో కార్మికులకు ప్రత్యేకంగా ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం నగరంలోని నాలుగు ప్రాంతాల్లో ఆటోనగర్ కాలనీలను అభివృద్ధి చేయనుంది. మొత్తం రూ.220 కోట్ల వ్యయంతో 2,000 ఎల్ఐజీ (అల్పాదాయ వర్గాల) ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్, నవంబర్ 13 (సింగిడి) 2







విశాఖ సీఐఐలో రెండో రోజూ
పెట్టుబడుల వరద

ఎంఓయూలు కుదుర్చుకున్న 24 కంపెనీలు

విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో

రూ.1,05,634 కోట్ల విలువైన 24 ఎంఓయూలు

రాష్ట్రవ్యాప్తంగా యువతకు రానున్న 75,055 కొత్త ఉద్యోగావకాశాలు 2

డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధనం, ఐటీ రంగాల్లో భారీగా పెట్టుబడులు

విశాఖపట్నం వేదికగా జరుగుతున్న సీఐఐ 31వ భాగస్వామ్య సదస్సులో రెండో రోజు కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వెల్లువెత్తాయి. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ప్రముఖ పారిశ్రామిక సంస్థలు ఏపీ ప్రభుత్వంతో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. రెండో రోజు మొత్తం 24 సంస్థలు రూ.1,05,634 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి.

విశాఖపట్నం, నవంబర్ 13 (సింగిడి)

సగం ధరకే నెల ప్రయాణం

ప్రతి సండే ఫ్రీ జర్నీ! ... ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్



తెలంగాణ ప్రభుత్వం, ఆర్టీసీ మహిళలకు మరో గుడ్‌న్యూస్ చెప్పింది. రోజువారీ బస్సు ప్రయాణాన్ని మరింత పొదుపుగా, సౌకర్యవంతంగా మార్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ తమ నెలవారీ సీజన్ టికెట్ పథకం కింద 9 అదనపు సౌకర్యాలు, ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. ఈనెల 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వస్తాయని తెలిపింది. విద్యార్థులు, ఉద్యోగులు, నిత్య ప్రయాణికులకు ఈ నిర్ణయం ఆర్థికంగా ఎంతో ఊరటనిస్తుందని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది.

హైదరాబాద్ (సింగిడి) 2

అసోంలో ఘోర
రోడ్డు ప్రమాదం

మినీ బస్సు–కంటైనర్ ట్రక్కు ఢీ.. 23 మందికి పైగా దుర్మరణం

మరో 20 మందికి తీవ్ర గాయాలు.. మృతుల్లో కళాశాల విద్యార్థులు

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం హిమంత ఆదేశం

అసోంలో ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కజిరంగా జాతీయ పార్కు సమీపంలోని 715వ జాతీయ రహదారిపై మినీ బస్సు, కంటైనర్ ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్నాయి.

గువాహటి, నవంబర్ 13 (సింగిడి) 2



హైదరాబాద్ వేదికగా ప్రారంభమైన భారత్ సమ్మిట్ 2026

అభివృద్ధి కేంద్రీకృతం కావడం తీవ్ర అసమతుల్యతకు నిదర్శనమన్న మహేశ్ కుమార్ గౌడ్

ఆదిలాబాద్, ములుగు, నారాయణపేట వంటి జిల్లాల్లో పరిశ్రమలు నెలకొల్పాలని పిలుపు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే సమాన అభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసమని, కానీ ప్రస్తుతం రాష్ట్ర ఆదాయంలో సుమారు 40 శాతం కేవలం హైదరాబాద్ నగరం నుంచే వస్తుండటం తీవ్రమైన అసమతుల్యతకు నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

హైదరాబాద్, నవంబర్ 13 (సింగిడి) 2

ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం

ప్రతినిధులను అడ్డుకున్నారు

భారత్ సమిట్‌కు హాజరుకావాల్సిన కొంతమంది విదేశీ ప్రతినిధులను చివరి నిమిషంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మరికొందరు విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత కూడా వెనుదిరగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావాలనే ప్రయత్నాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

విపక్షాలకు ఎందుకంత వ్యతిరేకత?

వాతావరణ మార్పులు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల అంశాలపై భారత్ సమిట్‌లో విస్తృతంగా చర్చిస్తున్నామని సీఎం వివరించారు. తెలంగాణ, హైదరాబాద్‌లోని అభివృద్ధి అవకాశాలను ప్రపంచ ప్రతినిధులకు ప్రత్యక్షంగా చూపించి రాష్ట్రంపై విశ్వాసం పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అయితే ఈ సమిట్‌పై కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు, కేసీఆర్ ఎందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. విపక్షాలు సమిట్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని విమర్శించారు.

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే చర్చలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి ప్రణాళికలను అంతర్జాతీయ వేదికపై వివరించనున్నట్లు తెలిపారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో బిగ్ ట్విస్ట్!

హైదరాబాద్, నవంబర్ 13 (సింగిడి)

తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో త్వరలోనే ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటాయని వెల్లడించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆయన.. పలు రాజకీయ అంశాలపై స్పందించారు. కేంద్ర ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాప్ చేసినా ఎలాంటి అభ్యంతరం లేదని, తాను మాట్లాడే ప్రతి మాట బహిరంగమేనని వ్యాఖ్యానించారు.

మోదీతో భేటీ వెనుక ఖేలో ఇండియా ఆహ్వానం

ఖేలో ఇండియా పోటీలకు ఆహ్వానించేందుకే ఎల్లుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలవనున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. మరోవైపు మియాపూర్ భూముల వేలాన్ని అడ్డుకుంటామంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రకటనల వెనుక డబ్బుల వ్యవహారం ఉందని ఆరోపించారు. గతంలో ల్యాంకో హిల్స్, పద్మాలయ భూములపై ఉద్యమ సమయంలో పెద్ద ఎత్తున విమర్శలు చేసిన నేతలు అధికారంలోకి వచ్చాక వాటి గురించి మాట్లాడలేదని విమర్శించారు.

కవిత ఇంటిపై డ్రోన్ వ్యవహారం.. నాకేం తెలియదు

ఎమ్మెల్సీ కవిత ఇంటిపై డ్రోన్ ఎవరు ఎగరేశారో తనకు తెలియదని సీఎం స్పష్టం చేశారు. ఆమె కుటుంబంలో జరుగుతున్న వివాదాల నేపథ్యంలోనే ఏదైనా జరిగి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఆ వ్యవహారాన్ని సంబంధిత కుటుంబ సభ్యులే తేల్చుకుంటారని పేర్కొన్నారు.

కేటీఆర్ గడ్డంపై సీఎం సెటైర్లు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గడ్డం పెంచుకుంటే అది ఆయన మోకాళ్లకే అడ్డం వస్తుందని, తనకెలాంటి ఇబ్బంది ఉండదని రేవంత్‌రెడ్డి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారతీయుల ఆత్మ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొంటూ బీజేపీపై విమర్శలు చేశారు. స్వాతంత్ర్యానికి ముందు బీజేపీ లేదని, మరో పాతికేళ్ల తర్వాత కూడా ఆ పార్టీ ఉండదని వ్యాఖ్యానించారు.

ఆహ్వానించకపోవడానికి కారణం అదే!

ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ కర్టెన్ రైజర్' కార్యక్రమానికి ఆహ్వానించినప్పటికీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ హాజరు కాలేదని సీఎం తెలిపారు. అందుకే భారత్ సమిట్‌కు వారిని ఆహ్వానించలేదని స్పష్టం చేశారు. అయితే కిషన్‌రెడ్డి హాజరవుతానంటే తానే స్వయంగా వెళ్లి ఆహ్వానిస్తానని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్ ఆటో డ్రైవర్లకు గుడ్‌న్యూస్

బండ్లగూడ, గంధంగూడ, పేట్‌బషీర్‌బాద్, జల్‌పల్లి లక్ష్మీగూడ ప్రాంతాల్లో తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఈ కాలనీల నిర్మాణం చేపట్టనున్నారు. ఒక్కో ప్రాంతంలో 500 ఫ్లాట్ల చొప్పున మొత్తం 2,000 ఇళ్లను నిర్మించనున్నారు. ఇందిరమ్మ ఎల్ఐజీ టవర్లకు వర్తించే విధివిధానాలు, అర్హతలు, కేటాయింపు ప్రక్రియనే ఆటోనగర్ కాలనీలకు కూడా వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

జిల్లాల్లోనూ ఇందిరమ్మ టవర్లు

మరోవైపు హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లోనూ ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, హనుమకొండల్లో ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం హౌసింగ్ బోర్డు భూముల్లో రూ.204 కోట్లతో 2,400 ఎల్ఐజీ ఫ్లాట్లను నిర్మించనుంది.

డిసెంబర్ 5 వరకు దరఖాస్తులు

ఇందిరమ్మ టవర్లలో ఫ్లాట్ల కేటాయింపు కోసం హౌసింగ్ బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అల్పాదాయ కుటుంబాలు మీ సేవ కేంద్రాల ద్వారా డిసెంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తుతో పాటు రూ.10 వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. లబ్ధిదారుల ఎంపిక, ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం చేపట్టనున్నారు.

హైదరాబాద్ వేదికగా ప్రారంభమైన భారత్ సమ్మిట్ 2026

హైదరాబాద్‌లో ఈరోజు ప్రారంభమైన 'భారత్ సమ్మిట్-2026' సదస్సులో భాగంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ – ఎకనామిక్ జస్టిస్' చర్చాగోష్ఠిలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే అభివృద్ధి కేవలం రాజధాని నగరానికే పరిమితం కాకుండా రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఆదిలాబాద్, ములుగు, నారాయణపేట వంటి వెనుకబడిన జిల్లాల్లోనూ పరిశ్రమలు భారీగా ఏర్పాటు కావాలని, అప్పుడే సమగ్ర ఆర్థిక న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగితేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ఆదాయ వనరులు రాష్ట్రమంతటా విస్తరించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రాంతాల వారీగా ఉన్న వ్యత్యాసాలను తొలగించి, సమతుల్య అభివృద్ధి సాధించడమే తెలంగాణ అసలైన లక్ష్యమని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ భారత్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రగతి, ఆర్థిక న్యాయంపై పలువురు ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు.

అసోంలో ఘోర రోడ్డు ప్రమాదం

రంగాజన్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో 23 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. బోకాఖాత్ నుంచి నాగావ్ వైపు వెళ్తున్న ప్రయాణికుల బస్సు ఎదురుగా వస్తున్న కంటైనర్ ట్రక్కును ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రతకు బస్సు పూర్తిగా నుజ్జునుజ్జయింది. పలువురు ప్రయాణికులు వాహనంలోనే చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు మహిళలతో పాటు పలువురు కళాశాల విద్యార్థులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. తరగతులు ముగించుకుని ఇళ్లకు తిరిగి వెళ్తుండగా విద్యార్థులు ఈ ప్రమాదానికి గురయ్యారు. బస్సులో సుమారు 35 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. అయితే కచ్చితమైన సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉంది.

బెంగళూరులో మెట్రో పింక్ లైన్ ప్రారంభం

బెంగళూరు, నవంబర్ 13 (సింగిడి)



భారత్ తీసుకున్న చొరవతో యోగా ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రాచుర్యం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. విదేశీ పర్యటనల్లో విందు కార్యక్రమాల సందర్భంగా పలువురు యోగా గురించే తనతో ఎక్కువగా మాట్లాడుతున్నారని వెల్లడించారు. భారతదేశాన్ని అర్థం చేసుకోవడానికి యోగా ఒక ప్రధాన మార్గంగా మారిందని పేర్కొన్నారు. కర్ణాటకలోని స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థ (ఎస్-వ్యాస) ప్రధాన కార్యాలయం ప్రశాంతి కుటీరం స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేరళలోని తిరువనంతపురంలో ఎస్-వ్యాస ప్రాంగణాన్ని ప్రారంభించారు. యోగాకు విశేష సేవలందించిన పలువురు గురువులకు కర్ణాటక జన్మనిచ్చిందని, దివంగత కన్నడ నటుడు డాక్టర్ రాజ్‌కుమార్ గొప్ప యోగ సాధకుడని మోదీ గుర్తుచేశారు.

ప్రాచీన జ్ఞానాన్ని ప్రపంచంతో పంచుకోవాలి

భారతదేశ ప్రాచీన జ్ఞాన సంపదను, ఆధునిక పరిశోధనలను ప్రపంచ మానవాళితో పంచుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. యోగా ప్రభావం అంతర్జాతీయంగా విస్తరిస్తోందని, ఆయుష్ ఉత్పత్తులు, మూలికా ఔషధాల ఎగుమతులు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ఆయుర్వేదం, ఆయుర్వేద ఆధారిత పేటెంట్లకు సంబంధించిన పరిశోధనలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వివరించారు. విదేశాల నుంచి సంప్రదాయ వైద్య చికిత్సల కోసం భారత్‌కు వచ్చే వారికి సౌకర్యంగా ఇ-ఆయుష్ వీసా విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ ట్రెడిషనల్ మెడిసిన్ సెంటర్‌ను గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఏర్పాటు చేయడం కూడా ఈ దిశగా కీలక పరిణామమని పేర్కొన్నారు.

ఒత్తిడి, జీవనశైలి వ్యాధులపై పరిశోధనలు

స్వామి వివేకానంద స్ఫూర్తితో ప్రశాంతి కుటీరం వంటి సంస్థలు ఏర్పాటయ్యాయని మోదీ అన్నారు. యోగాను సామాన్య ప్రజలకు చేరువ చేయడంతో పాటు ఆధునిక శాస్త్రీయ ప్రమాణాలతో పరిశోధనలు నిర్వహించడం ఈ సంస్థ ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఒత్తిడి, జీవనశైలి సంబంధిత వ్యాధుల సమస్యలకు పరిష్కారాలు కనుగొనే దిశగా ఇక్కడ జరిగిన పరిశోధనలు ప్రపంచానికి ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అంకితభావం, సామర్థ్యం, క్రమశిక్షణ కలిగిన పౌరుల తోనే దేశం అభివృద్ధి సాధిస్తుందని హెచ్‌వీ శేషాద్రి విశ్వసించారని, వ్యక్తి వికాసం ద్వారా దేశ నిర్మాణం సాధ్యమనే లక్ష్యంతో ఆయన జీవితాన్ని అంకితం చేశారని గుర్తుచేశారు.

బెంగళూరులో మెట్రో పింక్ లైన్ ప్రారంభం

మరోవైపు బెంగళూరు ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మెట్రో పింక్ లైన్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. కాలేన అగ్రహార నుంచి తావరెకెరె వరకు సుమారు రూ.3,470 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ మార్గాన్ని జాతికి అంకితం చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి జెండా ఊపి మెట్రో సేవలను ప్రారంభించారు. అనంతరం స్వయంగా టికెట్ కొనుగోలు చేసి డీకే శివకుమార్‌తో కలిసి మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్, ఎంపీ తేజస్వీ సూర్య, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సజ్జనార్ బదిలీలో సవాలక్ష గుసగుసలు

ఆధిపత్య పోరు.. అంతర్గత అసంతృప్తి

నగరంలో పెరుగుతున్న నేరాలు, పోలీస్ స్టేషన్ల పనితీరు, కింది స్థాయి అధికారులపై అవినీతి ఆరోపణలు పోలీస్ శాఖకు సవాలుగా మారాయి. కీలక బాధ్యతల పంపిణీ, సీనియర్ అధికారుల మధ్య సమన్వయం, కొందరి ఆధిపత్యంపై అసంతృప్తి నెలకొందనే ప్రచారం వినిపిస్తోంది. ఈ పరిణామాలు ఉన్నతస్థాయికి చేరాయనే చర్చ కూడా సాగుతోంది.

పోస్టింగుల వెనుక...?

బదిలీలు, పోస్టింగుల్లో డబ్బుల లావాదేవీలు జరిగాయనే ఆరోపణలు, భూవివాదాల్లో పోలీసుల పాత్రపై ఫిర్యాదులు, జూబ్లీహిల్స్ మాజీ సీఐ శ్రీనివాసులురెడ్డి పోస్టింగ్ వ్యవహారం వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి. వీటిపై నిఘా, ఏసీబీ వర్గాలు ఏమైనా ఆధారాలు సేకరించాయా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

వివాదాస్పద వ్యవహారాలు.. పెరిగిన అనుమానాలు

కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ వ్యవహారం, ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు చార్జిషీట్ అంశం, ఉన్నతాధికారుల మధ్య బాధ్యతల విషయంలో తలెత్తిన విభేదాలపై కూడా చర్చ సాగుతోంది. ఈ అంశాలకు సజ్జనార్ బదిలీతో సంబంధం ఉందనే ప్రచారానికి మాత్రం ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ లేదు.

బదిలీతో ముగియని చర్చ

వరంగల్ ఎన్‌కౌంటర్ నుంచి ప్రజల్లో హీరో ఇమేజ్.. హైదరాబాద్ సీపీగా కీలక బాధ్యతలు.. పోలీస్ శాఖలో సంస్కరణల ప్రయత్నాలు.. ఇప్పుడు అనూహ్య బదిలీ. ఈ మొత్తం పరిణామాలు పోలీస్ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వెనుక అసలు పరిపాలనా కారణాలు వెల్లడైతేనే ప్రచారాలకు తెరపడుతుంది. అప్పటివరకు సజ్జనార్ బదిలీ పోలీస్ శాఖలో హాట్‌టాపిక్‌గానే కొనసాగనుంది.

రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానోత్సవం

న్యూఢిల్లీ, నవంబర్ 13 (సింగిడి)



క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు, కోచ్‌లకు ఇచ్చే జాతీయ క్రీడా పురస్కారాల-2025 ప్రదానోత్సవం శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులు అందజేసి సత్కరించారు. డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, ఫిడే మహిళల ప్రపంచ కప్ విజేత దివ్య దేశ్‌ముఖ్‌తో పాటు మొత్తం 15 మంది క్రీడారత్నాలు అర్జున అవార్డును అందుకున్నారు.
కామన్వెల్త్ గేమ్స్‌లో డెకాథ్లాన్‌లో కాంస్య పతకం సాధించి, ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించాడు. అదేవిధంగా ఫిడే మహిళల ప్రపంచ కప్-2025 గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా దివ్య దేశ్‌ముఖ్ రికార్డు సృష్టించింది. ఫైనల్‌లో దిగ్గజ క్రీడాకారిణి కోనేరు హంపిపై ఆమె విజయం సాధించింది. వీరితో పాటు అథ్లెట్ మహమ్మద్ అజ్మల్, బాక్సర్ నరేందర్, చెస్ ప్లేయర్ విదిత్ గుజరాతి, హాకీ క్రీడాకారులు లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ సహా పలువురు క్రీడాకారులు అర్జున పురస్కారాన్ని స్వీకరించారు. కాగా, జపాన్ మాస్టర్స్‌లో పాల్గొంటున్నందున మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ త్రీసా జాలీ, పుల్లెల గాయత్రి గోపీచంద్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు యెషయా అరుమైనియాగం 'అర్జున అవార్డు (జీవిత కాల సాఫల్యం)' అందుకున్నాడు.
వివిధ క్రీడల్లో అత్యుత్తమ కోచ్‌లకు అందించే ద్రోణాచార్య అవార్డును అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్‌లు ఛోటే లాల్ యాదవ్, ధర్మేంద్ర సింగ్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్, రెజ్లింగ్ కోచ్ వీరేంద్ర కుమార్‌లకు ప్రదానం చేశారు. సాహస క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి టెన్సింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలను అందజేశారు.
క్రీడల ప్రోత్సాహానికి విశేష కృషి చేసినందుకు గాను పుణెలోని ఆర్మీ పారాలింపిక్ నోడ్‌కు 'రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్' లభించింది. లెఫ్టినెంట్ కర్నల్ దల్జీత్ సింగ్ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.
సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు క్రీడా మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ఆగస్టు 18న అవార్డు గ్రహీతల తుది జాబితాను ప్రకటించింది. సాధారణంగా ప్రతి ఏటా ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఆగస్టు 29న ఈ అవార్డుల ప్రదానం జరుగుతుంది. అయితే, ఒలింపిక్స్, కామన్వెల్త్, ఆసియా క్రీడలు జరిగిన సంవత్సరాల్లో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తుంటారు. ఈ క్రమంలోనే ఏడాదికి పైగా ఆలస్యంగా 2025 సంవత్సరపు అవార్డులను ఇప్పుడు ప్రదానం చేశారు.

విశాఖ సీఐఐలో రెండో రోజూ పెట్టుబడుల వరద

ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్రంలోని యువతకు దాదాపు 75,055 ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల వాతావరణం ఉండటంతో ఏరోస్పేస్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, హెల్త్‌కేర్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ ఇన్వెస్టర్లు తీవ్ర ఆసక్తి కనబరిచారు. వీటిలో ప్రధానంగా పంచశీల్ రియాల్టీ సంస్థ రూ.37,000 కోట్లతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకోగా, ఏఎం ఏఐ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.31,387 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ నెలకొల్పేందుకు అంగీకారం తెలిపింది.
రెండో రోజు కుదిరిన 24 అవగాహనా ఒప్పందాల వివరాలు:
1. సాల్వో ఇండస్ట్రీస్: రూ.800 కోట్ల పెట్టుబడి – 2,000 ఉద్యోగాలు
2. బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్: రూ.550 కోట్ల పెట్టుబడి – 565 ఉద్యోగాలు
3. ఐజీ డిఫెన్స్: రూ.500 కోట్ల పెట్టుబడి – 1,000 ఉద్యోగాలు
4. ఆర్చియన్ గ్రూప్: రూ.2,000 కోట్ల పెట్టుబడి – 1,200 ఉద్యోగాలు
5. కెయిన్స్ టెక్నాలజీ ఇండియా: రూ.3,145 కోట్ల పెట్టుబడి – 2,000 ఉద్యోగాలు
6. ఏఐఎల్ డిక్సాన్ టెక్నాలజీస్: రూ.450 కోట్ల పెట్టుబడి – 7,000 ఉద్యోగాలు
7. పంచశీల్ రియాల్టీ (హైపర్‌స్కేల్ డేటా సెంటర్): రూ.37,000 కోట్ల పెట్టుబడి – 32,000 ఉద్యోగాలు
8. వారీ ఎనర్జీస్: రూ.10,000 కోట్ల పెట్టుబడి – 1,000 ఉద్యోగాలు
9. క్లీన్‌మాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్: రూ.8,000 కోట్ల పెట్టుబడి – 50 ఉద్యోగాలు
10. ఈపాక్ డేటా సెంటర్ సొల్యూషన్స్: రూ.570 కోట్ల పెట్టుబడి – 2,565 ఉద్యోగాలు
11. ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్: రూ.10 కోట్ల పెట్టుబడి – 100 ఉద్యోగాలు
12. హూరిబా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్: వర్క్‌ఫోర్స్ ట్రైనింగ్ కోసం ఒప్పందం
13. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ : అమరావతిలో క్లైమేట్ రెస్పాన్స్ అర్బన్ ప్లానింగ్ ఒప్పందం
14. సముద్ర సూర్య: రూ.100 కోట్ల పెట్టుబడి – 50 ఉద్యోగాలు
15. పీవీఎస్ రామ్మోహన్ హెల్త్‌కేర్: రూ.312 కోట్ల పెట్టుబడి – 1,500 ఉద్యోగాలు
16. సబ్‌స్టేట్ మాన్యుఫాక్చరింగ్ ఇండియా: రూ.931 కోట్ల పెట్టుబడి – 4,000 ఉద్యోగాలు
17. ఇన్ఫినిటీ: రూ.250 కోట్ల పెట్టుబడి – 1,100 ఉద్యోగాలు
18. సైయింట్ & హిందుస్థాన్ షిప్‌యార్డ్: రూ.1,000 కోట్ల పెట్టుబడి
19. ఏఎం ఏఐ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్: రూ.31,387 కోట్ల పెట్టుబడి – 1,000 ఉద్యోగాలు
20. కిమ్స్ హాస్పిటల్స్: రూ.1,500 కోట్ల పెట్టుబడి – 2,000 ఉద్యోగాలు
21. యోధ హెల్త్‌కేర్ & హాస్పిటల్స్: రూ.1,359 కోట్ల పెట్టుబడి – 4,925 ఉద్యోగాలు
22. పవన్ హాన్స్: హెలీపోర్ట్స్ అభివృద్ధి కోసం అవగాహన ఒప్పందం
23. స్మాక్స్ డిజిటెక్ ఇండియా (ఏపీ స్పోర్ట్స్ విలేజ్): రూ.4,270 కోట్ల పెట్టుబడి – 8,000 ఉద్యోగాలు
24. స్మాక్స్ డిజిటెక్ ఇండియా (డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ క్లబ్స్ & ఎరీనా): రూ.1,500 కోట్ల పెట్టుబడి – 3,000 ఉద్యోగాలు



మోదీతో చర్చకు రాహుల్ సై!

పార్లమెంటులో చర్చకు అవకాశం ఉందని బీజేపీ నేతలు చెబుతున్నప్పటికీ, తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు.

అనేక అంశాలపై మాట్లాడనివ్వడం లేదు

వ్యవసాయ చట్టాలు, ఓట్ల చోరీ, చైనా వ్యవహారం, మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే పుస్తకం, ఎప్‌స్టీన్ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించకుండా అడ్డుకున్నారని రాహుల్ ఆరోపించారు. సభలో తన మైక్రోఫోన్‌ను కూడా నిలిపివేశారని పేర్కొన్నారు. పార్లమెంటులో సుదీర్ఘ ప్రసంగాల కంటే ప్రధానితో నేరుగా ముఖాముఖి చర్చ జరగాలని కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఈ చర్చకు మధ్యవర్తిగా అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ లేదా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను నియమించినా తనకు అభ్యంతరం లేదన్నారు.

రాహుల్‌కు బీజేపీ కౌంటర్

రాహుల్ సవాల్‌పై బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. పార్లమెంటులో చర్చలకు రాహులే దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. బహిరంగ చర్చకు ప్రధానిని ఆహ్వానించడం కంటే పార్లమెంటులోనే చర్చించాలని సూచించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. చర్చలకు పార్లమెంటే సరైన వేదిక అని పేర్కొన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ మరింత బాధ్యతాయుతంగా, గంభీరంగా వ్యవహరించాలని హితవు పలికారు. సోనియా పుస్తకంపై ఆసక్తికర వ్యాఖ్యలు
తన తల్లి సోనియా గాంధీ ఇటీవల విడుదల చేసిన 'బీలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంపైనా రాహుల్ స్పందించారు. ఆ పుస్తకం ఎంతో గొప్పదని, బీజేపీ నేతలు సైతం ఆసక్తిగా చదువుతున్నారని అన్నారు.

తెలంగాణ జైళ్ల శాఖకు అరుదైన గౌరవం

హైదరాబాద్, నవంబర్ 13 (సింగిడి)

తెలంగాణ కారాగారాలు, సంస్కరణ సేవల విభాగం దేశంలోనే మునుపెన్నడూ లేని విధంగా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. చర్లపల్లి సెంట్రల్ జైలుతో పాటు చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ సంస్థలు మొత్తం 6 ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఐఎస్ఓ సర్టిఫికెట్లను సాధించాయి. భారత జైళ్ల చరిత్రలోనే ఒక రాష్ట్ర కారాగారాల శాఖకు ఒకేసారి ఇన్ని ఐఎస్ఓ గుర్తింపులు లభించడం ఇదే తొలిసారి అని డెక్కన్ క్రానికల్ తన కథనంలో పేర్కొంది. ప్రపంచ క్వాలిటీ వీక్ (నవంబర్ 9 నుంచి 13 వరకు), నాణ్యతా మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఈ సర్టిఫికెట్లను అధికారులకు అందజేశారు.

సగం ధరకే నెల ప్రయాణం

దూర పరిమితి లేకుండా

నెలవారీ సీజన్ టికెట్ల జారీకి ఇప్పటివరకు ఉన్న దూర పరిమితిని పూర్తిగా తొలగిస్తున్నట్లు తెలిపింది. నిర్దేశించిన రూట్, ఛార్జీల నిబంధనలకు లోబడి, ప్రయాణికులు ఇకపై ఎలాంటి దూర పరిమితి లేకుండా నెలవారీ సీజన్ టికెట్లను పొందవచ్చని వివరించింది. పాస్ ధరలను మరింత తగ్గించే క్రమంలో టోల్ ప్లాజా ఛార్జీలను ప్రస్తుతం ఉన్న 25 రోజులకు బదులుగా కేవలం 20 రోజులకు మాత్రమే లెక్కించనున్నారని వెల్లడించింది.

ఆదివారాల్లో ఉచిత ప్రయాణం!

అంతేకాకుండా, సాధారణ ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ ఎంపికను అందించేందుకు డీలక్స్ నెలవారీ సీజన్ టికెట్లను టీజీఎస్ ఆర్టీసీ ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించింది. ఈ పాస్‌లు 'ఇ-డీలక్స్' సర్వీసులలో ప్రయాణానికి కూడా చెల్లుబాటు అవుతాయని స్పష్టతనిచ్చింది. నెలవారీ సీజన్ టికెట్ హోల్డర్లకు ప్రత్యేక ప్రయోజనంగా హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్ నగరాల్లో నడిచే అన్ని కేటగిరీల సిటీ బస్సు సర్వీసులలో ఆదివారాల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును కల్పిస్తున్



పురపాలక సంఘం ముట్టడిని జయప్రదం చేయండి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 13 (సింగిడి)

సిరిసిల్ల పట్టణంలోని కొత్తచెరువు నాలాలను పునరుద్ధరించాలని పూర్వపు నాళాలను గుర్తించి చెరువు నీళ్లు యధావిధిగా పోయేటట్టు చర్యలు తీసుకోవాలని. అక్రమ దారులపై చర్యలు తీసుకోవాలని. గత కొద్ది రోజులుగా చేస్తున్న ఆందోళనలో భాగంగా రేపు సిరిసిల్ల పురపాలక సంఘం కార్యాలయం ముట్టడి జరుగుతుంది ఇందులో శ్రీనగర్ కాలనీ శాంతినగర్ ప్రజల ఇబ్బందుల మీద అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శ్రీనగర్ కాలనీ కచ్చా కాలువ రద్దు చేయాలని సర్వే నంబర్ 39 రోడ్డం నాలా ఓపెన్ చేసి గతంలో ఏ మాదిరిగా సహజ నాళాల ద్వారా కొత్తచెరువు నీరు పోతుందేనో అదేవిధంగా పోయేటట్టు చేయాలని చంద్రంపేట ఎక్స్ రోడ్ నుండి సిరిసిల్ల మొదటి బైపాస్ ను కలిపే రోడ్డు పనులు పూర్తి చేయాలని సర్వే నెంబర్ 71,72లలో విధించిన నిషేధం ఎత్తివేయాలని 22 ఏ పేదల ప్లాట్లలో ఎత్తివేయాలని మున్సిపాల్ కు లేఔట్ గా వదిలిన సుమారు పది గుంటల పైగా భూమిని స్వాధీనం చేసుకోవాలని రేపు ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేయడం జరుగుతుంది ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చెప్పి ఏ ఐ ఎఫ్ టి యు న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం నాయకులు కొండ శ్యామ్, ఆకన సత్తయ్య, బొల్లబత్తిని ఎల్లయ్య,గుజ్జ దేవ దాసులు పిలుపునిచ్చినారు.

పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
పెరుగుతున్న చలితీవ్రత
తెల్లవారుజామున పొగమంచు
సాయంత్రం నుంచే చలిగాలుల ప్రభావం

చలి పంజా.. వణుకుతున్న పల్లెలు!

కామారెడ్డి జిల్లా ప్రతినిధి:

కామారెడ్డి జిల్లాను చలి పంజా వణికిస్తోంది. రోజు రోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో, తెల్లవారుజామున చలితీవ్రత అధికంగా ఉండటంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఉదయం వేళల్లో పొగమంచు కమ్ముకోవడం, సాయంత్రం నుంచే చల్లని గాలులు వీస్తుండటంతో జనజీవనం కొంతమేర స్తంభిస్తోంది.12.7 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలుజిల్లాలోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతున్నాయి. సాక్షి పత్రికలో ప్రచురితమైన వాతావరణ వివరాల ప్రకారం కామారెడ్డి ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.7 డిగ్రీలుగా నమోదైంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలితీవ్రత పెరుగుతోంది. రాబోయే రోజుల్లో వాతావరణ పరిస్థితులను బట్టి చలి ప్రభావం మరింత పెరిగే అవకాశముంది.ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీచలి తీవ్రత పెరగడంతో ప్రజలు స్వెట్టర్లు, జర్కిన్లు, మఫ్లర్లు, దుప్పట్లు వంటి ఉన్ని దుస్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు చలి నుంచి రక్షణ పొందేందుకు వెచ్చని దుస్తులను వినియోగిస్తున్నారు. రాత్రి వేళల్లో బయట పనిచేసే కార్మికులు, కాపలాదారులు, ప్రయాణికులు చలితో ఇబ్బందులు పడుతున్నారు.పిల్లలు, వృద్ధులు





అప్రమత్తంగా ఉండాలిచలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలున్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం, రాత్రి వేళల్లో అవసరం లేకుండా బయటకు వెళ్లకపోవడం, వెచ్చని దుస్తులు ధరించడం, గోరువెచ్చని నీటిని తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలి. వాహనదారులు పొగమంచు సమయంలో వేగాన్ని తగ్గించి ప్రయాణించాలి.చలిపై అప్రమత్తతే శ్రీరామరక్షప్రకృతి మార్పులతో పెరుగుతున్న చలితీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.



ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుపేదలు, వృద్ధులు, నిరాశ్రయులకు చలి నుంచి రక్షణ కల్పించే చర్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలి. చలి ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.చలి పంజా నుంచి రక్షణ పొందాలంటే ముందస్తు జాగ్రత్తలే మార్గం.

స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలి



గాంధారి మండల కార్యవర్గ సమావేశంలో
జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు పిలుపు

కామారెడ్డి/ గాంధారి నవంబర్ 13 (సింగిడి)

గాంధారి: భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకునే దిశగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు పిలుపునిచ్చారు.గాంధారి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు ఈకే మధుసూదన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు.గ్రామస్థాయిలో పార్టీకి పటిష్టమైన పునాదులు ఏర్పాటు చేసుకోవాలని, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సీనియర్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఐదు బూత్‌లకు ఒక ఇన్‌చార్జిని నియమించి, వారు ఆయా బూత్‌ల పరిధిలోని కార్యకర్తలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.అదేవిధంగా గాంధారి మండలంలో పార్టీకి అనుబంధంగా ఉన్న అన్ని మోర్చాల అధ్యక్షుల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేసి, ప్రతి విభాగాన్ని క్రియాశీలకంగా పనిచేసేలా చూడాలని మండల అధ్యక్షుడికి, సీనియర్ నాయకులకు సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పోతంగల్ కిషన్ రావు, మాజీ మండల అధ్యక్షుడు సాయిబాబా, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సీనియర్ నాయకులు సాయి గౌడ్, మాణిక్ రావు, హుస్సేన్, సంజు, తిమ్మాపూర్ సర్పంచ్ సంజీవులు, రమేష్, మండల ప్రధాన కార్యదర్శులు రాంసింగ్, సతీష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సంజీవులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ బి ఐ ఏటీఎం చోరీ కేసును
ఛేదించిన ఎల్లారెడ్డిపేట పోలీసులు
పలు రాష్ట్రాల్లో ఏటీఎంలే లక్ష్యంగా
వరుస చోరీలకు పాల్పడుతున్న
అంతరాష్ట్ర ముఠా
రాజస్థాన్ కు చెందిన ఇద్దరు
అంతరాష్ట్ర నిందితుల అరెస్ట్,
రిమాండ్ కు తరలింపు
వివరాలు వెల్లడించిన సిరిసిల్ల డిఎస్పీ
నాగేంద్రచారి

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 13 (సింగిడి)



తెల్లవారుజామున ఎల్లారెడ్డిపేటలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ సమీపంలో ఉన్న ఎస్ బి ఐ ఏటీఎం లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి, ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.6,06,100 నగదును చోరీ చేయడంతో పాటు ఏటీఎం యంత్రాన్ని సైతం ఎత్తుకెళ్లారు. ఈఘటనపై హిటాచీ పేమెంట్స్ సర్వీసెస్ కంపెనీ ఛానల్ మేనేజర్ దాడిగల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగింది. డిఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీటీవి ఫుటేజ్, సాంకేతిక ఇతర శాస్త్రీయ ఆధారాల ఆధారంగా నిందితులను రాజస్థాన్ కి.చెందిన బహదూర్ చౌకీదార్ ప్రతాబ రామ్ బవారీ , గోపాల్ తేజారామ్ బవారీ లుగా గుర్తించి వారిని అదుపులోకి అరెస్ట్ చేసి విచారించగా గతంలో రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో పలు ఏటీఎం చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలగా నింధితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి ఏటీఎం కేంద్రాలు, బ్యాంకులు మరియు ఇతర ముఖ్యమైన ప్రదేశాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసులకు సమాచారం అందించాలి. నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

నేడు అపర్ణ హాస్పిటల్ లో అరుదైన కొక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్ర చికిత్స

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 13(సింగిడి)

ఉత్తర తెలంగాణలోనే ప్రప్రథమంగా ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అరుదైన కొక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్ర చికిత్స హనుమకొండలోని అపర్ణ ఇఎన్ టి హాస్పిటల్ లో ఈ నెల 14న శనివారం నిర్వహించబడుతున్నది.గత నలభై సంవత్సరాలుగా ఉత్తర తెలంగాణ ప్రజలకు అధునాతన వైద్య విధానాలతో విశేష సేవలందిస్తున్న అపర్ణ హస్పటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఏకనాథం, డైరెక్టర్ డాక్టర్ సుదీప్ ఆధ్వర్యంలో అరుదైన అత్యంత ఖర్చుతో కూడిన కొక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్ర చికిత్స పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మోహన్ కామేశ్వరన్ చేతుల మీదుగా నిర్వహిస్తుండగా, శస్త్ర చికిత్స ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించడానికి తెలంగాణ రాష్ట్ర పలు మూలల నుండి పదుల సంఖ్యలో వైద్యులు విచ్చేయుచున్నారు. అరుదైన అంత్యంత ఖర్చుతో కూడుకున్న ఈ శస్త్ర చికిత్సను ఉత్తర తెలంగాణలోనే మొదటిసారిగా ప్రైవేటు రంగంలో తమ ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహించడం పట్ల డాక్టర్ ఏకనాథం, డాక్టర్ సుదీప్ హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇలాంటి బృహత్తర కార్యక్రమాలను తమ ఆసుపత్రి ఆధర్యంలో భవిష్యత్తులో" కూడా ఉచితంగా నిర్వహించే దిశగా వారు అడుగులు వేస్తున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ప్రత్యేక అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హాజరుకానున్నారు. కాగా 3 సంవత్సరముల బాబుకు పుట్టుకతో మూగ, చెవిటి లక్షణములు ఉన్నవి. ఈ బాబుకి 10 లక్షల రూపాయలతో కూడుకున్న కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్ర చికిత్సను ఉచితంగా చేయడం జరుగుతున్నది.

సీఎం సభకు 16 ఎకరాల స్థలం ఖరారు

19న రేవంత్ రెడ్డి పర్యటన..
ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్, పోలీస్ కమిషనర్

సిద్ధిపేట ప్రతినిధి, నవంబరు 13, (సింగిడి):

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 19న సిద్ధిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభకు అధికారులు స్థలాన్ని ఖరారు చేశారు. నాగదేవత గుడి సమీపంలోని నందాల వెంకటలక్ష్మి గార్డెన్ వెనుక వైపు బైపాస్ రోడ్డు, చిన్నగుండవెల్లి రోడ్డును ఆనుకొని ఉన్న సుమారు 16 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.మారిన సభా వేదిక స్థలం మొదట జిల్లా కేంద్రంలోని నాగదేవత గుడి నుంచి సిరిసిల్ల వెళ్లే బైపాస్ రోడ్డు పక్కన స్థలాన్ని ప్రతిపాదించారు. కొన్ని అనివార్య కారణాలతో దాన్ని మార్చి నాగదేవత గుడి ముందు భాగంలోని నందాల వెంకటలక్ష్మి గార్డెన్ వెనుక ఉన్న స్థలాన్ని ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు.యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లుఎంపిక చేసిన స్థలానికి హద్దులు గుర్తించాలని రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. ప్రాంగణంలోని చెట్లు, పొదలు, పిచ్చిమొక్కలను తొలగించి జేసీబీలతో చదును చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం సభా వేదిక, వీవీఐపీ పార్కింగ్, మీడియా గ్యాలరీ, ప్రజాప్రతినిధులు, ప్రజల సీటింగ్ ఏర్పాట్లు, బస్సులు, ఇతర వాహనాల పార్కింగ్‌కు సంబంధించిన సమగ్ర మ్యాప్‌ను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పనులన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.పరిశీలనలో ఆర్డీవో సదానందం, ఏసీపీ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ హరికిరణ్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కనిపించకుండా పోయిన యువకుడు

ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి

మానకొండూర్, నవంబర్13(సింగిడి)



కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన కంది శివమణి (బన్నీ), 23 సంవత్సరాల యువకుడు ఇంటి నుంచి వెళ్లి ఏడు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు తిరిగి ఇంటికి చేరుకోలేదు.కుటుంబ సభ్యులు, బంధువులు తెలిసిన ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు.కావున ఎవరికైనా కంది శివమణి (బన్నీ) ఆచూకీ తెలిసినా, ఎక్కడైనా కనిపించినా వెంటనే 9676936474 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు ప్రజలను వేడుకుంటున్నారు.యువకుడి ఆచూకీ తెలుసుకోవడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రాధేయ పడుతున్నారు.

సిద్ధిపేటలో టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం...!

హరీశ్ రావుపై కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు
అవినీతి ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి
పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ

సిద్ధిపేట ప్రతినిధి, నవంబరు 13, (సింగిడి):



సిద్ధిపేటలో రాజకీయ సమీకరణాలు మారుస్తామని, త్వరలోనే టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ప్రజా జీవితం నుంచి హరీశ్‌రావును తరిమేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు నీళ్ల దొంగ, నిధుల దొంగ మాత్రమే కాకుండా బొగ్గు దొంగ కూడా అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. శుక్రవారం సిద్దిపేటలో తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు.అభివృద్ధి పేరుతో ఏం సాధించారు?తెలంగాణ ఉద్యమాల ఖిల్లా సిద్దిపేటలో కేసీఆర్, హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి వంటి బలమైన నాయకులు ఉన్నప్పటికీ ప్రజలకు ఆశించిన ప్రయోజనం చేకూరలేదని కవిత విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, ఆశించిన మేరకు నీరు అందడం లేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. సిద్దిపేటలో గతంలో ఉన్న రైస్‌మిల్లులు, సంప్రదాయ వ్యాపారాలు, చేనేత రంగం క్రమంగా దెబ్బతిన్నాయని ఆరోపించారు.ప్రాజెక్టులపై విచారణ జరపాలిమల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయని, అంచనా వ్యయాలు పెంచారని కవిత ఆరోపించారు. మల్లన్నసాగర్ బండ్ వద్ద లీకేజీల సమస్యపై గతంలోనే సాంకేతిక నిపుణులు హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. కొండపోచమ్మసాగర్ నిర్మాణం, టన్నెల్ పనులు, అధికారులపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాలకు సంబంధించిన ఆధారాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేస్తానని చెప్పారు.ఈ నెల 19న సీఎం సమాధానం చెప్పాలిగౌరవెల్లి నిర్వాసితులకు పరిహారం, గండిపల్లి రిజర్వాయర్ నిర్మాణం, ఆర్డీఎస్ ఉద్యోగుల సమస్యలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపైనా విమర్శలు చేశారు. హరీశ్‌రావుపై తాను చేసిన ఫిర్యాదులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఆరోపణలపై స్పందించాలని డిమాండ్ చేశారు.నాపై ఆరోపణలకు సమాధానం చెప్పాబీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసిన అనంతరం ఏడాది పాటు ఆలోచించి, మేధావులతో చర్చించిన తర్వాతే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేశానని కవిత తెలిపారు. 50 కమిటీల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకున్నామని, ప్రైవేటు రంగంలోనూ ఉచిత విద్య, వైద్యం అందించాలన్నది తమ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతిలో తనకు పైసా ప్రమేయం లేదని స్పష్టం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పినట్లుగానే, ఇతర నాయకులు కూడా తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని అన్నారు.కొత్త నాయకత్వానికి అవకాశం ఇవ్వండిసిద్దిపేటలో మున్సిపల్ ఎన్నికల నుంచే తమ రాజకీయ పోరాటం ప్రారంభిస్తామని కవిత ప్రకటించారు. రెండుసార్లు బీఆర్ఎస్‌కు, ఒకసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని, ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. యువత, రైతులు, మైనారిటీలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పారు. పార్టీ కార్యాలయాన్ని ప్రజలందరూ వినియోగించుకోవచ్చన్నారు. తమ పార్టీ జెండా, ఫ్లెక్సీలను తొలగించినా వెయ్యిమంది నాయకులు పుట్టుకొస్తారని వ్యాఖ్యానించారు.సిద్దిపేటలో కొత్త రాజకీయ నాయకత్వం అవసరమని, ప్రజల కష్టాల్లో అండగా నిలిచే వారికే ప్రజలు ఆదరణ చూపుతారని కవిత పేర్కొన్నారు.

కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష

వరంగల్ క్రైమ్ ప్రతినిధి.
నవంబర్ 13 (సింగిడి)



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు కేసుల ప్రగతి తదితర అంశాలపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీలు, ఏసీపీ స్థాయి అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి, వాటి దర్యాప్తు ఏ దశలో ఉందనే అంశంపై సంబంధించిన అధికారులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ప్రధానంగా పెండింగ్ కేసుల్లో నిందితుల అరెస్టు, నిందితుల పరారీలో ఉన్నట్లయితే వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ త్వరితగతిన అరెస్టు చేయాలని. కేసుల దర్యాప్తు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. దర్యాప్తులో జాప్యం కారణంగా కేసులు పెండింగ్‌లో ఉండకుండా, ప్రతి కేసుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని దర్యాప్తును, అవసరమైన చోట సాంకేతికతను ఉపయోగించుకుంటూ ముందుకు తీసుకెళ్లాలని. ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై నేరాలు, ఆస్తి నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసు లు, తీవ్రమైన నేరాలు తదితర కేసుల దర్యాప్తు పురోగతితో పాటు ప్రజలకు త్వరిత గతిన న్యాయం అందే విధంగా కేసుల దర్యాప్తును పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ నేర సమీక్షా సమావేశంలో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీ(పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, స్పెషల్ బ్రాంచి ఎసిపి మధుసూదన్, క్రైమ్ ఎసిపి సదయ్య, సిసి ఆర్ బి ఎసిపి డేవిడ్ రాజ్ , హన్మకొండ, కాజీపేట, నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట, మామునూర్, స్టేషన్ ఘనపూర్ ఎసిపి లు, డ్రగ్ కంట్రోల్ టీం ఇన్స్పెక్టర్ సాయిరమణ, టిజినాబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, ఐటీ కోర్ అధికారులు పాల్గొన్నారు.

వెంకంపేట పాఠశాలలో కిచెన్ గార్డెన్ పాఠాలు

వెంకంపేట పాఠశాలలో పచ్చని సాగు పాఠాలు ...విద్యాధికారుల సూచనలు..
ఉపాధ్యాయుల కృషి.. విద్యార్థుల భాగస్వామ్యం ...సేంద్రియ కూరగాయలు మధ్యాహ్న భోజనానికి అదనపు రుచి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 13 (సింగిడి)



సిరిసిల్ల పట్టణం వెంకంపేట పాఠశాల చదువుల తోపాటు సాగు పాఠాలనూ నేర్పుతోంది వెంకంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ఆవరణలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ విద్యార్థులకు కూరగాయల పెంపకంపై ప్రత్యక్ష అవగాహన కల్పిస్తోంది. ఉపాధ్యాయినుల పర్యవేక్షణలో విద్యార్థులు కలిసి పెంచుతున్న ఈ తోటలో సుమారు మీటరు పొడవైన మునగకాయలు కాసి అందరినీ 'ఔరా!' అనిపిస్తున్నాయి. పచ్చగా కళకళలాడుతున్న తోట.సమష్టి కృషికి, సేంద్రియ సాగుపై పాఠశాల బృందానికి ఉన్న ఆసక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. కూరగాయలు.. ఆకుకూరలతో కళకళకిచెన్ గార్డెన్‌లో మునగతోపాటు టమాటా, బెండ, వంగ వంటి కూరగాయలను, పుదీనా, మెంతి, గోంగూర వంటి ఆకుకూరలను పెంచుతున్నారు. సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తూ తోటను సంరక్షిస్తున్నారు. మొక్క ఎదుగుదల నుంచి పూత, కాత వరకు వివిధ దశలను విద్యార్థులు ప్రత్యక్షంగా గమనించే అవకాశం కలుగుతోంది. తరగతి గదిలో నేర్చుకునే విషయాలను ఎలా తయారు చేసుకోవాలి? కూరగాయల సాగులో వాటి ఉపయోగం ఏమిటి? వంటి అంశాలను విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. రసాయన ఎరువులను విచక్షణారహితంగా ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను కూడా తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నతనం నుంచే ప్రకృతి పట్ల ప్రేమను, మొక్కలను సంరక్షించే అలవాటును పెంపొందించేందుకు ఈ తోట దోహదపడుతోందని చెప్పారు.– పాఠశాల తోట నుంచి మధ్యాహ్న భోజనంలోకితోటలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను ప్రతిరోజూ మధ్యాహ్న భోజన తయారీలో వినియోగిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయిని తెలిపారు. విద్యార్థులు తాము పెంచిన మొక్కల నుంచి వచ్చిన కూరగాయలను తమ భోజనంలో చూడటం ప్రత్యేక అనుభూతిని కలిగిస్తోందన్నారు. ఆహారం మన ముందుకు రావడానికి అవసరమైన శ్రమను అర్థం చేసుకునేందుకు కూడా ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.– సమష్టి కృషితో పచ్చని ఫలితంకిచెన్ గార్డెన్ నిర్వహణలో ఉపాధ్యాయినులు సీహెచ్. రాణి, వి. సౌభాగ్యతోపాటు విద్యార్థినీ విద్యార్థులు భాగస్వాములవుతున్నట్లు కె. పద్మ తెలిపారు. అందరి సహకారంతో తోటను క్రమం తప్పకుండా సంరక్షిస్తున్నామన్నారు. మొక్కలను పెంచడం ద్వారా విద్యార్థుల్లో బాధ్యత, ఓర్పు, కలిసి పని చేసే అలవాటు పెంపొందించేందుకు కృషి చేస

ఎడిటోరియల్

Editorial

బాల భారతాన్ని వేధిస్తున్న తీవ్రమైన సమస్యలు

భారత తొలి ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, మేధావి, న్యాయవాది, రచయిత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం వేదికగా ప్రతి ఏట దేశవ్యాప్తంగా 1957 నుంచి "బాలల దినోత్సవం లేదా బాల దివస్" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. జాతిపిత గాంధీని అన్నగా భావించడంతో జవహర్‌లాల్ నెహ్రూను పిల్లలు ముద్దుగా "చాచా నెహ్రూ" అని పిలుచుకునే వారని మనకు తెలుసు. బాలల పట్ల అవ్యాజమైన ప్రేమను, వారి పరిపూర్ణ వ్యక్తిత్వవికాసానికి అవసరమైన నిర్బంధ ఉచిత విద్యను కల్పించి, బాలల హక్కులను పరిరక్షిస్తూ రేపటి భావిభారత పౌరుల అభ్యున్నతికి పునాదులు వేయగలిగారు. 1855లో బాలల ఫిలిమ్ సొసైటీని స్థాపించి పిల్లల ఇతివృత్తంగా సినిమాలు రావాలని కోరుకున్న ఘనుడు మన నెహ్రూ.

జాతీయ బాలల దినోత్సవం:

బాలల సమ్మిళిత అభివృద్ధిని కాంక్షిస్తూ అన్ని వర్గాల పిల్లల సమగ్రాభివృద్ధిని కోరుకొని ఆ దిశగా అడుగులు వేశారు. బాలల సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఏట 20 నవంబర్ రోజున "ప్రపంచ బాలల దినం", 01 జూన్ రోజున "అంతర్జాతీయ బాలల దినం" నిర్వహించడం పరిపాటి అవుతున్నది. నెహ్రూ మరణానంతరం భారత పార్లమెంట్ తీసుకున్న తీర్మానం ప్రకారం 14 నవంబర్ రోజున "జాతీయ బాలల దినం (నేషనల్ చిల్డ్రన్స్ డే)" జరుపుకోవడం ప్రారంభమైనది. చాచా నెహ్రూ 14 నవంబర్ 1889న జన్మించారనే విషయం మనకు తెలుసు. 2026 భారత బాలల దినోత్సవం ఇతివృత్తంగా "నా రోజు, నా మనసు, నా భవిష్యత్తు (మై డే, మై రైట్స్, మై ఫ్యూచర్)" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

బాలభారతాన్ని వేధిస్తున్న సమస్యలు:

నేటి భరతమాత బిడ్డలు, రేపటి ఉజ్వల భవిత కలిగిన అన్ని వర్గాల భారత బాలలకు ఉచిత విద్య, వైద్యం, హక్కుల పరిరక్షణ, కనీస అవసరాల కల్పన, పారిశుద్ధ్యం జరిగినప్పుడే రేపటి భారతం అభివృద్ధి దిశగా ఎదుగుతుంది. స్వతంత్ర భారత శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడానికి ఉవ్విళ్తూరుతున్న భారతంలో బాలల సమస్యలు ఇంకా మనల్ని వెంటాడుతూనే ఉన్నాయి. అందరికీ విద్య అందడం లేదు. పేదరికంలో మగ్గుతూ పోషకాహారానికి దూరం అవుతున్నారు. బాల కార్మిక వ్యవస్థ మనల్ని వెక్కిరిస్తున్నది. బాలల అక్రమ రవాణా సంక్షోభం దినదినం పెరుగుతున్నది. బాల్య వివాహాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. బాల్యం స్మార్ట్, సోషల్ మీడియా తెరలకు అతుక్కుపోయి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్నారు. మాదక ద్రవ్యాల మత్తు గ్రామాలకు కూడా వ్యాపిస్తూ బాలలను వశపరుచుకుంటున్నది. అందరికీ ఆరోగ్యం అందని ద్రాక్షే అవుతున్నది. నాణ్యమైన ఉచిత విద్య కలగానే మిగిలి పోయింది. వీధి బాలలు నేటి డిజిటల్ భారతాన్ని వెక్కిరిస్తున్నారు. బలవంతపు భిక్షాటన మన కళ్ల ముందు జడలు విప్పుతోంది. బాలికలను అక్రమ రవాణా చేసి బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దించుతున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఎండమావులే అవుతున్నాయి. ప్రమాదకరమైన పరిశ్రమల్లో చిన్నారుల భవిష్యత్తు మడి మసిబొగ్గు అవుతున్నది.

నేటి బాలల నిర్లక్ష్యం రేపటి భారతానికే పెనుశాపం:

నేటి ప్రతి చిన్నారి రేపటి ఓ అద్భుత నిధి. భావిభారత బాలల పెంపకం, విద్య, పోషకాహారం, బాలల హక్కులు, ఆరోగ్యం లాంటి పలు సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి నేటి బాలల దినోత్సవ వేదికలు వినియోగించబడాలి. రేపటి భారత చరిత్రను ప్రభావితం చేయగల నేటి చిన్నారుల నిర్లక్ష్యం దేశానికే పెను శాపంగా మారుతుందని కోలుసుకోవాలి. బాలల దినోత్సవ వేదికగా పిల్లలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించడం అనాదిగా జరిగుతోంది. విద్యాలయాల్లో పోటీలు, కల్చరల్ ఆక్టివిటీస్, ర్యాలీలు, వ్యాసరచన, ప్రసంగాలు లాంటి పలు కార్యక్రమాలను నిర్వహించడం, చిన్నారుల భవిష్యత్తుకు పెద్దలు కంకనబద్దులు కావడం జరగాలి.

బాల్యం ఓ అద్వితీయ భాగ్యం. బాల్య దశలో పిల్లల్ని స్వేచ్ఛగా కలలు కనినిద్దాం, వాటి సాకారానికి దోహదపడదాం. తోటలో మొక్కలు మన భారతావనిలో బాలలు. వారిని సుగంధానికి పువ్వులుగా వికసించడానికి కావలసిన పెట్టుబడిని పెట్టడం మన పౌరసమాజ కనీస బాధ్యత. రేపటి భారతానికి వారే అమూల్య వనరులు, సుస్థిరాభివృద్ధికి ఊతం ఇవ్వగల పౌరులు. నేటి బాలల సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరసమాజం అందరూ కలిసి పిల్లల తలరాతను మార్చి భరతమాత సంతోషానికి కారణం అవుదాం, పిల్లల్ని పువ్వుల్లో పెట్టి పెంచుకుందాం, వారి స్వచ్ఛమైన చిరునవ్వుకు కారణం అవుదాం. చిన్నారుల భవితకు భరోసానిద్దాం.

ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

భారత క్రికెట్ జట్టు
తొలి కెప్టెన్ సి. కె.
నేడు సి. కె. నాయుడు వర్ధంతి

ఆయన భారత జట్టు క్రికెట్ కు ఆడిన వారిలో "విజ్డెన్" పత్రిక "క్రికెటర్ ఆఫ్ ది యియర్"గా ఎంపికైన మొదటి వ్యక్తి. ఫస్ట్ క్లాసు క్రికెట్లో యాభై ఏళ్ళ వయసు దాటాక కూడా డబుల్ సెంచురీ చేసిన అతి కొద్ది మంది ఆటగాళ్ళలో ఒకరు. క్రికెట్ చరిత్రలో 48 సంవత్సరాల సుదీర్ఘమైన కెరీర్ ఉన్న వారు మరొకరు లేరు. 1916లో మొదటి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ప్రారంభించి, అరవై రెండేళ్ళ వయసులో ఆఖరు మ్యాచ్ ఆడిన అరుదైన క్రికెటర్ ఆయన.



ఆయనే భారత టెస్ట్ క్రికెట్ జట్టు తొలి కెప్టెన్ సి. కె.నాయుడు.

సి. కె. నాయుడుగా పేరు గాంచిన కొట్టారి కనకయ్య నాయుడు 1933లో విస్డెన్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అందుకున్నాడు. పద్మ భూషణ పురస్కారం అందుకొన్న తొలి క్రికెట్ ఆటగాడు, 1955లో భారత ప్రభుత్వం నుండి పద్మభూషణ్ అందుకున్నాడు. భారత క్రికెట్ చరిత్రలో రెండు దశాబ్దాలు (1916-1936) నాయుడు యుగంగా ప్రసిద్ధి గాంచాయి.

నాయుడు 1895, అక్టోబర్ 31న నాగపూర్లో ఒక తెలుగు కుటుంబములో పుట్టి పెరిగిన ఆయన పాఠశాల రోజులనుండే క్రికెట్ ఆటలో ఎంతో ప్రతిభ కనపరిచాడు. ఆయన ప్రథమ శ్రేణి క్రికెట్ ఆటలో ప్రవేశము 1916లో హిందూ జట్టులో, యూరోపియన్ జట్టుకు వ్యతిరేకముగా జరిగింది. ఆయన ఆ ఆటలో తమ జట్టు 79 పరుగులకు 7 వికెట్లు పడిన పరిస్థితిలో 9వ ఆటగాడిగా బ్యాటింగుకు దిగాడు. మొదటి మూడు బంతులు అడ్డుకొని, నాలుగో బంతిని సిక్సర్ కొట్టాడు. ఇలా మొదలైన ఈయన ప్రాబల్యం తన క్రీడాజీ వితపు చివరినాళ్ల వరకు చెక్కు చెదరలేదు.

సి.కె.నాయుడు పూర్వీకులు కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన నాయుడు వర్గంవారు. రెండు తరాలకి ముందే వాళ్ళ కుటుంబం హైదరాబాదుకి తరలిపోయింది. నారాయణస్వామి నాయుడు తాత నిజాం నవాబు వద్ద దుబాసీగా పనిచేసారు. తరువాత వారి మకాం బెరంగాబాద్ కు మారింది. చివరికి సి.కె.నాయుడి తండ్రి సూర్యప్రకాశరావు నాయుడు హోల్కర్ సంస్థానంలో న్యాయ మూర్తిగా ఉంటూ, నాగపూరులో స్థిరపడ్డారు. సి.కె.నాయుడు అక్కడే పుట్టి పెరిగాడు. సి.కె.ప్రతిభను గౌరవిస్తూ, హోల్కర్ సంస్థానా ధీశుడు 1923లో ఆయనకి తన సైన్యంలో అత్యున్నత పదవినిచ్చి, ఇండోర్ రావలసిందిగా ఆహ్వానించాడు. తన ఆఖరు రోజుల వరకూ సి.కె. అక్కడే స్థిరనివాసం ఏర్పర్చుకున్నాడు. సి.కె. ఇంట్లో తెలుగు వాతావరణమే ఉండేదని ఆయన పిల్లలు ఆయన గురించి రాసిన పుస్తకాలలో రాసారు. తెలుగు సంప్రదాయాలను పాటిస్తూ, తెలుగు పత్రికలు చదవడం, తెలుగు వస్త్రధారణలో ఉండటం నాయుడి కుటుంబంలో కొనసాగాయి.

నలభై ఎనిమిదేళ్ళ సుదీర్ఘ ఫస్ట్ క్లాసు కెరీర్ లో సి.కె. మొత్తం 344 మ్యాచ్ లు ఆడి 11825 పరుగులు చేశాడు, 411 వికెట్లు తీసుకున్నాడు. సి.కె. కెరీర్ లో ఆడిన మ్యాచ్ లలో సగానికి పైగా ఆయనకి నలభై ఏళ్ళు దాటాక ఆడినవే. ఏడు అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ లు ఆడిన సి.కె. 350 పరుగులు చేశాడు, తొమ్మిది వికెట్లు తీసుకున్నాడు. ఆరు దశాబ్దాలపాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడిన కొద్దిమంది క్రీడాకారులలో సి. కె. నాయుడు ఒకరు. 1956-57 రంజీ ట్రోఫీలో తన 62 వ యేట ఆయన చివరిసారి ఆడాడు. ఆ మ్యాచ్‌లో 52 పరుగులు చేశాడు. రిటైర్ అయ్యాక కొన్నాళ్ళు జట్టు సెలెక్టర్ గా, రేడియో వ్యాఖ్యాతగా ఆటతో తన అనుబంధం కొనసాగించాడు. ఆయన 1967, నవంబర్ 14న ఇండోర్‌లో మరణించాడు.

– రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

"నవభారత నిర్మాత పండిత నెహ్రూ"
నవంబర్ 14... చాచాజీ జయంతి

హిందూ స్త్రీల దాస్య విముక్తికి, సమానత్వ సాధనకు కృషిచేసి సంఘ సంస్కరణ కర్తగా, స్వతంత్ర భారతావని సాంప్రదాయాలు, విధానాల రూపశిల్పిగా, నవభారత నిర్మాతగా, పేరెన్నిక గన్నారు చాచా నెహ్రూ. వివాహం కనీస వయస్సును, 12 నుండి 15 కి పెంచడం, సతులు... పతుల నుండి విడాకులు తీసుకుని ఆస్తి వారసత్వ హక్కు పొందడం, వరకట్న పద్ధతిని చట్టవిరుద్ధం చేయడం, దేశ తొలి ప్రభుత్వాధినేతగా, సమాజ సంస్కరణలలో సఫలీకృతులయ్యారు.



జవహర్ లాల్. న్యాయవాదిగా పరిపూర్ణ రాజకీయవేత్తగా, రచయితగా, దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానిగా, భారత రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన నెహ్రూ – గాంధీ కుటుంబ అ

మూలపురుషుడిగా సుపరిచితుడు అయిన నెహ్రూ, నేటి ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ నగరంలో కాశ్మీరీ బ్రాహ్మణ వంశంలో, ధనిక కుటుంబంలో, ప్రముఖ న్యాయవాది మోతిలాల్ నెహ్రూ, స్వరూప రాణిల తొలి సంతానంగా నవంబర్ 14, 1989లో జన్మించారు. సోదరీమణులైన కృష్ణ విజయలక్ష్మి పండిట్ లతో పాటు, "ఆనంద భవన్" లో ఆంగ్ల సాంప్రదాయ శిష్ట పద్ధతులలో పెరిగారు. బాల్యంలోనే హిందీ, సంస్కృతాలు, భారత సారస్వత గ్రంథాల పఠనాసక్తులు అయినారు. ఇండియన్ సివిల్ సర్వీసులో అర్హత పొందాలని తండ్రి కోరికను అనుసరించి, ఇంగ్లాండ్ నందలి హారో వెళ్ళాడు. పాఠశాల విద్య అక్కడ పూర్తిచేసి, 1907లో, కేంబ్రిడ్జ్ లో ప్రవేశ పరీక్ష రాసి, జీవశాస్త్ర అధ్యయనానికి కళాశాలకు వెళ్లి, 1910లో పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్ర అ అధ్యయనానికి ఇన్నెర్ టెంపుల్ వెళ్లి, 1912లో ఉత్తీర్ణుడై అక్కడే న్యాయవాద వృత్తి చేపట్టాడు. వెనువెంటనే భారతదేశానికి తిరిగి రావడం జరిగింది. 1919లో జలియన్వాలా బాగ్ దుర్ఘటనకు ప్రభావితుడై, కాంగ్రెస్ ఆధ్వర్యంలో, దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి ఆకర్షితుడై, సంగ్రామంలో తన శక్తులు లోడ్డుటకు ఉద్యుక్తుడయ్యాడు. మొదట మోతిలాల్ నెహ్రూ కుమారుని నిర్ణయాన్ని వ్యతిరేకించినా, తర్వాత ఆయన సైతం సంగ్రామంలో భాగస్వామి అయినాడు. అనంతరం మహాత్ముని నమ్మిన బంటుగా నెహ్రూ గుర్తింపు పొందాడు. ఆ సమయంలో 9 ఏళ్ళు జీవితం అనుభవించాడు. జీవితం సమయంలోనే 1334 లో "గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ', 1936 లో తన జీవిత చరిత్ర 1946లో "ది డిస్కవరీ ఆఫ్ ఇండియా" రచనలు పూర్తిచేశాడు తొలిసారిగా గాంధీ నాయకత్వ పోరాటంలో, 1929 లో భారత జాతీయ కాంగ్రెస్ నేతగా, లాహోర్ సమావేశాలకు నాయకత్వం వహించాడు. 1936,1937,1940 లలో, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు. యువకునిగా ఉన్ననాటి నుండే జాతీయ కాంగ్రెస్ లో, వామపక్ష భావజాల ప్రభావితుడై, సంపూర్ణ స్వాతంత్ర్య సముపార్జన ఆసక్తుడై, గాంధీ సలహాలతో, ప్రజాకర్షణ గల నేతగా, సంస్కరణవాదిగా స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య భూమిక నిర్వహించి గాంధీ అనంతరం, రెండవ అగ్రశ్రేణి నాయకుడిగా గుర్తించబడినాడు. 1916లో కాశ్మీరీ బ్రాహ్మణ వంశస్థులు రాలైన కమలా కౌల్ తో వివాహితుడైన నాడు. ఫలితంగా కుమార్తె ఇందిరా ప్రియదర్శిని 19 17 నవంబర్ 19న జన్మించింది. కమలా నెహ్రూ 1946 లో క్షయ వ్యాధితో మృతి చెందగా, కుమార్తె ఇందిర, సోదరి విజయలక్ష్మిలపై, ఎక్కువగా ఆధార పడడం జరిగింది. 1947 నుండి 64 వరకు దేశ ప్రధానిగా ఉన్న నెహ్రూ, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు లో ప్రధాన పాత్ర పోషించి, 1952 లో దేశ తొలి ప్రధాని గా ఎన్నుకొనబడినాడు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర్య భారత పతాకాన్ని ఎగరవేసిన తొలి భారతీయుడిగా, గౌరవం దక్కించుకున్న ఘనత ఆయనది. పార్లమెంటరీ తరహాలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛావాదం, పేద అణగారిన వారి పట్ల అనురాగం, ప్రధానిగా ఆయన రూపొందించిన విధానాలపై ప్రభావం చూపాయి. 1964 మే 27న తన 74వ ఏట పరమపదించాడు. పంచశీల సూత్ర అనువర్తిగా, అలీనోద్యమ స్థాపనకులలో ఒకరిగా, యుద్ధానంతర కాల అంతర్జాతీయ ప్రముఖుడిగా, గౌరవసూచకంగా "పండిట్" గా పిలువబడిన నెహ్రూ, సుధీర్ఘ పదవీకాలం అనుభవాన్ని రంగరింప చేసుకున్న కూతురు ఇందిర, మనమడు రాజీవ్, ప్రధాని పదవులు పొందడానికి స్ఫూర్తి పొందా రనాడంలో, రవంతైనా అతిశయోక్తి లేదు.

–రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

మాల వేసుకున్నాం...
మనసు మారిందా?

కార్తీక మాసం వచ్చిందంటే చాలు... వీధుల్లో నల్లని వస్త్రాలు కనిపిస్తాయి. మెడలో అయ్యప్ప మాలలు, నుదుటిపై విభూతి, నోట స్వామి శరణం అయ్యప్ప నినాదాలు వినిపిస్తాయి. ఎక్కడ చూసినా భక్తి వాతావరణం కనిపిస్తుంది. కానీ ఒక్కప్రశ్న మాత్రం మనల్ని వెంటాడుతోంది. మెడలో మాల వేసుకున్న మనిషి మనసులోనూ మార్పు వచ్చిందా? 41 రోజుల పాటు నియమాలు పాటించి, ఇంద్రియ నిగ్రహంతో, సాత్విక జీవనంతో, స్వామి నామస్మరణతో గడపడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? మాల ధరించడం ఒక ఆచారం కావచ్చు. దీక్ష ఒక నియమం కావచ్చు. శబరిమల యాత్ర ఒక పవిత్ర ప్రయాణం కావచ్చు. కానీ వీటన్నింటికీ మించినది మనిషిలో కలిగే పరివర్తన.

మాల మెడలో కనిపించాలి...
కానీ దాని ప్రభావం మన ప్రవర్తనలో కనిపించాలి!

గుడిలో భక్తి... బయటకు రాగానే స్వార్థమా?
అయ్యప్ప స్వామికి కొబ్బరికాయ కొట్టి, పూజలు చేసి బయటకు వచ్చిన వెంటనే తోటి మనిషిని మోసం చేస్తే ఆ భక్తికి అర్థం ఏమిటి? శబరిమలకు ఇరుముడి కట్టి పవిత్ర యాత్రకు బయలుదేరి, దారిలోనే ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు పడేస్తే ప్రకృతి పట్ల మన బాధ్యత ఏమైంది? నోట స్వామి శరణం అంటూనే ఇంట్లో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ఆ శరణాగతికి విలువ ఏముంది? తోటి మనిషిని కించపరుస్తూ, పేదవాడిని చిన్నచూపు చూస్తూ, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయకుండా ఉంటే మన దీక్ష ఏం నేర్పినట్లు?
అయ్యప్ప భక్తిలో సమానత్వం, సహనం, క్రమశిక్షణ, సోదరభావం ఎంతో ముఖ్యమైనవి. శబరిమల యాత్రలో ఒకరినొకరు స్వామి అని సంబోధించుకుంటాం. కులం, మతం, ఆర్థిక స్థితి అనే తేడాలు పక్కనపెట్టి కలిసిమెలిసి ప్రయాణిస్తాం. మరి ఆ సోదరభావం గుడి మెట్ల దగ్గరే ఆగిపోవాలా? మన జీవితాల్లోనూ కొనసాగకూడదా?
41 రోజుల దీక్ష... జీవితాంతం కొనసాగే మార్పు కావాలి!
ఒక యువకుడు చెప్పిన మాట గుర్తుకొస్తోంది. "నా దగ్గర మూడు డిగ్రీలు ఉన్నాయి సార్... కానీ జేబులో 30 రూపాయలు కూడా లేవు" అన్నాడు. చదువులు ఉండి జీవితానికి ఉపయోగపడకపోతే వాటి ప్రయోజనం ఎంత పరిమితమో, అలాగే భక్తి ఆచారాలు ఉండి మన ప్రవర్తనలో మార్పు లేకపోతే వాటి పరమార్థం కూడా అంతే ప్రశ్నార్థకం.
అయ్యప్ప దీక్ష అంటే కేవలం నల్ల బట్టలు ధరించడం కాదు. కోపాన్ని తగ్గించుకోవడం, అహంకారాన్ని విడిచిపెట్టడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, మాటలో నిజాయితీ, చేతల్లో ధర్మం, మనసులో దయ కలిగి ఉండడం.
మాల ధరించిన 41 రోజులు మాత్రమే కాదు... మాల తీసిన తర్వాత కూడా ఆ నియమాలు మన జీవితంలో కొనసాగాలి. ఎందుకంటే స్వామి సన్నిధిలో నేర్చుకున్న మంచితనం ఇంటి గడప దాటగానే మాయమైతే దీక్ష ఇచ్చిన సందేశాన్ని మనమే విస్మరించినట్లవుతుంది.

నిజమైన భక్తి ఎక్కడ కనిపించాలి?

ఒక పేద విద్యార్థికి పుస్తకాలు కొనిచ్చినప్పుడు భక్తి కనిపించాలి. ఆకలితో ఉన్న వృద్ధుడికి అన్నం పెట్టినప్పుడు భక్తి కనిపించాలి. రోడ్డు మీద ప్రమాదంలో ఉన్న వ్యక్తికి సహాయం చేసినప్పుడు భక్తి కనిపించాలి. ప్రకృతిని కాపాడినప్పుడు, జంతువుల పట్ల దయ చూపినప్పుడు, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచినప్పుడు భక్తి కనిపించాలి.
అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి వేల కిలోమీటర్లు ప్రయాణించే మనం, మన ఇంట్లోనే ఉన్న వృద్ధ తల్లిదండ్రుల అవసరాలను గుర్తించలేకపోతే ఆత్మపరిశీలన చేసుకోవాల్సిందే.
భక్తి అంటే ఇతరులకు మన భక్తిని చూపించడం కాదు. మన వల్ల ఇతరులకు మేలు జరగడం. మన ప్రవర్తన చూసి మరొకరు మంచి మార్గంలో నడవాలనిపించడం. అదే నిజమైన ఆధ్యాత్మికత.
19వ మాల అనుభవం చెబుతున్న మాట...
19వసారి అయ్యప్ప మాల ధరించిన భక్తుడిగా, ఎన్నోసార్లు శబరిమల పవిత్ర సన్నిధానాన్ని దర్శించిన వ్యక్తిగా ఒక మాట చెప్పాలనుకుంటున్నాను. స్వామి దర్శనం మనకు ఆధ్యాత్మిక ఆనందాన్ని ఇస్తుంది. కానీ ఆ దర్శనం ద్వారా నేర్చుకున్న మంచితనం మన జీవితంలో ప్రతిబింబించినప్పుడే దానికి సంపూర్ణత లభిస్తుంది.
మనం ఎన్ని మాలలు ధరించామన్నది కాదు ముఖ్యం. ఎన్ని మంచి పనులు చేశామన్నదే ముఖ్యం. ఎన్ని కొండలు ఎక్కామన్నది కాదు, మనలోని అహంకారాన్ని ఎంత తగ్గించుకున్నామన్నదే ముఖ్యం. ఎన్ని సార్లు స్వామి



శరణం అన్నామన్నది కాదు, ఆపదలో ఉన్న మనిషికి ఎన్నిసార్లు అండగా నిలిచామన్నదే అసలైన ప్రశ్న.
ఈ కార్తీక మాసంలో మనకు మనమే ఒక మాట ఇచ్చుకుందాం!
ఈసారి దీక్షలో ఒక్క మంచి పనినైనా జీవితాంతం కొనసాగే అలవాటుగా మార్చుకుందాం. ఒక పేద విద్యార్థికి చదువులో సహాయం చేద్దాం. ఒక వృద్ధుడికి భోజనం అందిద్దాం. ఒక మొక్క నాటుదాం. ఒకరిని మోసం చేయకుండా, ఒకరి మనసును గాయపరచకుండా జీవించేందుకు ప్రయత్నిద్దాం.
మాల తీసిన మరుసటి రోజు మనిషి మారిపోకూడదు... మాల ధరించిన రోజు మొదలైన మంచితనం జీవితాంతం కొనసాగాలి.
గత వారం "పండగ వచ్చింది... మనిషి మారాడా?" అని ప్రశ్నించాను. ఈ వారం మళ్లీ అదే ఆత్మపరిశీలనతో అడుగుతున్నాను.
మాల వేసుకున్నాం... మనసు మారిందా?
మాల మెడలో ఉండటం భక్తికి గుర్తు కావచ్చు. కానీ మనసులో దయ ఉండటం మానవత్వానికి గుర్తు. ఆ రెండూ కలిసినప్పుడే అయ్యప్ప దీక్షకు నిజమైన అర్థం లభిస్తుంది.
ఎందుకంటే... అయ్యప్పను కొండపై వెతకడమే కాదు, మనలోని మంచితనంలోనూ దర్శించుకోవాలి.
స్వామి శరణం అయ్యప్ప!

ఉక్కల్‌కార్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
చీఖజీ(×) జాతీయ ఉపాధ్యక్షులు,
9440287170.



సుర్జిత్ నగర్ వాసులకు పట్టాలిచ్చి గృహాలు నిర్మించాలి

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 13 (సింగిడి)

న్యూ శాయంపేట 31వ డివిజన్ సర్వేనెంబర్ 579 గల ప్రభుత్వ భూమిలో గత 20 సంవత్సరాలుగా 500 కుటుంబాలు సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని వారికి పట్టాలిచ్చి పక్క గృహాలు నిర్మించాలని. కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని శుక్రవారం పార్టీ భూజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య కారు ఉపేందర్ మాట్లాడుతూ 500 కుటుంబాలు ఈ కాలనీలో నివాసం ఉంటుండగా గతంలో 250 మందికి మాత్రమే పట్టాలిచ్చి చేతులు దులుపుకున్నారని, మిగతా 250 మందికి పట్టాలు ఇవ్వకపోవడం వలన ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు కాకుండా పోతున్నారని వారికి పట్టాలిచ్చి ఇందిరమ్మ పథకం ద్వారా పక్క గృహాలు నిర్మించాలని అన్నారు. కాలనీ వ్యవస్థాపక అధ్యక్షులు కారు ఉపేందర్, మాజీ కార్పొరేటర్ మామిళ్ల రాజు యాదవ్ లు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా అనేక సమస్యలతో సతమతమవుతూ బ్రతుకుతున్న కాలనీవాసులకు ఇంటి నెంబర్స్ ఇచ్చిన అధికారులు ఆధార్, రేషన్, ఓటర్ ఐడి కార్డులు అన్ని ఆ ఇంటి నెంబర్ పైనే ఉన్నాయని ఇన్ని రకాల గుర్తింపులు ఇచ్చిన వారికి పట్ట హక్కు మాత్రం కల్పించడం లేదని వెంటనే పట్టాలు ఇవ్వాలని, కాలనీలో 80 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పనులు ప్రారంభించారని ఇంకా మూడు గల్లీలు పని పూర్తి కాకుండానే బడ్జెట్ సరిపోవటం లేదని సదర్ కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారని మరికొంత బడ్జెట్ విడుదల చేసి మిగిలిపోయిన గల్లీలలో కూడా సీసీ రోడ్లు డ్రైనేజీ కాలువలు కట్టి ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గారు రెండు నెలలలో మీ కాలనీని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని దానికి పూర్తి బాధ్యత నాదేనని కాలనీవాసులకు, సిపిఎం పార్టీకి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు, సభ్యులు దార్నా ప్రభాకర్, కొడగాని రమేష్, ఎండి షర్బుద్దీన్, గజవెల్లి మొగిలి, పెండ్యాల లక్ష్మణ్, అడప లక్ష్మణ్, కురుకు రంజిత్, మయూరి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డుపై 'రసమయి' ఆరోపణలు నిరాధారం



మానకొండూర్, నవంబర్13(సింగిడి)

వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం అన్నారు.మార్కెట్ యార్డులో వడ్లు తడిచిపోయాయని, మొక్కలు మొలుస్తున్నాయని చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో రైతుల ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఐదు కిలోల కోత విధించిన ఘనత మీ ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు.గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను మరిచిపోయి, ప్రస్తుతం రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై విమర్శలు చేయడం తగదన్నారు. మార్కెట్ యార్డులో వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలని రేవెల్లి రాజలింగం హితవు పలికారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ద్యావ శ్రీనివాస్ రెడ్డి , మార్కెట్ కమిటీ డైరక్టర్ కనకం అశోక్,శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ఉమ్మడి నల్గొండ బ్యూరో నవంబర్ 13 (సింగిడి)



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను 14 నవంబరు 2026 నుండి 20 నవంబరు 2026 నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. అవేస్ రహమాన్ చిస్తీ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. వంశీకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించనున్న గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు, సాహితీవేత్తలు మరియు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

టాస్క్ ఫోర్స్ఇన్స్పెక్టర్ల బదిలీలు

వరంగల్ క్రైమ్ ప్రతినిధి నవంబర్ 13 (సింగిడి)

వరంగల్ కమిషనరేట్‌లో టాస్క్ ఫోర్స్ విభాగం లో పనిచేస్తున్న ఇన్స్పెక్టర్ కాసగాని శ్రీధర్ ములుగు జిల్లా వెంకటాపురం సర్కిల్‌కు బదిలీ అయ్యారు. అక్కడ విధుల్లో ఉన్న ముత్యం రమేశ్‌ను మల్టీజోన్-1 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఐజీపీ సంపత్ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫార్సుల మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మరోవైపు ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న బొమ్మెర బాలకృష్ణ, రాడం భాను ప్రకాశ్‌లకు ఇటీవల ఖమ్మం కమిషనరేట్‌లోని సీసీఆర్‌బీ, సీటీసీ విభాగాల్లో ఇచ్చిన పోస్టింగ్‌లను రద్దుచేసి, వారిని తిరిగి వెయిటింగ్‌లోనే కొనసాగించారు. పరిపాలనా కారణాలతోనే ఈ మార్పులు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

3,000 కి.మీ. సైకిల్ యాత్ర
62 ఏళ్ల వయస్సులోనూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఐ. విజయలక్ష్మి
మర్కల్ మహిళా డిగ్రీ కళాశాలలో ఘన స్వాగతం.. విద్యార్థినులకు మత్తు పదార్థాలపై నియంత్రణపై అవగాహన

మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం

కామారెడ్డి, నవంబర్ 12:(సింగిడి)

వయస్సు కేవలం అంకె మాత్రమేనని నిరూపిస్తూ 62 ఏళ్ల వయస్సులోనూ సామాజిక చైతన్యం కోసం సైకిల్ యాత్ర చేపట్టిన ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరం ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త ఐ. విజయలక్ష్మి కి మర్కల్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఘన స్వాగతం పలికారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఆమె చేపట్టిన 3,000 కిలోమీటర్ల సైకిల్ యాత్రలో భాగంగా నవంబర్ 12న కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. శోభారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. చంద్రకళ బి., ఫిజికల్ డైరెక్టర్ రామాదేవి, ఎన్ఎస్ఎస్ అధ్యాపకురాలు ఎం. కృష్ణవేణి, బి. మౌనికతో పాటు ఇతర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆమెకు ఘన స్వాగతం పలికారు.అనంతరం సెమినార్ హాల్‌లో విద్యార్థినులను ఉద్దేశించి విజయలక్ష్మి మాట్లాడుతూ.. తన 50 నుంచి 60 ఏళ్ల వయస్సు మధ్య సాధించిన ఎనిమిది ప్రపంచ రికార్డుల గురించి వివరించారు. వయస్సుతో సంబంధం లేకుండా సంకల్పం, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తన ప్రయాణం ద్వారా చాటిచెప్పారు. యువత తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యకు ప్రాధాన్యతనిస్తూ మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుందని వివరించారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను వివరిస్తూ నాటికలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం విజయలక్ష్మి ని ఘనంగా సత్కరించి, ఆమె చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

నవంబర్ 13న ఉదయం 9 గంటలకు తెలంగాణ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నుంచి బయలుదేరి తదుపరి గమ్య స్థానమైన తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఆమె తన సైకిల్ యాత్రను కొనసాగించారు.వయస్సు అడ్డంకి కాదు.. సంకల్పమే విజయానికి బాట అని చాటుతున్న విజయలక్ష్మి యాత్ర విద్యార్థినుల్లో స్ఫూర్తిని నింపింది. మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ఆమె చేస్తున్న ఈ ప్రయత్నం సామాజిక చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.



ఒకే రోజు ముగ్గురు రైతుల బలవన్మరణం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విషాదం

వరంగల్ ప్రతినిధి,
నవంబర్ 13 (సింగిడి)

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు రైతులు అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలకలం రేపుతుంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బుజ్జు తండాకు చెందిన జర్పుల వెంకటేష్ (27).. రెండెకరాల్లో పత్తి సాగు చేయగా దిగుబడి రాక వ్యవసాయ బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు., జనగామ జిల్లా నర్మెట మండలం ఆగాపేటలో మెట్ట ఉప్పలమ్మ (50) పత్తి సాగులో నష్టాలు రావడంతో పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నారు., మహబూబాబాద్ జిల్లా వెంకట్రామ్ తండాలో బానోతు రాములు (58) వరి, మొక్కజొన్న పంటలకు ఆశించిన దిగుబడి రాక అప్పులు పెరగడంతో ఆత్మహత్య చేసుకున్నరని పోలీసులు తెలిపారు.



ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమాల పరిశీలన

జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ప్రసాద్

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 13 (సింగిడి)

జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్ హెచ్ ఎం., తెలంగాణ రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ప్రసాద్ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్ల, తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, పి హెచ్ సి ఎస్ సందర్శించి, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలు, ప్రతిరోజూ నిర్వహించే ఔట్ పేషెంట్ ఓ పి డి సేవలు, ఆరోగ్య మరియు వెల్‌నెస్ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలతో పాటు సంబంధిత రిపోర్టులు, రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమావేశమై ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఉన్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు,నివేదికల నమోదు, ఇతర పరిపాలనా క్షేత్రస్థాయి సమస్యలపై సిబ్బందితో చర్చించారు. సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను నిరంతరాయంగా అందించాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ద్వారా ప్రజలకు అందించే ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రామకృష్ణ, తంగళ్లపల్లి వైద్యాధికారి డాక్టర్ స్నేహ, నేరెళ్ల వైద్యాధికారి డాక్టర్ చంద్రిక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి హెచ్ ఓ సత్యనారాయణ, డిపిఓ ఎన్ హెచ్ ఎంఉమా, ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ల లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు పంపిణీ చేసిన మంత్రి

ఉమ్మడి నల్గొండ బ్యూరో నవంబర్ 13 (సింగిడి)



అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మరియు ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం నూతన చేయూత పింఛన్లను మంజూరు చేస్తోంది.ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 23,547 మంది లబ్ధిదారులకు, నల్గొండ నియోజకవర్గంలో 8,500 మందికి పైగా నూతన పింఛన్ల ద్వారా లబ్ధి చేకూరనుంది.పింఛన్లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద కుటుంబాలు గౌరవంగా, ఆత్మ గౌరవంతో జీవించేందుకు అండగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు.పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన వారికి చేయూత పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని మంత్రి తెలిపారు.

క్రీడలతోనే విద్యార్థుల్లో క్రమశిక్షణ.. నాయకత్వ లక్షణాల వికాసం!

బీబీపేటలో 70వ రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం
క్రీడాకారులను ప్రోత్సహించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి,ప్రతినిధి నవంబర్ 13:(సింగిడి)

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బీబీపేట మండలంలోని తిమ్మయ్యగారి సుశీల నారాయణరెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి హాకీ పోటీలను ఆయన ఘనంగా ప్రారంభించారు.ఈ పోటీల్లో రాష్ట్రంలోని పది జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలెక్టర్ మమేకమై పోటీల నిర్వహణ, పాల్గొంటున్న జట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో మాట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను పరిశీలించి, ఏర్పాట్లపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. జట్టుగా పనిచేయడం, ఓటమిని ధైర్యంగా స్వీకరించడం, విజయాన్ని బాధ్యతగా తీసుకోవడం వంటి విలువలు క్రీడల ద్వారా అలవడతాయని తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం రావడం క్రీడాకారులకు గొప్ప అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పోటీలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.క్రీడా మైదానాల్లో ప్రతిభకు పదును.. యువతలో ఆత్మవిశ్వాసానికి బాటలు! రాష్ట్రస్థాయి హాకీ పోటీల నిర్వహణతో బీబీపేట క్రీడా సందడితో కళకళలాడింది.



బాలల సమస్యలపై గ్రామసభలో చర్చించాలి

ఉమ్మడి నల్గొండ బ్యూరో నవంబర్ 13 (సింగిడి)

యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీని "చైల్డ్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ"లుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా "జవహర్ బాల్ మంచ్"(జేబీఎం) చైర్మన్ కొడారి వెంకటేష్, బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీ ఆర్ పీ ఎఫ్) కన్వీనర్ ఆవుల వినోద్ కుమార్ లు కోరారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిల్లల పక్షపాతి, భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని(నవంబర్, 14) పురస్కరించుకుని, తెలంగాణ లో పిల్లల గ్రామ సభలు ఏర్పాటు చేసి, పిల్లల సమస్యలపై చర్చించాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని వారన్నారు. గ్రామాల్లో బాలకార్మికులు, బాల్య వివాహాలు, డ్రాపౌట్స్, హార్వర్స్, సింగిల్ పేరెంట్స్ లను గుర్తించి వారికి గ్రామ పంచాయతీ నుంచి సహకారం అందించాలని, గ్రామాల్లోని బాలలపై శారీరక, మానసిక హింసలు జరగకుండా చూడాలని వారు కోరారు.

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



వేములవాడ, నవంబర్ 13(సింగిడి)

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. పవిత్ర కార్తీక మాసం ప్రారంభం కావడంతో పాటు శుక్రవారం కలిసి రావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అభిషేకాలు, అన్నపూజలు, కుంకుమ పూజ, చండీ హోమం, నిత్య కళ్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం, లింగార్చన తదితర ఆర్జిత సేవలలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గండ దీపంలో నూనె పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాస విశిష్టతను పురస్కరించుకుని భక్తులు ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి, అర్చకులకు దీపదానం చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగదేవత విగ్రహాలకు భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి హారతులు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన

బాల్య వివాహ రహిత దేశం ...
బాల్య వివాహ రహిత...రాజన్న సిరిసిల్ల జిల్లా లక్ష్యం
కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు పోస్టర్ ఆవిష్కరణ

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 13 (సింగిడి)

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన బాల్యవివాహ రహిత భారతదేశం లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాం చేపడుతున్నారు.ఈ క్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన బాల్యవివాహాల నిర్మూలన అవగాహన పోస్టర్‌ను ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బాల్యవివాహాల వల్ల బాలికల భవిష్యత్తు, విద్య, ఆరోగ్యం, సామాజిక జీవితంపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించారు. బాల్యవివాహాల నివారణకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని,రాజన్న సిరిసిల్ల జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిపిఓ కవిత,ఆశ్రిత ఎన్జీవో స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పర్వతాలు, ఫైనాన్స్ మేనేజర్ వెంకటేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిహెచ్ఎల్ కోఆర్డినేటర్ స్రవంతి, జిల్లా కోఆర్డినేటర్ లహరి, హరిబాబు, ప్రశాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలరాంకు సన్మానం

ఉమ్మడి నల్లగొండ బ్యూరో నవంబర్ 13 (సింగిడి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా గత నెలలో 2026 – 27 సంవత్సర కాలానికి ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ ఈడెల్లి బలరాం ను సామాజిక కార్యకర్తలు మంగళవారం భువనగిరి లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాతో డాక్టర్ ఈడెల్లి బలరాం, అనురాధ నర్సింగ్ హోం డాక్టర్ అనురాధ మేడమ్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏం ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు చిలుకమారి గణేష్ మాదిగ, దళిత నాయకులు పెరుమాళ్ళ స్వామి, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్, పాక జహంగీర్ యాదవ్, దళిత నాయకులు సురుపంగ సుభాష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

ఉమ్మడి నల్గొండ బ్యూరో నవంబర్ 13 (సింగిడి)

రాబోయే రబీ 2026-27 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు.ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేని పరిస్థితుల నేపథ్యంలో వరి సాగును నివారించి ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యా శాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, వి బి జి ఆర్ ఏ ఎం జి పనుల పురోగతిపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ పలు అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవ గాహన కల్పించాలిరబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేనందున వరి సాగును నివారించాలని సూచించారు. రైతులను ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించాలని, సూక్ష్మ సేద్య విధానాలను ప్రోత్స హించాలని తెలిపారు. పంటల వైవిధ్యీకరణ, ఖరీఫ్ పంటల ఉత్పాదకత పెంపు, రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న





ప్రోత్సాహకాలు, ఇతర పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్‌లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం సేకరణ ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.విద్యా శాఖపై సమీక్షిస్తూ, ప్రభుత్వ పాఠశా లల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరును పర్యవేక్షించా లని, విద్యార్థుల హాజరు కనీసం 90 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని క్రమం తప్పకుండా సమీక్షించాలని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు మెరుగ్గా ఉంటే విద్యార్థుల హాజరు కూడా పెరుగు తుందని, క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజ రయ్యే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు మెరు గుపడతాయని పేర్కొన్నారు.విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను సమర్థవంతంగా వినియోగిం చుకోవాలని సూచించారు. రూసా 2.0, పీఎం ఉషా పథకాల కింద మొత్తం 41 పనులు మంజూరు కాగా, ఇప్ప టివరకు 8 పనులు పూర్తయ్యాయని, మరో 33 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మంజూరైన నిధుల్లో ఇప్పటివరకు 41 శాతం మాత్రమే ఖర్చు చేసినందున మిగిలిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశిం చారు.సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగిం చాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ.625 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పనుల పురోగతిని కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షిస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారం భించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణలో జాప్యం ఉండకూడదుప్రభుత్వ అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మా ణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధా న్యతతో చేపట్టాలని సూచిం చారు.భూసేకరణ కోసం అవస రమైన నిధులను కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించా లని సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర జనసం చారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. విద్యా శాఖ అధికారి భిక్షపతి , డీఏఓ రమణా రెడ్డి , హార్టికల్చర్ అధికారి హేమలత,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగు, భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

కామారెడ్డి,ప్రతినిధి నవంబర్ 13:(సింగిడి)

రాబోయే రబీ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదల, భూసే కరణ పనుల వేగవంతానికి అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారు లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికా రులు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు.రబీ సాగులో ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సా హంరాబోయే రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు ముందస్తు సూచనలు అందించాలని ప్రధాన కార్యదర్శి తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరు లను సమర్థంగా వినియోగించుకుంటూ సూక్ష్మ సేద్య పద్ధతులను అవలంబిం చాలని, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పంటల వైవిధ్యీకర ణను ప్రోత్సహించాలని, కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాయితీ విత్తనాల పంపిణీ, పంటల మార్పిడి, సూక్ష్మ సేద్య పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాల న్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలిప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో విద్యార్థుల సగటు హాజరు 73.74 శాతం ఉండగా, కామారెడ్డి జిల్లాలో 72.21 శాతంగా నమోదైందని తెలిపారు. ఉపా ధ్యాయుల హాజరు రాష్ట్రస్థాయిలో 87.06 శాతం, జిల్లాలో 88.05 శాతంగా ఉందని వెల్లడించారు. ఉపాధ్యాయుల హాజరుకు అనుగుణంగా విద్యార్థుల హాజరు కూడా పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగాన్ని విస్తరించాలని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకులాలు, ఇతర ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యాబోధన అందేలా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్లు తరచూ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, బోధన, మౌలిక సదుపాయాలను పరిశీలించాలని సూచించారు. సమగ్ర శిక్షా పథకం కింద చేపట్టిన నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించా లని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 96 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 11,520 సీట్లకు గాను 7,107 ప్రవేశాలు మాత్రమే నమోదయ్యాయని, అంటే 61.69 శాతం సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. మిగిలిన సీట్ల భర్తీపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు డిగ్రీ కళాశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని పర్యవేక్షిం చాలని సూచించారు. అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్డీవో దామోదర్ రెడ్డి, డీఈఓ మల్లికార్జున్, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఇరిగేషన్ డీపీఓ మురళి, అధికారులు పాల్గొన్నారు.

19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు

ఉమ్మడి నల్గొండ బ్యూరో నవంబర్ 13 (సింగిడి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఈ నెల 19వ తేదీ నుంచి జిల్లా లో ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు.ఈ పథకం అమలుకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారని కలెక్టర్ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో జన్మించిన 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో బీమా వ్యక్తిగా నమోదు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని గ్రామ పంచా యతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రత్యేక కేంద్రాలు, నమోదు క్యాంపులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పథకానికి సంబంధించిన దరఖాస్తు ఫారాలు, ప్రొఫార్మాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పథకంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకంపై అవగాహన కల్పించాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారు లను ఆదేశించారు. జిల్లాలోని అర్హులైన ప్రజలందరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు.

ప్రజల మనిషి కాళోజీ

వేములవాడ, నవంబర్ 13 (సింగిడి)



తెలంగాణ భాష,యాసలతో స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించి.తె లంగాణ ప్రజల్లో చైతన్యం తీసుకొ చ్చిన ప్రజాకవి కాళోజీ అని,తెలం గాణ ప్రజల కష్టాలను,ఆకాంక్ష లను అక్షరాయుధాలుగా మలిచిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు. పొలాస నరేందర్ రాష్ట్ర బీసీ నేత నివాళులు అర్పిస్తూ అన్నారు. కోట్లాడి సాధించుకున్న తెలంగాణ ఫలాలు అన్ని వర్గాల కు,అన్ని రంగాల్లో జనాభా దామాషాన అందాలని,ఎందరో మహానుభావుల కృషి,త్యాగాల పలితంగ సాధిం చుకున్న తెలంగాణలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం, సమ న్యాయం,ఆత్మ గౌరవం లభించాలని కోరుకుంటున్నానని పొలాస నరేందర్ అన్నారు.ప్రజాస్వామిక విలువల గురించే కాదు,ప్రజాస్వా మ్యాన్ని ఆరోగ్యకరంగా కాపాడుకోవడంలో పౌరుల బాధ్యత,పాత్ర గురించి తన కవితల్లో నొక్కి చెప్పేవారని,ప్రజాస్వామ్యంలో పౌరుడె ప్పుడు కళ్ళు తెరిచి ఉండాలని కాళోజీ చెప్తుంటారన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూల స్పందన

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 13 (సింగిడి)

జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ను కలిసి, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారు 1,200 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న విషయాన్ని తెలియజేయడం జరిగింది.జిల్లాలోని ఔట్‌సో ర్సింగ్ ఉద్యోగుల సమస్యలను సమన్వయంతో పరిష్కరించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ ఏర్పాటు చేసుకున్న విషయాన్ని కలెక్టర్ వివరించి, జేఏసీ తరఫున మర్యాదపూర్వకంగా పరిచయం చేసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మా విజ్ఞప్తికి ఎంతో సానుకూలంగా స్పందిస్తూ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన జీతాల చెల్లింపులు, ఐ ఎఫ్ ఎం ఐ ఎస్. నమోదు, ఈపీఎఫ్. ఈ ఎస్ ఐ తదితర సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కరిం చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇవ్వడం జరిగింది.జిల్లా లోని సుమారు 1,200 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, భరోసా కల్పించిన జిల్లా కలెక్టర్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.మన ఐక్యతే మన బలం మన హక్కులే మన లక్ష్యం.వేముల లక్ష్మీరాజంఅధ్యక్షులు,రాజన్న సిరిసిల్ల జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ.

రాష్ట్రస్థాయి బాక్సింగ్‌లో పారమిత విద్యార్థులకు పతకాలు

కరీంనగర్, నవంబర్13(సింగిడి)



హైదరాబాద్‌లో నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్-14, అండర్-17 బాక్సింగ్ పోటీల్లో పారమిత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు సాధించారు. కె. సాయి విష్ణేష్ (90 కిలోలు), కె. విశిష్ట (60 కిలోలు), ఎన్. వరుణ్‌రావు (40 కిలోలు), ఎం. అనుజ్ఞ (60 కిలోలు) పతకాలు గెలుచుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు.వి జేతలను పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన బాక్సింగ్ కోచ్ ఎ. రామకృష్ణను ప్రత్యేకంగా ప్రశంసించారు.

బాలల దినోత్సవ ఆకృతిలో మానేరు విద్యార్థులు

కరీంనగర్, నవంబర్13(సింగిడి)

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులంతా కలిసి 'బాలల దినోత్సవం' ఆకృతిలో నిలబడి చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.విద్యార్థుల సృజనాత్మ కత, సమష్టి కృషిని సంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి అభినందించారు. బాలలే దేశ భవిష్యత్తు అని, విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కార్యకలాపాలకు అడ్డాగా మారితే కఠిన చర్యలు

జిల్లా వ్యాప్తంగా దాబాలు, హోటల్స్ లలో పోలీసుల మెరుపు దాడులు.. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై పోలీసులకు సమాచారం అందించాలి : జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు

వేములవాడ నవంబర్ 12 (సింగిడి)

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలా పాల నియంత్రణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని దాబాలు, రహదారుల వెంబడి ఉన్న హోటల్స్ లలో గురువారం రోజున రాత్రి పోలీసులు ఏకకా లంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈతనిఖీల్లో భాగంగా దాబాలు, హోటల్స్ లలో నిర్వహిస్తున్న వ్యాపార కార్యకలాపాలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, సంబంధిత శాఖల అనుమతులు, లైసెన్సుల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిం చారు. అనుమతులు లేకుండా పర్మిట్ రూములు నిర్వహిం చడం, అక్రమంగా మద్యం నిల్వ చేయడం, విక్రయించడం, మద్యం సేవించేందుకు అనధికారికంగా ఏర్పాట్లు చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. దాబాలు, హోటల్స్ కేంద్రంగా చేసుకుని జూదం, పేకాట, సట్కా మట్కా తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అలాగే ప్రధాన రహదారుల వెంబడి ఉన్న దాబాలు, హోటల్స్ వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించా లని సూచించారు. దాబాలు, ఇతర వ్యాపార కేంద్రాల నిర్వా హకులు తప్పనిసరిగా సంబంధిత శాఖల అనుమతులు పొందడంతో పాటు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని,



చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపా లకు ఏమాత్రం తావులేకుండా, ప్రజల భద్రతకు భంగం కలగకుండా జిల్లా పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగి స్తుందని, ఆకస్మిక తనిఖీలు మరింత విస్తృతంగా కొనసాగి స్తామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

కామారెడ్డి మున్సిపల్ సమావేశంలో రసాభాస!

చెత్తాచెదారం, వీధి దీపాల సమస్యలపై బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల నిరసన

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 13(సింగిడి)

కామారెడ్డి పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్య లపై చర్చించాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవే డిగా సాగింది. పట్టణంలో పేరుకుపోతున్న చెత్తాచెదారం, పనిచేయని వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలపై బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు అధికారులను నిల దీశారు. సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ పోడియం వద్ద నిరసనకు దిగడంతో సమా వేశంలో గందరగోళం నెలకొంది.ప్రజా సమస్యలపై కౌన్సిలర్ల ఆగ్రహంమున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో చెత్త తొలగింపు సక్రమంగా జరగడం లేదని, వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నిం చారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికా



రులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని నిలదీశారు. తమ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోడియం ముందు బైఠాయించారు.ఒకే వేదికపై ప్రతిపక్షాల నిరసనమరోవైపు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం తమ సమస్యలపై సమాధానాలు ఇవ్వాలని కోరుతూ పోడియం వద్దకు చేరుకున్నారు. దీంతో బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల నిరసనల మధ్య అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదం కొనసాగింది. ప్రజా సమస్యలపై చర్చ జరగా ల్సిన సమావేశం నిరసనలు, వాదోపవాదాలతో వేడెక్కింది.పండుగల వేళ కూడా పారిశుద్ధ్య సమస్య లేనా?పండుగల సమయంలోనూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడం ప్రజలను ఇబ్బందులకు గురిచే స్తోందని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు ప్రతి వార్డులో వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్ర జలకు కావాల్సింది హామీలు కాదు.. పరిష్కారాలు!మున్సి పల్ సమావేశాలు కేవలం తీర్మానాలకే పరిమితం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే వేదికలుగా మారాల్సిన అవసరం ఉంది. వార్డుల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి కనీస సదుపా యాల కల్పనకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై మున్సిపల్ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుం టుందో వేచి చూడాలి.

ఐలయ్య..తస్మాత్ జాగ్రత్త

ఆలేరు ఎమ్మెల్యే పై విరుచుకుపడ్డ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

ఉమ్మడి నల్గొండ బ్యూరో నవంబర్ 13 (సింగిడి)

తస్మాత్ జాగ్రత్త ఐలయ్య... ప్రజలను పీడించడం అవినీతి అక్రమాలకు పాల్పడడం ప్రజాపాలన కాదు అని మాజీ ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం నాడు జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావే శంలో ఆమె ప్రభుత్వ విప్పు పై వీరుచుక పడ్డారు. మాజీ మంత్రులు, బంగారు తెలంగాణ కు బాటలు వేసిన కార్య సాధకులు కేటీఆర్, హరీశ్ రావు ల పై నోరు పారేసుకుంటే ఊరుకోం.కాళేశ్వరం ప్రాజెక్టు మూసివేసి నీళ్లు విడుదల చేయకుండా వ్యవసాయానికి ఎడ్డబెట్టిన మీరు కేసీఆర్ పై మాట్లాడటం సిగ్గు చేటు అన్నారుపెద్దోళ్ల ను తిడితే గొప్పొల్ల వుతారని అనుకుంటే సాధ్యం కాదు. నీ స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడాలని హెచ్చరించారు.కేటీఆర్ ను డ్రామా రావు అంటావా.. ఎంత ధైర్యం.అబద్ధాల కేటీఆర్ అంటే నిన్ను భూదందా ల అయిలయ్య అంటాం అన్నారు.ఆలేరు కు వెళ్ళు చూడు.. అండర్ పాస్ ఎందుకు పూర్తి చేయలేదు.యాదగిరిగుట్ట అండర్ పాస్ బ్రిడ్జి ఎందుకు తొలగించలేదు అని ఆమె ప్రశ్నించారు100 రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ చేస్తానని హామీ ఎక్కడ పోయింది.3 ఏళ్ల కాలంలో ఆలేరు కు చేసిన అభివృద్ధి పై శ్వేత పత్రం విడుదల చేయాలి అని డిమాండ్ చేశారునిర్మల్ లో రైతు దీక్ష పెడితే ప్రభుత్వానికి వెన్ను లో వణుకు పుట్టింది.ఏ గ్రామంలో రైతుకు రుణమాఫీ జరిగిందో



చూపించాలని సవాల్ విసిరారురైతులను నట్టేట మంచి, రైతులు సంతోషంగా ఉన్నారని ప్రకటించడం సిగ్గుచేటు అన్నారుఆలేరులో సాగు జలాల పరిస్థితి ఏంటి.చెరువులు ఎండిపోతున్నాయి. తలాపున గోదావరి ఉంటే ఎందుకు నీళ్లు ఎత్తిపోసి ఆలేరు కు సాగు జలాల ఎందుకు తీసుకురా లేదు అని మాజీ ప్రభుత్వ విప్పు ప్రశ్నించారుకేటీఆర్ హరీష్ రావు పై విమర్శలు మానీ ఆలేరు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.రూ. 73 వేల కోట్ల రైతు బంధు, 24 వేల కోట్ల రైతు భీమా కు బీ ఆర్ ఎస్ పార్టీ ఖర్చు చేసింది.లక్ష అరవై వేల కోట్ల నిధులు ఖర్చు చేసి రైతులకు సాగు జలాలు అందించే ప్రభుత్వం ప్రభుత్వం బీ ఆర్ ఎస్ అన్నారువ్యవసాయానికి 5 లక్షల కోట్ల ఖర్చు చేసి దేశానికే అన్నపూర్ణగా మార్చి ఈ రాష్ట్రాని అభివృద్ధి బాటలో నడిపిన ఘనత కెసిఆర్ ది అని అన్నారుకేంద్రం వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టకూడదని అడ్డుకున్న ప్రజానాయ కుడుమీరు వాడే ప్రతి సాగు జలాలు కాళేశ్వరం లో భాగమే.కేసీఆర్ సింహం లాంటి వ్యక్తిని గెలికితే మీ ఖర్మ.. మిమ్మల్ని ఎవ్వరు కాపాడలేరు అని సునిత పేర్కొన్నారు ఎల్ నినో వస్తే అప్రమత్తమై చేపట్టాల్సిన ముందస్తు చర్యలు ఎందుకు చేపట్టలేదు.ప్రపంచమంతా ఎల్ నినో సమస్య ఉంది. కేవలం తెలంగాణ లోనే రాలేదు అన్నారుపేద, మధ్య తరగతి కుటుంబాలు బియ్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదు.గతంలో రూ. 25 నుంచి 30 ఉంటే ఇప్పుడు కిలో బియ్యానికి రూ. 100 పెరిగింది అన్నారుమహిళలకు మీరు ఎం చేశారు. హన్మకొండలో మహిళలకు వడ్డీ లేని రుణాలు కింద రూ. 13 వేల కోట్ల చెక్కు బౌన్స్ అయిన ఘటన మహిళలు మరిచిపోలేదు అని గుర్తు చేశారుఆశా, ఎన్ హెచ్ ఎం, మధ్యాహ్న భోజన పథకం లో పనిచేసే మహిళ లను ప్రభుత్వం మరిచిపోయింది.మహిళల ను కోటీశ్వరు లను చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే నీ ఆలేరు నియోజక వర్గం ఎంత మంది మ

మధుమేహం ఉన్నవారికి తీపి వార్త

ఇన్సులిన్ విడుదలను అడ్డుకునే రహస్యాన్ని ఛేదించిన శాస్త్రవేత్తలు!

ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న ఆరోగ్య సమస్యల్లో మధుమేహం (డయాబెటిస్) ఒకటి. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వల్ల గుండె, మూత్రపిండాలు, కళ్లతో పాటు శరీరంలోని ఇతర అవయవాలపై కూడా ప్రభావం పడుతుంది. అయితే మధుమేహం ఎలా అభివృద్ధి చెందుతుంది? శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి, విడుదల ఎందుకు తగ్గుతుంది? అనే అంశాలపై ఐఐటీ కాన్పూర్ పరిశోధకులు కీలక విషయాలను గుర్తించారు.

మన శరీరంలోని క్లోమగ్రంథి (ప్యాంక్రియాస్) రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే బీటా కణాలు ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి విడుదల చేస్తాయి. ఈ ఇన్సులిన్ రక్తంలోని గ్లూకోజ్‌ను శరీర కణాలు వినియోగించుకునేందుకు సహాయపడుతుంది.

అయితే క్లోమగ్రంథిలోనే ఉండే మాక్రోఫేజ్‌లు అనే రోగనిరోధక కణాలు బీటా కణాల పనితీరును ప్రభావితం చేస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా ఇవి శరీరాన్ని ఇన్ఫెక్షన్లు, వ్యాధుల నుంచి రక్షిస్తాయి. కానీ కొన్ని పరిస్థితుల్లో ఇవే ఇన్సులిన్ విడుదలను వేగంగా తగ్గించగలవని తాజా పరిశోధన వెల్లడించింది.

స్ఫింగోలిపిడ్స్.. GPR18 కీలక పాత్ర!

ఈ ప్రక్రియలో స్ఫింగోలిపిడ్స్ అనే కొవ్వు అణువులు కీలక పాత్ర పోషిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. మాక్రోఫేజ్ కణాల్లో ఒక ప్రత్యేక సంకేత ప్రక్రియ ప్రారంభమైనప్పుడు ఈ కొవ్వు అణువులు విడుదల వుతాయి. అవి పక్కనే ఉన్న బీటా కణాల్లోకి చేరి ఇన్సులిన్ విడుదలకు సంబంధించిన వ్యవస్థను దెబ్బ తీస్తాయి. ఈ ప్రక్రియను ప్రారంభించే కీలక గ్రాహకంగా GPR18ను పరిశోధకులు గుర్తించారు. ఈ మార్గాన్ని అడ్డుకున్నప్పుడు ప్రయోగాల్లో ఇన్సులిన్ విడుదల మెరుగుపడినట్లు తేలింది.

మనుషుల కణజాలంపైనా పరిశోధన!

సిమ్రన్ సింగ్, ఆశిష్ కుమార్ నేతృత్వంలో, డాక్టర్ సాయి ప్రసాద్ పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. తొలుత జంతువులపై ప్రయోగాలు నిర్వ హించగా, అనంతరం అమెరికాలోని ఇండియానా బయోసైన్సెస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో మానవ క్లోమగ్రంథి కణజాలంపైనా అధ్యయనం చేశారు. అక్కడ కూడా ఇదే ప్రక్రియకు సంబంధిం చిన ఆధారాలు లభించాయి. ఈ పరిశోధన వివరాలు ప్రముఖ వైద్య పరిశోధనా జర్నల్ 'జర్నల్ ఆఫ్ క్లినికల్ ఇన్వెస్టిగేషన్'లో 2026 సెప్టెంబర్ 15న ప్రచురితమయ్యాయి.

డయాబెటిస్‌కు మందు వచ్చేసినట్లేనా?

ఈ పరిశోధనతో మధుమేహానికి వెంటనే మందు కనుగొన్నట్లు కాదు. అయితే ఇన్సులిన్ విడుదలను అడ్డుకుంటున్న జీవ ప్రక్రియను అర్థం చేసుకోవడా నికి కొత్త మార్గం లభించింది. ముఖ్యంగా ఊబకాయం, టైప్-2 మధుమేహంతో బాధపడేవా రిలో ఇన్సులిన్ ఉత్పత్తి చేసే బీటా కణాల పనితీరును కాపాడేందుకు భవిష్యత్తులో కొత్త ఔషధాల అభివృ



ద్ధికి ఈ పరిశోధన ఉపయోగపడవచ్చు. మొత్తానికి, మధుమేహంపై పోరాటంలో ఐఐటీ కాన్పూర్ శాస్త్రవే త్తల పరిశోధన మరో కీలక ముందడుగుగా నిలిచింది.గమనిక: ఇది పరిశోధన ఆధారిత వార్త మాత్రమే. మధుమేహ మందులు లేదా ఇన్సులిన్ వాడకాన్ని వైద్యుల సలహా లేకుండా మార్చకూడదు.

అతివ Athiva Singidi

కిడ్నీలో రాళ్ళను పిండి చేసే చింతచిగురు

చింతచిగురు గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఇది ఎక్కువ వేసవిలో దొరుకు తుంది. ఇది తెలియని వారంటూ ఉండరు. కానీ కొందరికి దీనిని ఎలా తినాలో తెలియదు.

ఇది తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో కూడా తెలియదు. అన్ని చెట్ల మాదిరే, ఈ చింత చెట్ల ఆకులు కూడా ఎప్పటికప్పుడు రాలి పోతాయి. ఆ తర్వాత లేత చిగురులు వస్తాయి.

ఈ చింతచిగురు ఫిబ్రవరి,మార్చి ,ఏప్రిల్,మే నెలల్లో బాగా దొరుకుతుంది. అయితే, మీరు దీనిని ఎండబెట్టుకుని పొడిలాగా చేసుకుని తినొచ్చు. ఇంకా ఈ చిగురులను పచ్చడి, పప్పు, కూరల్లో కూడా వేసుకోవాలి. చింత చిగురు తోనే ఎన్నో రకాల వంటకాలు చేసుకుంటారు. అయితే, ఇది రుచికి పుల్లగా వుంటుంది. కానీ, కూరల్లో చింత పండును వేయరు.

చింత చిగురులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఈ చింతచిగురులో ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటంతో మీ బాడీలో ఉన్న చెడు కొలెస్ట్రాల్‌ను ఇది తగ్గించి ఇంకా మంచి కొలెస్ట్రాల్‌ను కూడా పెంచుతుంది. ఇంకా యాంటీ ఇన్‌ఫ్లేమటరీ గుణాలు చింత చిగురులో పుష్కలంగా ఉంటాయి

చింత చిగురులో ఉండే విటమిన్ సి శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఇంకా ఈ ఆకులు కిడ్నీలో రాళ్ళను పిండిని చేస్తాయి. అలాంటి పవర్‌ఫుల్ ఆకు మరి. ఇంకా ఎలాంటి ఇన్ఫెక్షన్స్ రాకుండా ఉంటాయి. ఇంకా చింతచిగు రులో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఎలాంటి సమస్యలు రాకుండా చేస్తాయి.

నోట్ : మీరు వీటిని పాటించే ముందు వైద్యుల సలహా తప్పసరిగా తీసుకోవాలి. ఇక్కడ అందించిన వివరాలు కేవలం మీ అవగాహనకు కోసం మాత్రమే. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నానేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.



చాయ్ ఇలా ట్రై చేయ్

మన దేశంలో టీ కేవలం ఒక పానీయం మాత్రమే కాదు, అది కోట్ల మంది భావోద్వేగం. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు చాలామందికి టీ తాగడం అలవాటు.

స్నేహితులతో కబుర్లు చెప్పాలన్నా, అలస టను క్షణంలో దూరం చేసుకోవాలన్నా ఒక కప్పు వేడి వేడి టీ సరిపోతుంది. అయితే రోజూ మనం ఎంతో ఇష్టంగా తాగే టీ కొన్నిసార్లు సరిగ్గా కుదరదు. దీనికి కారణం టీ తయారీలో మనం చేసే చిన్న చిన్న పొరపాట్లే. దాదాపు 90 శాతం మందికి టీ చేసేటప్పుడు నీరు, పాలు, టీపొడి, పంచదార ఏ క్రమంలో వేయాలో సరైన అవగాహన ఉండదు. పర్‌ఫెక్ట్ టీ తయారీకి అనుసరిం చాల్సిన సరైన పద్ధతి ఇక్కడ చూద్దాం.

టీ చేసే సరైన విధానం:

చాలా మంది నేరుగా గిన్నెలో పాలు పోసి టీ పెడుతుంటారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు. ముందుగా ఒక గిన్నెలో తగినన్ని నీటిని పోసి బాగా మరిగించాలి. నీరు మరు గుతున్నప్పుడు అందులో కచ్చపచ్చగా దంచిన అల్లం, యాలకులు వేయాలి. వీటిని 3 నుంచి 4 నిమిషాల పాటు నీటిలో బాగా మరగనివ్వడం వల్ల వాటి సువాసన, సారం నీటిలోకి పూర్తిగా దిగుతుంది. ఆ తర్వాత తగినంత టీపొడి, పంచదార వేయాలి. వీటిని కూడా మరో కొన్ని నిమిషాలు నీటితో పాటు బాగా ఉడకనివ్వాలి. ఇలా చేయడం వల్ల టీ మంచి రంగును సంతరించుకుంటుంది. చివరగా గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న పాలను కలపాలి. ఫ్రిజ్‌లో నుంచి తీసిన వెంటనే చల్లటి పాలను పోయకూడదు. పాలు పోశాక టీని మీడియం మంటపై చక్కగా మరిగిం చాలి. మధ్యలో గరిటెతో తిప్పుతూ ఉంటే టీ మంచి చిక్కదనంతో రుచిగా వస్తుంది.

పాటించాల్సిన కొన్ని చిట్కాలు:

అల్లాన్ని తురుముకోవడం కంటే దంచి వేయడం వల్ల టీకి మంచి రుచి వస్తుంది. పాలు పోసిన తర్వాత టీని ఎక్కువ సేపు ఉడికించాల్సిన అవసరం లేదు. సరైన కొలతలు, సరైన క్రమాన్ని పాటించడం ద్వారా మీ ఇంట్లోనే హోటల్ స్టైల్ కడక్ ఛాయ్‌ని సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ చిన్న మార్పులతో మీ రోజువారీ టీ రుచి అద్భుతంగా మారుతుంది!

మూడు రోజుల లాభాలకు బ్రేక్

స్టాక్ మార్కెట్ Stock Market

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. శుక్రవారం ఇంట్రాడేలో 81,288.75 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్ సూచీ.. చివరికి 318.56 పాయింట్ల నష్టంతో 81,592.45 వద్ద ముగిసింది.

మూడు రోజుల పాటు సాగిన దేశీయ స్టాక్ మార్కెట్ల జోరుకు బ్రేక్ పడింది. ఇవాళ(శుక్రవారం) సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయాన్నే నష్టాలతో మొదలై, రోజంతా అదే ధోరణిని కొనసా గించింది.ఇంట్రాడేలో 81,288.75 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 318.56 పాయింట్ల నష్టంతో 81,592.45 వద్ద ముగిసింది. ఒక దశలో మరింత పడిపోయిన సెన్సెక్స్, చివరికి ట్రేడింగ్ ముగిసే సమయానికి స్వల్పంగా నష్టపో యింది. రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచవచ్చన్న వార్తలు మదుపర్లను ఆందోళనకు గురిచేశాయి. దీనికి తోడు ఇటీవల మార్కెట్లు లాభాల్లో ఉండటంతో ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్ (లాభాల స్వీకరణ) వైపు మొగ్గు చూపారు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్, ఐటీ రంగాల షేర్లపై అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది.

నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలో నడిచి నష్టాలతో ముగిసింది. 155.05 పాయింట్ల నష్టంతో 25,144.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.24గా ఉంది. మరోవైపు, అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ బల హీనపడింది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బీఈఎల్ వంటి ప్రముఖ షేర్లు నష్టపోగా.. హిందుస్థాన్ యూనిలీవర్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు మాత్రం స్వల్ప లాభాలను దక్కించుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిడ్ ధరలు ఎగబాకడం, బంగారం రేట్లు పెరగడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 95.42 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3897.70 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

అక్టోబర్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశిత గరిష్ట స్థాయి (6%) దాటడం మార్కెట్ వర్గాలను కలవరపెట్టిందని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. ముడిచమురు ధరల పెరుగుదల కారణంగా రూపాయి మారకం విలువ క్షీణించిందని, ఇది విదేశీ సంస్థాగత మదుపర్ల (FIIs) పెట్టుబడులపై ప్రభావం చూపే ఉంటుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడు తున్నారు.

ఏఐ బూమ్‌తో 53% పెరిగిన సంస్థల సంపద

భారతీయులు సారథ్యం వహిస్తున్న టాప్ గ్లోబల్ కంపెనీల మార్కెట్ విలువ రెండేళ్లలో 53 శాతం వృద్ధితో ఏకంగా 15 లక్షల కోట్ల డాలర్లకు (రూ.1,410 లక్షల కోట్లు లేదా రూ.14.10 కోట్ల కోట్లు) చేరుకుంది. కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీ బూమ్ ఇందుకు ప్రధాన కారణమని, 2024లో ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ 9.9 లక్షల కోట్ల డాలర్లుగా ఉందని గురువారం విడుదలైన 'హెచ్‌ఎస్‌బీసీ హురున్ గ్లోబల్ ఇండియన్స్ లిస్ట్ 2026' నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో గూగుల్‌తో పాటు దాని మాతృసంస్థ ఆల్ఫాబెట్‌కు సారథ్యం వహిస్తున్న సుందర్ పిచాయ్ అగ్రస్థానంలో నిలిచారు. ఆల్ఫాబెట్ మార్కెట్ విలువ 4.2 లక్షల కోట్ల డాలర్లుగా నమోదైంది. కాగా, 2.6 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ విలువ కలిగిన మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్లకు రెండో స్థానం దక్కింది. మైక్రాన్ టెక్నాలజీ (1.4 లక్షల కోట్ల డాలర్లు)కి చెందిన సంజయ్ మెహ్రోత్రా మూడో స్థానంలో ఉన్నారు. ఈ జూన్ 25 నాటికి కంపెనీల మార్కెట్ విలువ ఆధారంగా ఈ లిస్ట్‌ను రూపొందించినట్లు, కనీసం 250 కోట్ల డాలర్ల మార్కెట్ విలువ కలిగిన సంస్థలను పరిగణనలోకి తీసుకున్నట్లు హురున్ తెలిపింది. భారత్‌కు వెలుపల ప్రధాన కార్యాలయాలు కలిగిన 200 కంపెనీలను నడి పిస్తున్న 236 మంది భారత సంతతి నాయకులకు ఇందులో చోటు దక్కింది. ఈ జాబితాలోని కంపెనీల్లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 53 లక్షల మంది పనిచేస్తున్నారని.. 2025లో వీటి మొత్తం ఆదాయం 2.5 లక్షల కోట్ల డాలర్లకు, మొత్తం లాభం 41,600 కోట్ల డాలర్లకు చేరుకుందని రిపోర్టు వెల్లడించింది. హురున్ 2024లో తొలిసారిగా గ్లోబల్ ఇండియన్స్ లిస్ట్‌ను విడుదల చేసింది.

క్లాడ్ ఏఐ సృష్టికర్త ఆంత్రోపిక్ 64.4 బిలియన్ డాలర్ల భారీ ఐపీఓకు సిద్ధమైంది. ఒక్కో షేరు ధరను 70 నుంచి 78 డాలర్లుగా నిర్ణ యించగా, సంస్థ వాల్యుయేషన్ 1.41 ట్రిలియన్ డాలర్లకు చేరనుంది. ప్రైవేట్ ప్లేస్‌మెంట్‌తో కలిపి మొత్తం 84.6 బిలియన్ డాలర్ల నిధులను సమీకరిస్తున్న ఈ కంపెనీ షేర్లు నవంబర్ 19న నాస్‌డాక్‌లో లిస్ట్ కానున్నాయి.

వస్తోంది టెక్ ప్రపంచంలో అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ..

1.41 లక్షల కోట్ల డాలర్ల వాల్యుయేషన్‌తో రాబోతున్న Anthropic IPO

ప్రపంచ స్టాక్ మార్కెట్ చరిత్రలో మరో భారీ రికార్డు నమోదు కాబోతోంది. ప్రముఖ ఏఐ చాట్‌బాట్ 'క్లాడ్' (Claude) సృష్టికర్త ఆంత్రోపిక్ (Anthropic), ఏకంగా 64.4 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 5.4 లక్షల కోట్లు) భారీ పబ్లిక్ ఇష్యూతో మార్కెట్లోకి అడుగుపెడుతోంది. ప్రైవేట్ నిధుల వేటలో ఉన్న ప్రత్యర్థి ఓపెన్ ఏఐ (OpenAI) కంటే ముందే పబ్లిక్ మార్కెట్లోకి వస్తున్న ఈ సంస్థ వాల్యు యేషన్ 1.41 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడం టెక్ ఇన్వెస్టర్లలో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

కంపెనీ ఇప్పటికే తన ఐపీఓ రోడ్‌షోను ప్రారంభిం చింది. ఇందులో భాగంగా ఒక్కో షేరు ధరను 70 నుంచి 78 డాలర్లుగా నిర్ణయించింది. మొత్తం 82.5 కోట్ల క్లాస్-ఏ షేర్లను విక్రయించనుండగా, ఇందులో 80.13 కోట్ల కొత్త షేర్లను కంపెనీ జారీ చేస్తోంది. మిగిలిన 2.36 కోట్ల షేర్లను పాత వాటాదారులు విక్రయిస్తున్నారు. గరిష్ట ధర వద్ద ఈ ఇష్యూ పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయితే, ప్రపంచ స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద ఐపీఓలలో ఇది ఒకటిగా నిలుస్తుంది.

టెక్ దిగ్గజాల పెట్టుబడులు, 84.6 బిలియన్ డాలర్ల నిధులు

సాధారణ పబ్లిక్ ఆఫరింగ్‌తో పాటు, దిగ్గజ టెక్ కంపెనీలు, వ్యూహాత్మక ఇన్వెస్టర్ల నుంచి మరో 26 బిలియన్ డాలర్లను ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా ఆంత్రోపిక్ సమీకరిస్తోంది. షేరు సగటు ధర 74 డాలర్ల వద్ద ఖర్చులన్నీ పోను సంస్థ చేతికి నికరంగా 84.6 బిలియన్ డాలర్ల భారీ నిధులు అందను న్నాయి. ఇంత పెద్ద మొత్తంలో సమీకరించే నిధులను డేటా సెంటర్లు, అత్యంత శక్తివంతమైన ఏఐ చిప్‌ల కొనుగోలు కోసం సంస్థ వినియోగించనుంది.

వాల్యుయేషన్ లెక్కలు, లిస్టింగ్ తేదీ

గరిష్ట ధర 78 డాలర్ల వద్ద స్టాక్ ఆప్షన్లు, రిస్ట్రిక్టెడ్ స్టాక్‌లను కలుపుకుంటే కంపెనీ వాల్యుయేషన్ 1.41 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. వీటిని మినహాయిస్తే సంస్థ విలువ సుమారు 1 ట్రిలియన్ డాలర్లుగా తేలుతోంది. నాస్‌డాక్ గ్లోబల్ సెలెక్ట్ మార్కెట్‌లో 'ANT' అనే టిక్కర్ సింబల్‌తో నవంబర్ 19న ఈ షేర్లు ట్రేడింగ్ ప్రారంభించే అవకాశం ఉంది.

ఈ మెగా లిస్టింగ్‌పై వాల్ స్ట్రీట్ టెక్ విశ్లేషకులు కీలక అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. "ఏఐ మోడళ్ల శిక్షణ కోసం వందల బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్న తరుణంలో, ఆంత్రోపిక్ ఐపీఓ ఇన్వెస్టర్ల ఆకలికి అసలైన పరీక్షగా నిలవనుంది. గత ఏడాది కాలంలో కంపెనీ ఆదాయం భారీగా పెరిగినప్పటికీ, 1.4 ట్రిలియన్ డాలర్ల భారీ వాల్యుయేషన్‌ను నిలబె ట్టుకోవాలంటే లాభదాయకతపై స్పష్టమైన బాట వేయాలి" అని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం ప్రీ-ఐపీఓ మార్కెట్లో ఈ షేర్లకు విపరీత మైన డిమాండ్ నెలకొంది. ఒకవేళ డిమాండ్ ఇలాగే కొనసాగితే అండర్‌రైటర్లకు మరో 12.37 కోట్ల అదనపు షేర్లను విక్రయించే వెసులుబాటు కూడా కంపెనీ కల్పించింది. భారతీయ ఇన్వెస్టర్లు కూడా అంతర్జాతీయ బ్రోకరేజ్ ఖాతాల ద్వారా లిస్టింగ్ రోజున ఈ షేర్లలో పెట్టుబడి పెట్టే వీలుంది.





ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఆశా కార్యకర్తల సంఘీభావం



నారాయణపేట, నవంబర్ 13(సింగిడి):
తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లాకు చెందిన పలువురు ఆశా కార్యకర్తలు సమ్మె శిబిరానికి చేరుకుని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో వారు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. 32 రోజులుగా ఉద్యోగులు ఎండా, వానలను సైతం లెక్కచేయకుండా సమ్మె కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచార కరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం యూనియన్ కోశాధికారి రాఘవేందర్, సభ్యులు మోనేష్ చారి, తిరుపతి, శ్వేత శ్రీ, అన్వేష్, కిరీటి, విరోజా, సమీనా, వినోద్, నరేందర్, చందన, నవీన, సోహెల్, మునీర్, అజారుద్దీన్, రామేశ్వరి, నాగజ్యోతి, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించండి

ప్రపంచ బాలల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట, నవంబర్ 13 (సింగిడి):
బాలలు పెద్ద పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్స్ లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ముందుగా చాచా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నవంబర్ 14న భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.విద్యార్థులు జీవితంలో పెద్ద పెద్ద కలలు కనాలని, భవిష్యత్తులో తాము ఏ స్థాయికి చేరుకోవాలనుకుంటున్నారో ఇప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. రాకెట్ సైంటిస్టులు, జిల్లా కలెక్టర్లు, ఐపీఎస్ అధికారులు, ప్రొఫెసర్లు, గొప్ప పారిశ్రామిక వేత్తలు కావాలనే ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని అన్నారు. అయితే కలలు కనడంతోనే సరిపోదని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై సమాన ఆసక్తి పెంచుకోవాలని, తమకు ఇష్టమైన విషయాల్లో మరింత ప్రతిభ కనబరుస్తూనే, కష్టంగా భావించే సబ్జెక్టులను కూడా శ్రద్ధగా నేర్చుకోవాలని తెలిపారు. ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంపొందించుకోవాలని, ఉపాధ్యాయులను ప్రశ్నలు అడుగుతూ విషయాలను లోతుగా అర్థం చేసుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానంతో పాటు సమాజం, పరిసరాలు, దేశంలో జరుగుతున్న విషయాలపై కూడా అవగాహన పెంచుకోవాలని అన్నారు. అదేవిధంగా కులం, మతం, ప్రాంతం, ఆడ, మగ అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని కలెక్టర్ సూచించారు. ఇతరులలోని భిన్నత్వాన్ని గౌరవించాలని, ఎవరినీ తక్కువ చేసి చూడకూడదని, తోటి విద్యార్థులను వేధించడం, ఎగతాళి చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.విద్యార్థులు మొబైల్ ఫోన్లలో అనవసరమైన రీల్స్, సోషల్ మీడియా, గేమ్స్‌కు ఎక్కువ సమయం కేటాయించకుండా, విజ్ఞానాన్ని పెంపొందించే సైన్స్, గణితం, విద్యా సంబంధిత వీడియోలను వీక్షించాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, పాఠశాలల్లోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పుస్తక పఠనం వల్ల ఆలోచనా పరిధి, సృజనాత్మకత, జ్ఞానం పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకొని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ, విజేతలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీఈఓ గోవింద రాజులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అశోక్, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, ఎంఈఓ బాలాజీ, ఏఎం పో విద్యా సాగర్, రాజేంద్ర కుమార్, డీ సీ పీ పో కరిష్మా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

హన్మకొండ, నవంబర్ 13, (సింగిడి):
వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాన ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 61వ డివిజన్ ప్రశాంత్ నగర్, 63వ డివిజన్ తిలక్ నగర్,8 వ డివిజన్ మార్కస్ స్కూల్ ఆవరణలో సుమారు రూ.2.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజాపాలనలో భాగంగా అభివృద్ధి అంటే కేవలం జీవోలు తీసుకురావడం, పత్రికా ప్రకటనలు ఇవ్వడం, ప్రెస్‌మీట్లు నిర్వహించడం మాత్రమే కాదని, ప్రజల సాక్షిగా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించి, వాటిని పూర్తి చేసి చూపించడమే నిజమైన అభివృద్ధి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈరోజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన పనులను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయడంతో పాటు నాణ్యతా నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.వరంగల్ నగరానికి రాబోయే 30 నుంచి 40 ఏళ్ల వరకు తాగునీరు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా దీర్ఘకాలిక ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరలో చేపట్టనున్న నేపథ్యంలో భవిష్యత్తులో మళ్లీ రోడ్లను తవ్వాల్సిన పరిస్థితి రాకుండా సమన్వయంతో పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా నగర భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని సుమారు రూ.550



కోట్లతో 4 నుంచి 8 ఇంచుల పైప్‌లైన్ వ్యవస్థను విస్తరించే ప్రణాళిక ఉందని, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ సామర్థ్యాన్ని కూడా పెంచి రాబోయే మూడు, నాలుగు దశాబ్దాల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వరంగల్ అభివృద్ధికి అవసరమైన పలు కీలక ప్రాజెక్టులను సాధించుకున్నామని ఆయన తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విమానాశ్రయం, తాగునీటి పైప్‌లైన్ విస్తరణ వంటి కీలక ప్రాజెక్టులు ప్రత్యేక చొరవతో ముందుకు వస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులు, అనుమతుల విషయంలో సహకరిస్తున్నారని పేర్కొన్నారు.గత పదేళ్ల పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతిపక్షాలు విమర్శలకే పరిమితం కాకుండా నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు.ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజల మధ్యకు వచ్చే నాయకులం తాము కాదని, ఎన్నికలు ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రతిరోజూ రెండు డివిజన్లలో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగంగా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఎన్ని నిధులు ఖర్చు చేశామో లెక్కలతో సహా ప్రజల ముందుంచడానికి సిద్ధమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారివెంట జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఆజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆయా డివిజన్ ల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రేపు అన్ని గ్రామ పంచాయతీల్లో బాలల ప్రత్యేక గ్రామసభలు

జడ్చర్ల, నవంబర్ 13 (సింగిడి):
జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 14న అన్ని గ్రామ పంచాయతీల్లో బాలల సంక్షేమంపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గ్రామాల్లోని సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక గ్రామసభల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ సూచించారు. ఈ ప్రత్యేక గ్రామసభల్లో బాలల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. ముఖ్యంగా చిన్నారులకు టీకాలు, పోషకాహారం, ఆరోగ్యం, పాఠశాల హాజరు, సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, వైకల్య సహాయం, సామాజిక రక్షణ వంటి అంశాలను ఎజెండాలో చేర్చాలని సూచించారు. అదేవిధంగా బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, అక్రమ రవాణా, బాలలపై వేధింపులు, హింస, మత్తు పదార్థాల వినియోగం వంటి సమస్యల నివారణపై కూడా గ్రామసభల్లో చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో 18 సంవత్సరాల లోపు బాలబాలికలు నవంబర్ 14న నిర్వహించే బాలల గ్రామసభలకు అధిక సంఖ్యలో హాజరై, తమ సమస్యలు, అవసరాలను సభ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ కోరారు. బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ వారి సంక్షేమం, భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఈ గ్రామసభలు వేదికగా నిలవనున్నాయి.

రాజకీయ మార్పు కోసమే నా పోటీ

తెలంగాణ రక్షణ సేన పట్టభద్రుల అభ్యర్థి ఆకాష్ కొల్లురు



నారాయణపేట, నవంబర్ 13, (సింగిడి):
హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా నారాయణపేటకు వచ్చిన (టిఆర్ఎస్) తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు. రాజకీయాల్లో మార్పు తీసుకురావడానికి, పేదలు యువత గొంతుకగా నిలవడానికి తాను ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన పార్టీ పట్టభద్రుల అభ్యర్థి ఆకాష్ కొల్లురు స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని శాసనపల్లి రోడ్డులో గల ఓ హాల్లో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా జర్నలిజంలో పనిచేసిన అనుభవంతో పాటు, ప్రజల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. జాతీయ మీడియా ఛానెళ్లలో 12 సంవత్సరాలు పనిచేసి, 15 నేషనల్ ఇన్వెస్టిగేషన్స్ చేసినట్లు ఆయన తెలిపారు. రాజకీయాల్లోకి ఎందుకు? జర్నలిస్టుగా ఎన్నో కథనాలు చేసినప్పటికీ, చట్టాలు మారకపోవడం, బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగకపోవడాన్ని గమనించిన తర్వాతే రాజకీయాలే సరైన మార్గమని నమ్మి బరిలోకి దిగినట్లు ఆకాష్ కొల్లూరు వెల్లడించారు. పేద కుటుంబాల విద్యార్థులకు ఏడు సంవత్సరాల వరకు ఉచిత విద్యను అందించేలా విధానాలు అమలు చేస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో యువత సాధికారత కోసం కృషి చేస్తూ, బ్యాంకుల ప్రమేయం లేకుండా రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు అందించేలా ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. జర్నలిస్టులకు వారి అనుభవాన్ని బట్టి కనీస వేతనం ఉండేలా ప్రత్యేక చట్టాలు తెస్తామని, ప్రైవేట్ మీడియా హౌస్‌లలోనూ ఇది వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ పర్యటనలో భాగంగా స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు పలువురు న్యాయవాదులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బార్ కౌన్సిల్ తరపున వచ్చిన అభ్యర్థన మేరకు న్యాయవాదులందరికీ ఆరోగ్య భీమా సదుపాయం కల్పించే అంశంపై ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గవినోల్ల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు, మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాప్ సీజ్



అచ్చంపేట, నవంబర్ 13 (సింగిడి):
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో 13వ నంబర్ రేషన్ షాపును జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం రాజేందర్, ఏఎస్ఓ హార్డ్ అలీ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపులోని రికార్డులు, స్టాక్ వివరాలు, లబ్ధిదారులకు అందిస్తున్న సరుకుల పంపిణీ తీరును పరిశీలించారు. రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని అధికారులు సూచించారు. రేషన్ పంపిణీలో పారదర్శకత పాటించాలని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు వారు తెలిపారు.

నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు

- 24 ఏళ్ల చరిత్ర కలిగిన స్వయంభూ పుట్ట వద్ద భక్తుల కోలాహలం
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు
- మినీ మేడారం తరహాలో రెండేళ్లకోసారి జాతర: చైర్మన్ నీలం బిక్షపతి

అమీన్‌పూర్, నవంబర్ 13:(సింగిడి):
కార్తీక మాసం నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని సమ్మక్క సారక్క ఆలయ ప్రాంగణంలో ఉన్న స్వయంభువు నాగుల పుట్ట వద్ద మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పరిసర కాలనీల మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి, నాగదేవతకు ఆవుపాలు, పసుపు, కుంకుమ, చలిమిడి, వడపప్పు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నీలం బిక్షపతి మాట్లాడుతూ.. గత 24 సంవత్సరాలుగా సమ్మక్క సారక్క ఆలయ ప్రాంగణంలో స్వయంభువుగా వెలిసిన ఈ నాగుల పుట్టలకు ఎంతో విశిష్టత ఉందన్నారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో వచ్చే నాగుల చవితి, నాగుల పంచమి పర్వదినాల్లో వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు, ముఖ్యంగా మహిళలకు క్యూ లైన్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ తరపున అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా, ప్రతి రెండేళ్లకు ఒకసారి ఇక్కడ సమ్మక్క సారక్క అమ్మవార్ల జాతరను 'మినీ మేడారం'ను తలపించేలా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని చైర్మన్ గుర్తు చేశారు. తమ అధ్వర్యంలో జరిగే ఈ జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, కాలనీవాసుల సంపూర్ణ సహకారంతో జాతరను దిగ్విజయంగా, సజీవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అమ్మవార్ల ఆశీస్సులతో పాటు నాగమ్మ తల్లి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కాలనీవాసులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



జల మహోత్సవ సందడి

చేవెళ్ళ /షాబాద్, నవంబర్13(సింగిడి):
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక "హర్ ఘర్ జల్" కార్యక్రమంలో భాగంగా జల మహోత్సవ – హర్ ఘర్ జల్ అర్బన్ దివస్ ప్రోగ్రాంను శుక్రవారం చేవెళ్ల నియోజకవర్గం, షాబాద్ మండల పరిధిలోని నగరగూడ గ్రామ పంచాయతీలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బండ స్వరూప మహేందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ స్వరూప మహేందర్ గౌడ్ మాట్లాడుతూ, నగరగూడ గ్రామంలో 100% మిషన్ భగీరథ తాగునీటిని ప్రతిరోజూ ప్రతి ఇంటికి అందిస్తున్నామని తెలియజేశారు. గతంలో తాగునీటి కోసం ప్రజలు పడిన ఇబ్బందులు ఇప్పుడు లేవని, ప్రభుత్వం ఇంటింటికీ నల్లా ద్వారా స్వచ్ఛమైన నీటిని అందిస్తోందని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యం కోసం స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నాయని, దానిని సద్వినియోగం చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు.
నీటి నాణ్యతే ప్రధానం:– డీఈఈ హారిక
డీఈఈ టి. హారిక మాట్లాడుతూ, హర్ ఘర్ జల్ లక్ష్యం కేవలం నీరు అందించడమే కాదు, నీటి నాణ్యత, నిరంతర సరఫరా, ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ అని వివరించారు. తాగునీటిని ఎప్పుడూ శుభ్రంగా, మూత పెట్టిన పాత్రల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు.ఏఈఈ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, మిషన్ భగీరథ నిర్వహణ, నీటి సరఫరాలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నీటి ట్యాంకులు, పైప్ లైన్లను శుభ్రంగా ఉంచుకోవడం, అక్రమ కనెక్షన్లు తీసుకోకపోవడం ద్వారా అందరికీ సమానంగా నీరు అందుతుందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డి ఈ ఈ, నిహారిక,ఏ ఈ ఈ, వెంకటేశ్వరరావు. డిప్యూటీ సర్పంచ్ వేణుగోపాల్, వార్డు మెంబర్ మహిపాల్, ఎండి అప్సర్ కృష్ణ గౌడ్ యాదయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, మిషన్ భగీరథ హెల్పర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



హన్మకొండ, నవంబర్ 13, (సింగిడి):
ఐనవోలు మండలం వనమాలకనపర్తి గ్రామానికి చెందిన ముత్తినేని రజిత రాజుల కుమార్తె ప్రేమలత, అఖిల్ పటేల్‌ల వివాహ వేడుక మడికొండలోని శ్రీ రాజరాజేశ్వర గార్డెన్స్‌లో శుక్రవారం జరిగింది.ఆకుతోట కన్వెన్షన్ హాల్లో బొల్లేన నీలమ్మ భిక్షపతి కుమార్తె దివ్య రాజేష్ వివాహంతో పాటు మామునూరు గ్రామానికి చెందిన అనుముల వనమాల మల్లారెడ్డి కుమారుడు శ్రీకాంత్ రెడ్డి, వెన్నెల రెడ్డి వివాహం ఆదిత్య గార్డెన్ లో జరిగింది.ఈ వివాహ వేడుకలకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మెన్ సిలువేరు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ చేయూతనిస్తాం

- గత ప్రభుత్వ హయాంలో ఎనిమిదేళ్ల పాటు కొత్త పింఛన్లు ఇవ్వలేదు
- దీపావళి రోజున ప్రకటించిన హామీని అమల్లోకి తెచ్చాం
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- నేలకొండపల్లి మండలంలో 1,138 మందికి నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ



నేలకొండపల్లి నవంబర్:13(సింగిడి):
అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పథకం ద్వారా పింఛన్లు అందించి ఆర్థికంగా అండగా నిలుస్తామని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం,సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.ఒంటరి మహిళలు, వితంతువులు,గీత, చేనేత కార్మికులు, దివ్యాంగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. శుక్రవారం నేలకొండపల్లిలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో చేయూత పథకం కింద నూతనంగా మంజూరైన 1,138 పింఛన్లకు సంబంధించిన మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ ఎనిమిదేళ్ల పాలనలో కొత్త పింఛన్ల మంజూరు ఊసే లేదని విమర్శించారు. పింఛన్ల కోసం పేదలు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా, ఏళ్ల తరబడి ఎదురుచూసినా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎన్నికలకు ముందు తాను పర్యటించిన సమయంలో పేదల కష్టాలను ప్రత్యక్షంగా చూసి చలించిపోయానని గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించి అమలు చేస్తున్నట్లు తెలిపారు.
దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి కొత్త పింఛన్లు అందించనున్నట్లు ప్రకటించి, ఆ హామీని కార్యరూపంలోకి తీసుకొచ్చామని చెప్పారు. గత పాలకులు కమీషన్ల కోసం లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి, చివరకు అది కూలేశ్వరం ప్రాజెక్టుగా మిగిలిందని విమర్శించారు. ఇంకా ఎవరైనా అర్హులు పింఛన్ల కోసం ఎదురుచూస్తుంటే వారిని గుర్తించి తప్పకుండా మంజూరు చేస్తామని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.
మండలంలో 1,138 మందికి కొత్త పింఛన్లు
నేలకొండపల్లి మండలంలో చేయూత పథకం కింద మొత్తం 1,138 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. వీరికి ప్రతినెలా రూ.30,16,208 పింఛన్ల రూపంలో అందనుంది. నవంబర్ 13, 2026 నాటికి అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దివ్యాంగులు 361 మందికి నెలకు రూ.14,49,776, ఒంటరి మహిళలు 107 మందికి రూ.2,15,712, గీత కార్మికులు 64 మందికి రూ.1,29,024, చేనేత కార్మికులు ఇద్దరికి రూ.4,032, వితంతువులు 604 మందికి రూ.12,17,664 చొప్పున పింఛన్లు మంజూరయ్యాయి.
దివ్యాంగులకు ఒక్కొక్కరికి నెలకు రూ.4,016, మిగిలిన వర్గాల లబ్ధిదారులకు రూ.2,016 చొప్పున పింఛను అందనుంది. కొత్త పింఛన్లతో కలిపి మండలంలో మొత్తం 9,428 మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ.1,64,40,896 మేర ఆర్థిక సహాయం అందుతోందని అధికారులు వివరించారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొదాలి గోవిందరావు, సీనియర్ నాయకులు శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రూ.1,080 కోట్ల లింకేజీ రుణాల పంపిణీ లక్ష్యం

నేలకొండపల్లి, నవంబర్ 13(సింగిడి):
జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు రూ.1,080 కోట్ల లింకేజీ రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. ఇప్పటివరకు రూ.560 కోట్ల రుణాలను పంపిణీ చేశామని, మిగిలిన రూ.520 కోట్లను త్వరలోనే అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. శుక్రవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి సిబ్బందితో లింకేజీ రుణాల పంపిణీ, ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత అందించడంలో లింకేజీ రుణాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.
ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాలి
వీబీజీ రాంజీ పథకం కింద చేపడుతున్న ఉపాధి పనుల్లో కూలీలకు చేసిన పని కొలతల ఆధారంగానే వేతనాలు చెల్లించాలని సిబ్బందిని ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు, అవకతవకలకు తావివ్వకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలు పని ప్రదేశంలో కనీసం నాలుగు గంటలపాటు పనిచేయాలని సూచించారు. పనుల పర్యవేక్షణలో భాగంగా జీపీఎస్ ఆధారిత ఫొటోలు తీస్తున్నట్లు తెలిపారు. కూలీలకు వాస్తవంగా చేసిన పనికంటే అధికంగా వేతనాలు నమోదు చేసినట్లు గుర్తిస్తే సంబంధిత సిబ్బంది జీతాల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేస్తామని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం రోజుకు సుమారు 2,100 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారని తెలిపారు. కూలీల హాజరు శాతంలో జిల్లా రాష్ట్రస్థాయిలో 15వ స్థానంలో ఉందని పేర్కొన్నారు.
భవన నిర్మాణాలకు నిధుల కొరత లేదు
గ్రామ సమాఖ్య (వీవో), గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధుల కొరత లేదని డీఆర్డీఓ స్పష్టం చేశారు. పనులు పూర్తిచేసిన వెంటనే సంబంధిత బిల్లులను చెల్లిస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 490 వీవో భవనాలు, 103 గ్రామపంచాయతీ భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటివరకు నిర్మాణ పనులు చేపట్టిన వారికి రూ.9.20 కోట్ల మేర చెల్లింపులు చేసినట్లు వివరించారు. ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఐకేపీ ఏపీఎం కట్టా సురేందర్, సీసీలు పెద్దపాక వెంకటేశ్వరరావు, పెరుగు మల్లయ్య, నాగేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థుల ప్రతిభ



కరీంనగర్, నవంబర్13(సింగిడి):
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు జిజ్ఞాస విద్యార్థి పరిశోధన ప్రాజెక్టుల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతులు సాధించారు. రసాయనశాస్త్ర విభాగంలో అరటి తొక్కలతో పర్యావరణహితంగా కుళ్లిపోయే పాలిమర్ తయారీ అంశంపై జారా ఫాతిమా, నవ్యశ్రీ, సిరిచందన, వందన, సమీక్ష రూపొందించిన ప్రాజెక్టుకు డాక్టర్ రావుల మొగిలి మార్గదర్శకత్వం వహించారు. తెలుగు విభాగంలో 'దాశరథి గీతాలు–ఉద్యమ స్ఫూర్తి' అంశంపై ఆశ్రిత, కృపామణి, హస్మిత, అర్చన, రమ్య, కోమలత రూపొందించిన ప్రాజెక్టుకు కాజీపేట వెంకటరమణ మార్గదర్శనం చేశారు.విజేతలకు మేయర్ శ్రీనివాస్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ బహుమతులు అందజేశారు. డిగ్రీ స్థాయిలోనే పరిశోధనలపై ఆసక్తి పెంపొందించేందుకు జిజ్ఞాస ప్రాజెక్టులు ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. విద్యార్థులను, మార్గదర్శక అధ్యాపకులను కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

షాబాద్ లో అభివృద్ధి పండుగ



చేవెళ్ళ /షాబాద్, నవంబర్13(సింగిడి):
చేవెళ్ళ నియోజకవర్గం షాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో సందడి నెలకొంది. శాసనసభ్యులు కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరుకాగా, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి గౌరవ అతిథిగా, స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని 14వ వార్డులో హెచ్ఎండీఏ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, షాబాద్ మండల కేంద్రంలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, దశలవారీగా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. మండల కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.
సర్వసభ్య సమావేశంలో అభివృద్ధిపై సమీక్ష.
అనంతరం షాబాద్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి "సమీక్ష మరియు సామర్థ్య వృద్ధి శిక్షణ (కెపాసిటీ బిల్డింగ్)" సమావేశంలో పాల్గొన్నారు.మండల పరిధిలోని గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో ఎమ్మెల్యే క్షుణ్ణంగా సమీక్షించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ఒక్క లబ్ధిదారుడు కూడా సంక్షేమ పథకాలకు దూరం కాకూడదని స్పష్టం చేశారు.
చేయూత పెన్షన్ల పంపిణీతో లబ్ధిదారుల్లో ఆనందం
తదనంతరం షాబాద్ మండలంలోని ఎంఎస్ గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన "చేయూత పెన్షన్ల" మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి కలిసి అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు చేయూత పెన్షన్ ఎంతో ఆసరాగా నిలుస్తుందని అన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పెన్షన్ల ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు.పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్ జి. వెంకట నారాయణ, ఎంపీడీఓ అపర్ణ, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావాలి చంద్రశేఖర్, సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు, పెంటరెడ్డి,సర్పంచ్,గుండాల అశోక్ వివిధ గ్రామ సర్పంచులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అల్వాల్ అభివృద్ధికి ప్రత్యేక కృషి

తోట లక్ష్మీకాంత్ రెడ్డి

అల్వాల్, నవంబర్ 13 (నినాదం):
అల్వాల్ పట్టణంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపడుతున్నామని మల్కాజ్గిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇంజనీరింగ్ అధికారి డి ఈ మహేష్, ఏ ఈ అరుణ్, లతో కలిసి ఐజి ఇందిరాగాంధీ సర్కిల్, లేబర్ అడ్డా వద్దనున్న వాయంశాలను పరిశీలించి అభివృద్ధి పనులపై సమీక్షించారు.
లేబర్ అడ్డా వ్యాయామశాల రూ, 30 లక్షలతో రెండు అంతస్తుల భవనం గా అభివృద్ధి చేయడంతో పాటు ఇందిరా గధీ చౌరస్తా. గోల్నాక ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా ఎం హెచ్ ఓ కూడలి అభివృద్ధి కి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో అల్వాల్ ను అభివృద్ధిలో ముందంజలో నిలుపుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, బెబ్బులి సురేందర్ రెడ్డి, దేవేందర్, స్వామి, కేబుల్ శేఖర్, నిమ్మ అశోక్ రెడ్డి, కృష్ణ గౌడ్, మండల శివ, సాయిరాం గౌడ్, శ్రీశైలం యాదవ్, జ్యోతి యాదవ్, లక్ష్మి , నీతు గోరి, షీలా అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

చెరువులో నీటి నిల్వకు కోత



సూర్యాపేట జిల్లా ప్రతినిధి (సింగిడి):
పంటల సాగుకు మోటార్ల మోత.. చెరువులో నీటి నిల్వలకు కోత.. రేపటి వేసవిలో పశువుల దాహానికి తిప్పలు తప్పవా? అన్న ఆందోళన పాలవరం గ్రామస్థుల్లో వ్యక్తమవుతోంది.అనంతగిరి మండలం పాలవరం చెరువు కింద ఉన్న రైతులు నిత్యం మోటార్ల ద్వారా నీటిని తోడుతుండటంతో చెరువులో నీటిమట్టం క్రమంగా తగ్గిపోతోందని గ్రామ ప్రజలు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వేసవికాలం నాటికి నీటి నిల్వలు మరింత తగ్గిపోయి పశువులకు తాగునీటి సమస్య ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎండలు ముదిరే కొద్దీ పశువులకు నీటి అవసరం పెరుగుతుందని, ప్రస్తుతం చెరువులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించకపోతే వేసవిలో ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. సాగు అవసరాలతో పాటు పశువుల తాగునీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నారు. చెరువులో మిగిలిన నీటి నిల్వలను కాపాడేందుకు మోటార్ల వినియోగంపై తగిన నియంత్రణ చేపట్టి, నీటి వృథాను అరికట్టేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో 14మంది జవాన్లకు గాయాలు

- ఎదురు కారును తప్పించ బోయి బోల్తాపడిన ఆర్మీ వ్యాన్.
- హవల్దార్ అవిందర్ సహా 14 మంది జవాన్లకు గాయాలు.
- చేవెళ్ల మండల పరిధిలోని అల్లవాడ సమీపంలో ఘటన.



చేవెళ్ల, నవంబర్13(సింగిడి):
చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లవాడ గ్రామ గేట్ సమీపంలో ఆర్మీ వ్యాన్ బోల్తా పడిన ఘటన కలకలం రేపింది.ఎదురుగా వస్తున్న మరో కారును తప్పించబోయి ఆర్మీ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఒక్కసారిగా వ్యాన్ బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న జవాన్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.
ఈ ప్రమాదంలో డ్రైవింగ్ ట్రైనింగ్ లో ఉన్న హవల్దార్ అవిందర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో 13 మంది జవాన్లు కూడా గాయపడ్డారు. మొత్తం 14 మంది జవాన్లకు గాయాలు అయినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి క్షతగాత్రులను బయటకు తీసి చికిత్స నిమిత్తం శంషాబాద్ లోని ఆర్జాన్ సూపర్ స్పెషాలిటీస్ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతానికి గాయపడిన జవాన్లందరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చేవెళ్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై విచారణ చేపట్టారు.

ప్రధానోపాధ్యాయుడు సహా ఏడుగురికి షోకాజ్ నోటీసులు

పోలీస్ స్టేషన్ లో అరుదైన వేడుక



జడ్చర్ల, నవంబర్ 13 (సింగిడి):
జడ్చర్ల మండలం నస్రుల్లాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరుతి నారాయణతో పాటు ఆరుగురు ఉపాధ్యాయులు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. గైర్హాజరైన వారిలో ప్రధానోపాధ్యాయుడు మరుతి నారాయణ, ఉపాధ్యాయులు సుశీల, శ్రీనివాస్ గౌడ్, శంకర్, మంజుల, రాఘవేంద్ర, చామంతి ఉన్నారు. వీరంతా అమరావతికి విద్యా పర్యటనకు వెళ్లినట్లు సమాచారం. ఈ విషయంపై అదనపు కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు ఆరుగురు ఉపాధ్యాయులకు వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని (డీఈఓ) ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, సమయపాలన విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

మహిళా కానిస్టేబుల్‌కు అట్టహాసంగా సీమంతం

నారాయణపేట, నవంబర్ 13, (సింగిడి):
రక్షక భటులుగా శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీస్ శాఖ, మరోసారి తనలోని మానవీయ కోణాన్ని చాటుకుంది. విధి నిర్వహణే కాదు.. తోటి ఉద్యోగుల బాగోగులు, వారి కుటుంబ వేడుకల్లో పాలుపంచుకోవడంలోనూ తాము ముందుంటామని నారాయణపేట జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులు, తోటి సిబ్బంది నిరూపించారు.నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ శిరీష ఏడు నెలల గర్భవతి కావడంతో, తోటి సిబ్బంది ఆమెకు ఘనంగా సీమంతం వేడుక నిర్వహించారు.సాధారణంగా సీమంతం వేడుకలను ఇళ్లలో లేదా ఫంక్షన్ హాల్స్‌లో ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. కానీ, నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇందుకు భిన్నంగా కనీవినీ ఎరుగని రీతిలో ఈ వేడుకను నిర్వహించారు. టౌన్ సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, మహిళా ఎస్ఐ గాయత్రి తదితరులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పోలీస్ అధికారులతో పాటు సహచర కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు అందరూ కలిసి నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌ను వేదికగా చేసుకుని శిరీషకు పూలు, పండ్లు, చీర, గాజులతో సంప్రదాయబద్ధంగా సీమంతం జరిపించారు. నిండు నూరేళ్లు ఆయుష్షుతో ఉండి పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆశీర్వదించిన ఆ అధికారులు, తోటి కానిస్టేబుళ్లు. స్టేషన్లో జరిగిన ఈ ఆత్మీయ వేడుకతో పోలీస్ సిబ్బంది అంతా ఒకే కుటుంబంలా మారిపోయారు.అభినందించిన ఉన్నతాధికారులు ఇది తెలుసుకున్న స్థానికులుఖాకీ యూనిఫాం వెనుక కూడా సున్నితమైన మనసులుంటాయని, తోటి సిబ్బంది కష్టసుఖాల్లో పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ వేడుక మరోసారి రుజువు చేసింది. ఎక్కడాలేని విధంగా పోలీస్ స్టేషన్‌లోనే మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం నిర్వహించిన సీఐ శివశంకర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, గాయత్రిలను తోటి సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు. ఈ అరుదైన ఘటన నారాయణపేట జిల్లాలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారడంతో పాటు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఇలాంటి వినూత్నమైన కార్యక్రమాలను చేస్తూ ప్రజల మన్ననలు, ప్రేమాభిమానాలను చూరగొని సొంతం చేసుకుంటున్నా నారాయణపేట పోలీసులు



టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు
మున్నూరు కాపు సంఘం ప్రతినిధుల కృతజ్ఞతలు



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): మున్నూరు కాపు సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 కోట్ల నిధులు మంజూ రు చేయ డంపై సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు సామాజిక వర్గ ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా భవన నిర్మాణా నికి నిధులు మంజూరు చేయడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ భవనం సామాజిక వర్గ అభ్యున్నతికి,సంఘటిత శక్తికి కేంద్రంగా నిలుస్తుం దని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, రాంభూపాల్,నిజామాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ధర్మపురి సంజయ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, రత్నాకర్, కార్పొరేటర్ ఎర్రం గంగాధర్, గోపికృష్ణ, ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో టీఎన్జీవో సభ్యత్వ నమోదు ప్రారంభం



నిజామాబాద్ప్రతినిధి, (సింగిడి): టీఎన్జీవో సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్,టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ లో ప్రారంభిం చారు. నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల జిల్లా విద్యాశాఖ వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీఎన్జీవో సభ్యత్వ నమోదు కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ లు హాజరయ్యారు. సుమన్ మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి టీఎన్జీవో సభ్యత్వాన్ని సదరు శాఖ ఉద్యోగులకు అందజేసి, టీఎన్జీవో సభ్యత్వం ప్రాము ఖ్యతను వివరించి, ఇతర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగుల సమస్యలే పరమావధిగా భావిస్తున్న టీఎన్జీవో సంఘం ప్రతి ఉద్యోగికి యెల్లవేళల్లో అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఆయా శాఖల ఉద్యోగులు, మహిళా ఉద్యోగసోదరీమణులు హాజరై టీఎన్జీవో సభ్యత్వాన్నిస్వీకరించారు. ఈ సభ్యత్వనమోదులో టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి నిరంజన్ గౌడ్, ఉపాధ్య క్షులు శివకుమార్, టీఎన్జీవో అర్బన్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి, విద్యాశాఖ ఫోరం అధ్యక్ష కార్యదర్శులు అశ్విన్ కుమార్, శోభన్,టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్, వ్యవసాయ శాఖ ఫోరం జిల్లా కార్యదర్శి గోవర్ధన్ లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక!

కంకర, ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలి..
జాజాల ఇసుక రీచ్‌లకు అనుమతుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి..
అధికారులకు కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశం..



నాగర్‌కర్నూల్ (సింగిడి): జిల్లాలో కంకర, ఇసుక లభ్యతను పెంపొందించడంతో పాటు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు, ముఖ్యంగా ఇందిర మ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ప్రీ యాక్షన్ కమిటీ, జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లాలో కంకర తవ్వకాలకు గుర్తించిన ప్రాం తాలు, నూతనంగా గుర్తించిన ఇసుక రీచ్‌లు, వాటికి అవసరమైన అనుమతులు, ఇసుక సరఫరా విధానంపై అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి, నాగర్‌కర్నూల్ మండలాల్లో కంకర తవ్వకాల కోసం గుర్తించిన రెండు గ్రామాల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థి తులను సమగ్రంగా పరిశీలిం చాలని సూచించారు. కంకర తవ్వకాలకు అనుకూలత, ప్రభు త్వ నిబంధనలు, అవసరమైన అనుమతులపై అధ్యయ నం చేసి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను వేగ వంతం చేయాలని ఆదేశించారు.అదేవిధంగా వం గూరు మండ లం జాజాల గ్రామ పరిధిలో నూతనంగా గుర్తించిన ఇసుక రీచ్‌లకు అవసరమైన అనుమతులు మంజూరు చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించి, ప్రభుత్వ నిబం ధనలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా చూడాలి జాజాల గ్రామంలో గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచి జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇంది రమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేలా కార్యా చరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఇళ్ల నిర్మాణ పనులకు ఇసుక కొరత అడ్డం కిగా మారకుండా, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగు ణంగా ఉచిత ఇసుక అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఇసుక రీచ్‌ల అనుమతులు, కంకర తవ్వకాలు, ఇసుక సరఫరా విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా బాధ్య తాయుతంగా వ్యవహ రించాలని పేర్కొన్నారు. పారదర్శ కంగా అనుమతుల ప్రక్రియను పూర్తి చేసి ప్రజ లకు, ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలకు అవసరమైన నిర్మాణ సామగ్రి అందుబా టులో ఉండేలా చర్యలు తీసుకోవాల న్నారు. సమా వేశంలో ఏడీ మైనింగ్ హరికృష్ణ, పీడీ హౌసింగ్ గోపాల్ నాయక్, భూగర్భ జల శాఖ అధికారిణి దివ్యజ్యోతి, ఆర్డీవోలు అర్చన, బన్సీలాల్, జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి సింగిల్ విండో చైర్మన్గా
ఎనుముల నాగరాజు
ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న గట్టు మండల వాల్మీకి నాయకులు



గద్వాల ప్రతినిధి (సింగిడి): జోగులంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సింగిల్ విండో) చైర్మన్‌గా ఎనుముల నాగరాజు ప్రమాణ స్వీకార కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గట్టు మండ లానికి చెందిన వాల్మీకి నాయకులు హాజరై నూతన చైర్మన్‌కు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏనుముల నాగరాజును నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందిం చారు. సహకార రంగం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. రైతుల సమస్యల పరిష్కా రానికి చైర్మన్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. వాల్మీకి సామా జిక వర్గ అభ్యున్నతికి నాయకులు ఐక్యంగా కృషి చేయాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఏనుముల నాగరాజు తన పదవికి న్యాయం చేస్తూ రైతుల సంక్షేమానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గట్టు మండలానికి చెందిన పలువురు వాల్మీకి నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

అలంపూర్ నియోజకవర్గంలో ఎర్రమట్టి మాఫియా ఆగడాలు..!



అడ్డూ అదుపు లేకుండా అక్రమ తరలింపు!
రాత్రివేళ వందలాది టిప్పర్లతో మట్టి రవాణా..
నిద్ర మత్తులో రెవెన్యూ మైనింగ్ అధికారులు?ప్రభుత్వ ఆస్తులే కాదు..
ప్రజల ఆస్తులకూ నష్టం
కలెక్టర్, ఎస్పీ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

గద్వాల ప్రతినిధి (సింగిడి):జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గంలో ఎర్ర మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపు యథేచ్ఛగా కొనసాగుతు న్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజామున 7 గంటల వరకు వందలాది టిప్పర్లతో ఎర్ర మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతూ పర్యావరణాన్ని దెబ్బతీ యడమే కాకుండా, భారీ టిప్పర్ల రాకపోకలతో రహదా రులు ధ్వంసమవుతున్నాయని వాపోతున్నారు. ముఖ్యం గా శని, ఆదివారాల్లో ఈ అక్రమ రవాణా మరింత జోరుగా సాగుతోందని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. సోషల్ మీడియా, పత్రికల్లో వరుసగా కథనాలు వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తు న్నారు. అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా? లేక నిద్రమత్తులో ఉన్నారా? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు.

టిప్పర్ల డ్రైవర్ల నిర్లక్ష్యం..
తెగిపడిన ఇంటి విద్యుత్ తీగలు,డిష్ వైర్లు

గురువారం ఉదయం రెండు టిప్పర్లు ఎస్సీ కాలనీలోకి వచ్చి ఎర్ర మట్టిని అన్‌లోడ్ చేసి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఈ మట్టి తరలింపునకు అనుమతులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించగా, తమను అడగవద్దని, ఈ వ్యవహారాలు చూసుకునే వారు వేరే ఉన్నారని డ్రైవర్లు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు ఆరోపించారు. టిప్పర్ల ఫొటోలు తీసుకున్నా, ఎవరికి ఫిర్యాదు చేసినా భయపడేది లేదంటూ సవాల్ చేసినట్లు స్థానికులు





పేర్కొన్నారు. వడ్డేపల్లి మండలం జులకల్ గ్రామానికి చెందిన కొందరి పేర్లను డ్రైవర్లు ప్రస్తావిస్తూ, ఏమైనా మాట్లాడాలంటే వారితో మాట్లాడాలని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు.అదే సమయంలో చర్చి ముందు ఉన్న విద్యుత్ తీగలు, డిష్ కేబుళ్లు టిప్పర్ల కారణంగా తెగిపడినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతటితో ఆగకుండా తెగిపడిన తీగలను పక్కకు తొలగించి వెళ్లిపోయారని, ఇది ప్రజల ప్రాణాలకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్, ఎస్పీ స్పందించాలి..
అక్రమ రవాణాపై కేసులు నమోదు చేయాలి

ప్రభుత్వ రహదారులను ధ్వంసం చేస్తూ, ప్రజల ఆస్తులకు నష్టం కలిగిస్తూ సాగుతున్న ఈ మట్టి రవాణాపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించి, టిప్పర్ల యజమానులు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాత్రివేళ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకోవాలని, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

చందూర్ ప్రభుత్వ ఆసుపత్రికి
రూ.40 లక్షల నిధులు మంజూరు చేయాలి
వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతి



నిజామాబాద్ ప్రతినిధి,(సింగిడి): చందూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేయడానికి అవసరమైన రూ.40 లక్షల నిధులు మంజూరు చేయాలని హైదరాబాద్‌లోని రాష్ట్రవైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు చందూర్ మండల ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్ కర్లం సాయిరెడ్డి, కారేగాం తాండా సర్పంచ్‌డా. లాల్‌సింగ్, లక్ష్మాపూర్ సర్పంచ్ ఉమా సంజీవ్, మేడిపల్లి సర్పంచ్ శ్రావణి రవి, ఇతర గ్రామ పెద్దలు మంత్రివర్యులను కలిసి ఆసుపత్రి పనుల ప్రాధాన్యతను వివరించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా రూ.40 లక్షల నిధులు అవసరమని వివరించగా మంత్రి దామోదర రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు. చందూర్ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చేసిన ఈ ప్రయత్నానికి సానుకూలంగా స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, ప్రత్యేక చొరవ చూపిన ఎం.పి సురేష్ షెట్కార్, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి మండల ప్రజల తరఫున హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైతు సంఘం మహాసభలను
విజయవంతం చేయాలి..
నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి..రైతు సంఘం నాయకులు చిలుక బాల్ రెడ్డి..



కల్వకుర్తి (సింగిడి): ఈ నెల 15 నుంచి 18 వరకు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న అఖిల భారత జాతీయ రైతు సంఘం మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు చిలుక బాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కల్వకుర్తి పట్టణంలో జాతీయ మహాసభలకు సంబంధించిన గోడపత్రికను నాయకులతో కలిసి విడుదల చేశారు.అనంతరం చిలుక బాల్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ రసాయన ఎరువులు, పురుగుమందుల ధరలను భారీగా పెంచి రైతులపై ఆర్థిక భారాన్ని మోపుతోందని విమర్శించారు. గతంలో రైతు వ్యతిరేక మూడు నల్ల వ్యవసాయ చట్టాలను అమలు చేసేందుకు ప్రయత్నించిన కేంద్ర ప్రభుత్వం, రైతుల పెద్ద ఎత్తున ఉద్యమాలు, ఆందోళనల నేపథ్యంలో వాటిని వెనక్కి తీసుకుందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం దొడ్డిదారిన వాటిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. కరువు పరిస్థితుల కారణంగా ఎండిపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు 50 వేల చొప్పున, ఆహార పంటలకు ఎకరాకు 30 వేల చొప్పున నష్టపరిహారం అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే తెల్ల రేషన్ కార్డుతో సంబంధం లేకుండా వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతుకు రైతు బీమా పథకాన్ని వర్తింపజేయా లని కోరారు. రైతుల సమస్యలు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళు ్ల, రైతాంగ హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న అఖిల భారత జాతీయ రైతు సంఘం మహాసభలకు రైతులు, కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, సీఐటీయూ నాయకులు యాదయ్య, రాజుగౌడ్, మాజీ కౌన్సిలర్ చిన్న, నాయకులు బిక్షమయ్య, చిన్న శ్రీనివాసులు, సాయిబాబు, నాగేష్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తీగలపల్లిలో అండర్
గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం
పనులను పరిశీలించిన ఎంపీడీవో



కోడేరు, (సింగిడి):కోడేరు మండలంలోని తీగలపల్లి గ్రామంలోని2వ వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీడీవో విజయలక్ష్మి గురువారం నాడు పరిశీలించారు. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సురేశ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్య సాయి సేవా సంస్థలు సేవలు అద్భుతం
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ,డాక్టర్ డి. రామారావు,



ఖమ్మం, (సింగిడి): ఖమ్మం జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల (ట్రస్ట్) ఆధ్వ ర్యంలో గత 15 సంవత్సరాలుగా ప్రతి నెల 12న నిర్వహిస్తున్న నిరంతర సేవా కార్యక్రమాలలో భాగంగా, గురువారం హెచ్.ఐ.వి బాధితులకు , నిరుపేద వృద్ధులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ,డాక్టర్ డి. రామారావు ముఖ్యఅతిథిగా హాజరై బాధితులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ట్రస్ట్ సభ్యులు గత 15 ఏళ్లుగా క్రమం తప్పకుండా హెచ్.ఐ.వి బాధితులకు, వృద్ధులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమని ప్రశంసించారు. గత నెలలో టీబీ వ్యాధి బాధితులకు కూడా పోషకాహార కిట్లు పంపిణి చేయడం జరిగిందని పేర్కొన్నారు. వైద్యంతో పాటు సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల హెచ్.ఐ.వి బాధితుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని టీబీవ్యాధి గ్రస్థులకు, నిరుపేదలకు వయో వృద్ధులకు మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించాలని డాక్టర్ రామారావు సూచిం చారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి సేవా కార్యక్రమాలలో మరింతగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, సేవాదళ్ సభ్యులు ప్రసిడెంట్ శంకర్, సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బిజేవైఎం జాతీయ అధ్యక్షులు హేమంగ్ జోషిని
సన్మానించిన ఆమంద్ విజయ్ కృష్ణ



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): బీజేవైఎం జాతీయ అధ్యక్షులు హేమంగ్ జోషి తెలంగాణ పర్యటనలో భాగంగా బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కుందే గణేష్ నేతృత్వంలో జాతీయ అధ్యక్షులను మర్యాదపూర్వకంగా కలి సారు. ఈ సందర్భంగా బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కో-కోశాది, కారి ఆమంద్ విజయ్ కృష్ణ హేమంగ్ జోషిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం తెలంగాణ లో యువ మోర్చా చేపడుతున్న కార్యక్రమాలు, యువతను సంఘ టితం చేయడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై చర్చించారు.జాతీయ అధ్యక్షుల మార్గదర్శకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో యువమో ర్చాను మరింత బలోపేతం చేస్తూ యువత సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని ఆమంద్ విజయ్ కృష్ణ తెలిపారు.

కిసాన్ సభ మహాసభలను జయప్రదం చేయండి



కోడేరు (సింగిడి):నల్గొండ జిల్లాలోఈ నెల 15 నుంచి 18 వం-కు నిర్వహించే అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.శివశంకర్ పిలుపునిచ్చారు. గురువారం జనుంపల్లిలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 15న లక్ష మందితో జరిగే బహిరంగ సభకు రైతులు తరలిరావాలన్నారు. అన్ని పంటలకు ప్రభుత్వంమద్దతు ధర కల్పిస్తూ పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు

ఎంగేజ్మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న కోడేరు సర్పంచ్



కోడేరు (సింగిడి):కోడేరు మండల కేంద్రంలోని మం గలి వెంకటయ్య కుమార్తె ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి గురు వారం గ్రామ సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి హాజరై నూతన దంపతులను అక్షింతలేసి శుభాకాం క్షలు తెలిపారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొమిరే మాసయ్య . గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు సభ్యులు ఆది శరత్ రామకృష్ణ సోప్పరి శీను సత్యనారాయణ వాల్మీకి సంఘం మండల నాయకులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

జీవో 14ను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలి
డీఆర్వో కు బీసీ సాధికారత సంఘం జిల్లా నాయకుల వినతి





ఆర్మూర్, (సింగిడి): జిల్లా బీసీ సాధికా రత సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బీసీ సాధికారత సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుస్సాపూర్ శంకర్ ఆధ్వర్యంలో 14 జీవో ను వెంటనే రద్దు చేయాలం టూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డిఆర్ఓ కార్యాలయంలో అధికారికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అం దజేశారు. అనంతరం బీసీ సాధికారత సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపె ట్టిన జీఓ 14ని తక్షణం రద్దు చేయాలని. బిసిల ఆత్మ గౌరవ భవనాలపై ప్రభుత్వం పెత్తనం చెల్లదని. అ-రకొర నిధులు పెంచి మా ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే విధానాన్ని మేము సహించ బోమని వారు హెచ్చరిం చారు. దేశ జనాభాలో గాని, రాష్ట్ర జనాభాలో గాని సమాజంలో మేమే సగం కంటే ఎక్కువ జనాభా కలి గిన బీసీ జనాభా ఉన్నారని వారన్నారు. ఈ సంద ర్భంగా బీసీ సాధికారత సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి బుస్సాపూర్ శంకర్ మాట్లాడుతూ, సీ.ఎం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కామరెడ్డి డిక్లరేషన్ అమలు చేయలేక, ఈరోజు 14 జీఓ తీసుకరాదాన్ని మేము తీవ్రంగా వ్యతి రేకిస్తున్నామని అన్నారు.

వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మగౌ రవ భవనాలపై ప్రభుత్వ పెత్తనం ఏమిటని ప్రశ్నిం చారు. గాండ్ల తేలికుల సంగం రాష్ట్ర అధ్యక్షులు ఇంద ల్వాయి కిషన్ మాట్లాడుతు,సమాజంలో మేమే ఎక్కు వున్నాము, మాదేఅధికారమన్నారు. మాజోలికస్తే మిమ్మల్ని గద్దిం పుతామన్నారు. అరకొరగా నిధులు కేటాయించి, మేచేతూకు బెల్లంఫెట్టుతే మేము మీ తాపేదార్లము కాదన్నారు.దేశ ప్రధానిగా బీసీకి చెందిన మోడీ కావడంతో, ఇది జీర్ణించుకోలేని అగ్రవర్ణాల ముద్ర వేసే ప్రయత్నం కాంగ్రెస్ చేయడం కుట్రపూరితమని వారు ఆరోపించారు. సామాజిక సామరతతో సబ్ కె సాత్ - సబ్కా వికాస్ తో ముందు కెళ్తున్న మన బీసీ ప్రధాని నేత అని వారు కొనియా డారు. 14 జీవోను వెంటనే రద్దు చేయాలని, లేనియె డల బీసీ సాధికారత సంఘం ఆధ్వర్యంలో ఆందోళ నలు తీవ్రతరం చేస్తామని బీసీ సాధికారత సంఘం జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు మేక సునంద హెచ్చరించారు. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి జీవో 14 వెంటనే రద్దు చేయాలంటూ పలు వృత్తిరేక నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమం లో బిసి, రాష్ట్ర,జిల్లా నాయకులు లోపంశ లావణ్య, విజయ, సురేష్, శ్రీ హరి ప్రసాద్ చారి, భయ్యా జ్యోతి, చంద్రశేఖర్ గౌడ్, రవీందర్, గాండ్ల విశ్వకర్మ ప్రతినిధులు, పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యాధునిక
బయో మెడికల్ వేస్ట్ స్టోరేజ్ రూమ్స్ ప్రారంభం

ఖమ్మం, (సింగిడి): ఖమ్మం ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో వైద్య వ్యర్థాల నిర్వహణను మరింత పకడ్బందీగా, పరిశుభ్రంగా పర్యావరణ హితంగా నిర్వహించేందుకు బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ ప్రమాణాలు, నమూ నాల ప్రకా రం అత్యాధునిక బయో మెడికల్ వేస్ట్ స్టోరేజ్ రూమ్స్‌ను నిర్మించడం జరిగింది. ఈ నూతన భవనాన్ని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. నరేందర్ , అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్ , నర్సింగ్ ఆఫీసర్లు , పారిశుద్ధ్య విభాగపు సూపర్వైజర్ల సమక్షంలో ప్రారంభించారు. ఈ స్టోరేజ్ రూమ్స్‌లో బయో మెడికల్ వ్యర్థాలు మరియు సాధారణ వ్యర్థాలను వాటి స్వభావాన్ని బట్టి వేర్వేరుగా సేకరించి నిల్వ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పసుపు, ఎరుపు, నీలం, తెలుపు రంగుల విభాగాల ద్వారా వివిధ రకాల వైద్య వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేరు చేయడానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో పనిచ

సచిన్ సావంత్‌తో సిరాజ్ హుస్సేన్ భేటీ

కాంగ్రెస్ పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చ



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సిరాజ్ హుస్సేన్ గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర సహ ఇన్‌ఛార్జి సచిన్ సావంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం సోనియా గాంధీ జీవిత ప్రస్థానాన్ని వివరించే 'బిలోంగింగ్: ఎ మెమోయిర్' పుస్తకాన్ని సచిన్ సావంత్ ఆయనకు అందజేశారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని సిరాజ్ హుస్సేన్ తెలిపారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు శ్రీచైతన్య విద్యార్థులు

తైక్వాండో, కబడ్డీలో ముగ్గురికి అవకాశం విద్యార్థులను అభినందించిన సంస్థ చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్-19 తైక్వాండో విభాగంలో వాసరి హారిక, కల్వ రోషిణి, కబడ్డీలో ఎర్రవెల్లి అభినయశ్రీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి విద్యార్థులను అభినందించి సత్కరించారు. క్రమశిక్షణ, పట్టుదలతో జాతీయ స్థాయిలో రాణించి సంస్థకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, సెక్రటరీ ముద్దసాని సాయి చైతన్య రెడ్డి, కళాశాలల డీన్ జగన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి, ఫిజికల్ అడ్వైజర్ లెంకల మహిపాల్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టిఆర్ఎస్ నాయకుల అధ్వర్యంలో అధికారులకు సన్మానం



మల్లాపూర్, (సింగిడి):: తెలంగాణ రక్షణ సేన పార్టీ మల్లాపూర్ మండల నూతన కమిటీ సభ్యులు గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి అలువల శ్రీకాంత్, తహసీల్దార్ రామచందర్ నీ మర్యాదపూర్వకంగా కలిసి నూతనంగా నియమితులైన టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దేశెట్టి కిరణ్ సంబంధిత అధికారులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు మైలారం గౌతమ్, ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు, సంయుక్త కార్యదర్శి ఆరెల్లి మహేష్, సురకంటి వినోద్‌రెడ్డి, బండి రాజు, శ్రీనివాస్ యాదవ్, కొండ మధు తదితరులు పాల్గొన్నారు.

శిశు మందిర్‌ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం దారణం

కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా నాణ్యమైన విద్య, సంస్కారాన్ని అందిస్తున్నాయి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కరీంనగర్ ప్రతినిధి,(సింగిడి): కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందిస్తూ పేద విద్యా ర్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న సరస్వతీ శిశు మందిర్‌ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో నిర్వహించిన విభాగ స్థాయి సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యతోపాటు సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి, నైతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందించడంలో శిశు మందిర్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి విద్యాసంస్థల పట్ల ప్రభుత్వం రాజకీయ ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. సమావేశంలో దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్ రెడ్డి, పలువురు విద్యావేత్తలు, పాఠశాలల ప్రతినిధులు, ఆచార్యులు పాల్గొన్నారు.

46 మందికి ఉద్యోగాలు

ఉద్యోగ మేళాకు 173 మంది అభ్యర్థుల హాజరు



సంగారెడ్డి బ్యూరో, (సింగిడి): జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖ , జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు వివిధ విద్యార్హతలు కలిగిన 173 మంది అభ్యర్థులు హాజరయ్యారు.
సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఈ ఉద్యోగ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల్లో ఉద్యోగాల కోసం 46 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. 1. ఫాక్స్‌కాన్ – 35 మంది, 2. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ – 3 మంది 3. నెక్స్ట్ క్లిక్ – 3 మంది,4. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ – 5 మంది, నిరుద్యోగ యువత, ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు రానున్న ఉద్యోగ మేళాలు, ఉద్యోగ అవకాశాల వివరాలను తెలుసుకునేందుకు deesangareddy ఇన్‌స్టాగ్రామ్ ఛానల్‌ను అనుసరించాలని జిల్లా ఉపాధి అధికారి రవికిరణ్ రెడ్డి సూచించారు.



మహిళ సాధికారకతకు ప్రభుత్వం పెద్దపీట

చెరువుల అభివృద్ధికి 6కోట్ల నిధులు మంజూరు: ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల ప్రతినిధి, (సింగిడి): జగిత్యాల పట్టణానికి చెందిన 57 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన 57 లక్షల విలువగల చెక్కులను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తు మహిళ సంక్షేమం అభివృద్ధి సంక్షేమంకోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని చింత కుంట చెరువు, మోతే చెరువు అభివృద్ధికి ప్రభుత్వం ఒక్కో చెరువుకు రూ. 3కోట్ల చొప్పున రెండు చెరువులకు 6 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఏడాది క్రితమే నిధులు మంజూరైనప్పటికీ వర్షాలు, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పనుల ప్రారంభంలో కొంత జాప్యం జరిగిందని వివరించారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి, పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజలందరికీ ఈ విషయం తెలుసన్నారు. కొందరు నాయకులు కావాలనే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చెరువుల పునరుజ్జీవన పనులు ప్రారంభం కానున్నాయని తెలిసి, పనులు ఇంకా ప్రారంభించలేదంటూ విమర్శలు చేయడం, తాము ప్రశ్నించడం వల్లే పనులు జరుగుతున్నాయని భావించడం వారి అపోహ మాత్రమేనని పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి నూతన పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా పెన్షన్లు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మహిళల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 200



యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు అవసరమైన నూతన పథకాలను కూడా ప్రజాప్రభుత్వం అందిస్తోందని, మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య,ూవీజ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి అర్బన్ వీ=ూరామ్మోహన్ ూజజ సెక్రటరీ బండ శంకర్ అడువాల లక్ష్మణ్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ దుమాల రాజ్ కుమార్ జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్,ణజజ ఉపాధ్యక్షులు రవీందర్ కౌన్సిలర్ లు కో ఆప్షన్ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నూతన మరుగుదొడ్లు ప్రారంభం

మలయప్ప ఫౌండేషన్ సహకారంతో నిర్మాణం.. ప్రారంభించిన మేయర్, డిప్యూటీ మేయర్



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో మలయప్ప ఫౌండేషన్ సహకారంతో కొత్తపల్లి, మల్కాపూర్, శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక బాధ్యత నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను గురువారం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, బండి సంజయ్ ఏటా పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లిస్తున్నారని, త్వరలో సైకిళ్లు పంపిణీ చేయను న్నారని తెలిపారు. విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తూ, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పారమిత విద్యార్థులు

హాలీబాల్, హ్యాండ్‌బాల్‌లో ముగ్గురికి అవకాశం విద్యార్థులను అభినందించిన యాజమాన్యం



కరీంనగర్ ప్రతినిధి,(సింగిడి): తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న 70వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థి ఈ. రక్షిత్ అండర్-14 బాలుర విభాగంలో ప్రతిభ కనబరిచి సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. అలాగే హ్యాండ్‌బాల్‌లో పదో తరగతి విద్యార్థిని సి. హెచ్. భువన, తొమ్మిదో తరగతి విద్యార్థిని ఏ. మోక్షజ్ఞ అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ చాటి మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సంద ర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు, డైరెక్టర్లు, ప్రధానోపాధ్యా యులు గోపీకృష్ణ విద్యార్థులను అభినందించి రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల కన్నీళ్లు కనిపించడం లేదా?

ప్రభుత్వంపై బొల్లం మల్లయ్య యాదవ్ ఆగ్రహం

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలి

కరువు పరిహారం విడుదల చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన



కోదాడ, (సింగిడి): రాష్ట్ర ప్రభుత్వం దళారులతో కుమ్మక్కై ధాన్యం ధరలను రాత్రికి రాత్రే తగ్గిస్తూ రైతులను దగా చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శిం చారు. గురువారం కోదాడలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అలవికాని హామీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక పంటలు నష్టపోయిన మండ లాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం, బాధిత రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందించలేదన్నారు. నష్టపోయిన రైతు లను గుర్తించి ఆర్థిక సాయం అందించడంలో నిర్ల క్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఒకవైపు కరువు పరి స్థితులతో పంట దిగుబడులు తగ్గి రైతులు ఇబ్బ దులు పడుతుంటే.. మరోవైపు ధాన్యం విక్రయించే సమయంలో దళారులతో కుమ్మక్కై ధరలు తగ్గించడం దారుణమన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు రోజుల తరబడి రోడ్లపై ధాన్యం కుప్పలతో ఎదురు చూస్తున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపో వడం శోచనీయమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించ డంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి బోనస్‌ను వెంటనే రైతుల ఖాతా ల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఐకేపీ ధా న్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధప్రాతి పదికన ప్రారంభించి రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కరువు పరిహారాన్ని వెంటనే విడుదల చేసి నష్టపో యిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలను పట్టించుకోవాల్సిన జిల్లా మంత్రి హెలికాప్టర్లలో తిరుగుతూ జల్సాలు చేస్తున్నారే తప్ప రైతుల గోడును పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలపై ప్రభు త్వం తక్షణమే స్పందించి కొనుగోళ్లు ప్రారంభిం చాలని, బోనస్‌తో పాటు కరువు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడకపోతే రైతాంగాన్ని సమీకరించి పెద్దఎత్తున ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని బొల్లం మల్లయ్య యాదవ్ హెచ్చ రించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నర్సిరెడ్డి సురేష్, బట్టు శివాజీ, కందిబండ సత్యనారాయణ, నయీమ్, ఉపేందర్, రమేష్, కిరణ్ కుమార్, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, నరసింహారావు, కరీముల్లా, బాబా, ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో

మూడేళ్ల జైలు

ఇంట్లోకి అక్రమ ప్రవేశానికి మరో ఆరు నెలలు..

కోదాడ (సింగిడి): మహిళపై దాడి చేసి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోదాడ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మొహమ్మద్ ఉమర్ గురువారం తీర్పు వెలువరించారు. కోదా డ మండలం భీక్యాతం డాకు చెందిన బానోతు వెంకన్నపై 2017లో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విచార ణలో నేరం రుజువు కావడంతో ఐపీసీ 354 సెక్షన్ కింద మూడేళ్ల జైలు, రూ. 2 వేల జరిమానా, 448 సెక్షన్ కింద ఆరు నెలల జైలు, రూ. 500 జరిమానా విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ న్యాయవాది కె. కళ్యాణి వాదించగా, ఎస్సై ఎస్. కె. యాకూబ్, కోర్టు కానిస్టేబుల్ పి. నరేష్ సహకరించారు. వీరిని పోలీసు అధికారులు అభినందించారు.

పోతారంలో ఘనంగా సిరి రెస్టారెంట్ ప్రారంభం..!



హుస్నాబాద్, (సింగిడి): హుస్నాబాద్ మండలం పోతారం ఎస్. మర్రి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సిరి రెస్టారెం ట్ ను హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి ఘనంగా ప్రారం భిం చారు. ఈ సంద ర్భంగా రెస్టారెంట్ యజమాని బొమ్మగాని రాజ్ కుమార్ గౌడ్ ను మున్సిపల్ చైర్మన్ ఆశీం-్వదించి, శుభాకాంక్షలు తెలి పారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈ ప్రాంత ప్రజలకు నాణ్య మైన, రుచికరమైన, పరిశు భ్రమైన భోజనాన్ని అందించడానికి సిరి రెస్టారెంట్ యాజమాన్యం ప్రయత్నం చేయా లని సూచించారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించే విధంగా ఈ రెస్టారెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, వ్యాపారులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై, రెస్టారెంట్ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రారంభం రోజే రెస్టారెంట్ వద్ద సందడి నెలకొంది. అత్యాధునిక సౌకర్యాలతో, కుటుంబ సమేతంగా కూర్చుని భోజనం చేసే విధంగా రెస్టారెంట్ ను తీర్చిదిద్దినట్లు యజమాని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెన్న రాజు, పట్టణ అధ్యక్షులు వివి రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు

అశ్విత్ తేజ ఎంపిక

మానేరు విద్యాసంస్థల విద్యార్థికి అవకాశం చైర్మన్ అభినందన



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి ఎం. అశ్విత్ తేజ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక య్యాడు. ఈ నెల 13 నుంచి 15 వరకు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో జరగనున్న 12వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో అతను పాల్గొననున్నాడు. ఇటీవల అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్య క్రమంలో విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి అశ్విత్ తేజను అభినందించి, రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

బాధితుడికి రంజిత్ కుమార్‌గౌడ్ పరామర్శ



జమ్మికుంట, (సింగిడి): జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన గీత కార్మి కుడు గండి చంద్రమోహన్ గౌడ్ తాటి చెట్టుపై నుంచి ప్రమాద వశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. రోజువారీ వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి కల్లు గీసిన అనంతరం కిందకు దిగుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన చంద్ర మోహన్ గౌడ్‌ను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నా రు. విషయం తెలుసు కున్న సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్ కుమార్ గౌడ్ ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శిం చారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

అధికారుల ప్రభావం లేకుండా

అంగన్‌వాడీ ప్రారంభం!

ఏకపక్ష నిర్ణయంపై స్థానికంగా చర్చ

టీచర్ వ్యాఖ్యలతో అధికార వర్గాల్లో కలకలం

మల్లాపూర్, (సింగిడి): మండలంలోని గుండంపల్లి గ్రామంలో రెండో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనం ప్రారంభోత్సవం వివాదానికి దారితీ స్తోంది. ఈ నెల 19న భవనాన్ని ప్రారంభించనున్నట్లు టీచర్ ఎ. రాధ వెల్లడించడంతో అసలు ఈ నిర్ణయం ఎవరు తీసుకున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గ్రామ సర్పంచ్‌తో పాటు పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులకు సమాచా రం ఉందా? లేదా? అన్నది ఇప్పుడు చర్చనీయాం శంగా మారింది. సూపర్వైజర్ చెప్పారని టీచర్ పేర్కొనడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. ప్రభుత్వ భవనం ప్రారంభోత్సవా నికి సంబంధించి అధికారికంగా నిర్ణయం తీసుకున్నారా? సంబంధిత శాఖల అనుమతులు, సమన్వయం లేకుండానే తేదీ ప్రకటించారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కుమార్తె నిశ్చితార్థ వేడుకలు

నూతన జంటను ఆశీర్వదించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి ప్రతినిధి, (సింగిడి): హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌లోని శుభం ప్రెస్టేజ్‌లో గురువారం జరిగినఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కుమార్తె నిశ్చితార్థ వేడుకకు మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులపైఅక్షింతలు చల్లి ఆశీర్వదించారు. నూతన జంట జీవితంలో నూతన అధ్యాయంసుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పరస్పర అనురాగాలతో నిండాలని, వారి దాంపత్యజీవితం కలకాలం ఆనందంగా సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ వేడుకల్లోపాల్గొని కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఅల్లిపురం వెంకటేశ్వర రెడ్డి ఉన్నారు.

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన

విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి అండగా హరి!

విద్యుత్ షాక్‌తో ఏఎల్ఎం వేల్పుల మహేష్ దుర్మరణం.. బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులకు ఓదార్పు.. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా





గోదావరిఖని, (సింగిడి): విధి నిర్వహణలో చోటుచేసుకున్న విద్యుత్ ప్రమాదం ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. పెద్దంపేట గ్రామానికి చెందిన ఏఎల్ఎం వేల్పుల మహేష్ రంగం పల్లి గ్రామంలో విధులు నిర్వర్తిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పో యారు. ఈ విషాదకర ఘటనతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.
మహేష్ మృతి విషయం తెలుసుకున్న హరి వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారిని ఓదార్చి మనోధైర్యం కల్పించారు. కుటుంబానికి తీరని లోటు ఏర్పడిందని, ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబం ఒంటరిగా లేదని హరి భరోసా ఇచ్చారు. మహేష్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన మహేష్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

అందాల అవికా

Avika Gor



అవికా గోర్ ఒక ప్రముఖ భారతీయ సినీ మరియు టెలివిజన్ నటి. చిన్నారి పెళ్ళికూతురు (బాలికా వధు) సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆమె, 'ఉయ్యాల జంపాల' సినిమాతో తెలుగు సినీ రంగంలో హీరోయిన్‌గా అడుగుపెట్టారు.

వ్యక్తిగత వివరాలు

పూర్తి పేరు. అవికా సమీర్ గోర్.
జననం. 1997 జూన్ 30న మహారాష్ట్రలోని ముంబైలో ఒక గుజరాతీ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు. తండ్రి సమీర్ గోర్ మరియు తల్లి చేతన గోర్. వివాహం. 2025 సెప్టెంబర్ 30న సామాజిక కార్యకర్త, 'క్యాంప్ డైరీస్' ఎన్జీవో వ్యవస్థాపకుడు మిలింద్ చద్వానీ ని వివాహం చేసుకున్నారు. వీరి వివాహం ఒక టెలివిజన్ రియాలిటీ షో వేదికపై ప్రసారమైంది.

టెలివిజన్ ప్రస్థానం

బాలికా వధు (చిన్నారి పెళ్ళికూతురు). 2008లో కలర్స్ టీవీలో ప్రసారమైన ఈ హిందీ సీరియల్‌లో 'ఆనంది' పాత్ర పోషించి విశేష ఆదరణ పొందారు. తెలుగులో ఇది 'చిన్నారి పెళ్ళికూతురు' పేరుతో అనువాదమైంది. ఇతర సీరియల్స్. 'ససురాల్ సిమర్ కా' (రోలీ పాత్ర), 'రాజ్‌కుమార్ ఆర్యన్', 'లాడో' వంటి సీరియల్స్‌లో నటించారు. అలాగే 'ఖత్రోన్ కే ఖిలాడీ' వంటి రియాలిటీ షోలలో కూడా పాల్గొన్నారు.

సినీ ప్రస్థానం

తెలుగు అరంగేట్రం. 2013లో వచ్చిన ఉయ్యాల జంపాల చిత్రంతో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ సినిమాకు గాను ఉత్తమ తొలిచిత్ర నటిగా సైమా (ఐ××మీ) అవార్డు అందుకున్నారు. ముఖ్యమైన తెలుగు సినిమాలు. లక్ష్మీ రావే మా ఇంటికి (2014), సినిమా చూపిస్త మావ (2015), తను నేను (2015), ఎక్కడికి పోతావు చిన్నవాడా (2016), రాజు గారి గది 3 (2019), నెట్ (2021), బ్రో (2021), థ్యాంక్యూ (2022), పాప్‌కార్న్ (2023), ఉమాపతి (2023), షణ్ముఖ (2025), అగ్లీ స్టోరీ (2026). ఇతర భాషా చిత్రాలు. హిందీలో 'మార్నింగ్ వాక్', 'పాఠశాల', 'తేజ్', '1920: హారర్స్ ఆఫ్ ది హార్ట్', 'బ్లడీ ఇష్క్' చిత్రాలతో పాటు కన్నడ మరియు కజఖ్ సినిమాల్లోనూ నటించారు. నిర్మాతగా. 'పాప్‌కార్న్' చిత్రానికి నిర్మాతగా వ్యవహరించారు. పలు షార్ట్ ఫిల్మ్‌కు రచయిత్రిగా కూడా పనిచేశారు

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
శనివారం
14-11-2026

ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

పవన్ కల్యాణ్‌తో భేటీ

ణక్లారిటీ ఇచ్చిన నిర్మాత దిల్ రాజు



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌కు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పాడు నిర్మాత దిల్ రాజు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రముఖ నిర్మాత దిల్ రాజు రీసెంట్‌గా భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఇద్దరూ కొంతసేపు ముచ్చటించగా.. ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. అయితే.. నిర్మాత దిల్ రాజు, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌ను కలవడం సినీ వర్గాల దృష్టిని ఆకర్షించింది. దీంతో పవన్ కల్యాణ్‌తో దిల్ రాజు సినిమా తీయబోతున్నారు అనే వార్త కూడా బయటకు వచ్చింది. దీనిపై తాజాగా క్లారిటీ ఇచ్చాడు నిర్మాత. ఈ మేరకు రామాయణ సక్సెస్ మీట్‌లో పాల్గొన్న దిల్ రాజు.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో మరో సినిమా చేయబోతున్నట్లు కన్ఫర్మ్ చేశారు.
సరైన సమయం చూసుకుని ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అంతే కాకుండా వీరి కొత్త సినిమాపై చర్చలు తుది దశకు చేరుకున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇక ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'వకీల్ సాబ్' తర్వాత మళ్లీ జతకట్టనుండటంతో టాలీవుడ్‌లో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై రానున్న ఈ చిత్రం కోసం ఇద్దరు స్టార్ డైరెక్టర్ల వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి దర్శకత్వం వహించే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తుండగా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

కీరవాణి పట్టుదల నిజంగా స్ఫూర్తిదాయకం..

అనుపమ్ ఖేర్ ఆసక్తికర పోస్ట్



బాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిభావంతులైన సీనియర్ నటులలో అనుపమ్ ఖేర్ ఒకరు. వందలాది సినిమాల్లో విభిన్నమైన పాత్రలు పోషించి, తన అద్భుతమైన నటనతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. కేవలం నటుడిగానే కాకుండా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా ఆయన భారతీయ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అంతేకాకుండా నిత్యం సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉంటూ ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటూ ఉంటారు. తాజాగా,అనుపమ్ ఖేర్ పెట్టిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కీరవాణి గారు అప్పుడు ఎలా ఉన్నారు, ఇప్పుడు ఎలా ఉన్నారనే మార్పు చూసి తాను ఆశ్చర్యపోయినట్లు అనుపమ్ ఖేర్ తెలిపారు. తన ప్రియ మిత్రుడు, ఆస్కార్ అవార్డు విజేత అయిన ఎం.ఎం. కీరవాణి ఏకంగా 22 కిలోల బరువు తగ్గారని, ఆయన పట్టుదల నిజంగా స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా కీరవాణిని కలవడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని చెప్పారు. ఆ సమయంలో కీరవాణి గారు చాలా ఉత్సాహంగా, కొత్త లక్ష్యాలను సాధించేందుకు పూర్తిగా సిద్ధంగా కనిపించారని వివరించారు. ఆయన నడకలో ఒక ప్రత్యేకమైన ఉత్సాహం ఉట్టిపడిందని, అంత సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో ఆయన్ను చూడటం తనకు ఎంతో గర్వంగా అనిపించిందని తెలిపారు. సంగీత ప్రపంచంలో కీరవాణి ఒక అసలైన మేధావి అని ప్రశంసించారు. ఇప్పుడు సరైన ఫోకస్, పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని ఆయన నిరూపించారని చెప్పారు. తన మిత్రుడి జీవితంలోని ఈ కొత్త, స్ఫూర్తిదాయక అధ్యాయానికి ఆయన అభినందనలు తెలియజేస్తూ, మిమ్మల్ని కలవడం చాలా బాగుంది, జై హో అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

సినిమా సింగిడి
Cinema Singidi

నెక్లెస్ కారణంగా వివాదంలో

కరీనా కపూర్..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ ఊహించని వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల దీపావళి పండుగ సందర్భంగా ఆమె అత్యంత సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిన ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. ఆ వేషధారణలో భోపాల్ నవాబుకు చెందిన 200 ఏళ్ల నాటి పురాతన 'కల్కి', భోపాల్ బేగంకు చెందిన 30 క్యారెట్ల విలువైన పచ్చల హారాన్ని ఆమె ధరించారు. కరీనా కపూర్ స్టైలిస్ట్ రియా కపూర్ ఈ అరుదైన ఆభరణాల క్లోజప్ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే ఇవి భోపాల్ రాజకుటుంబానికి చెందిన అత్యంత విలువైన వారసత్వ సంపద అని తెలుస్తోంది. కరీనా భర్త సైఫ్ అలీ ఖాన్ కుటుంబం ద్వారా ఇవి ఆమెకు లభించాయట. సైఫ్ అలీ ఖాన్ అమ్మమ్మ సాజిదా సుల్తాన్, భోపాల్‌ను పాలించిన చివరి నవాబు కుమార్తె కావడంతో ఆ రాజవంశపు నగలు వీరి వద్ద ఉన్నాయి.



అయితే, కరీనా ధరించిన ఆ పచ్చల హారంపై పవిత్ర ఖురాన్‌లోని 'ఆయత్-ఉల్-కుర్సీ' అనే పవిత్ర వచనం ఉందంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్ పార్టీ భోపాల్ ప్రాంతీయ జాతీయ మీడియా కోఆర్డినేటర్ అబ్బాస్ హఫీజ్, తాజాగా కరీనా కపూర్, రియా కపూర్‌లకు లీగల్ నోటీసులు పంపారు. పవిత్ర ఖురాన్ వచనాలను కేవలం ఒక ఫ్యాషన్ యాక్సెసరీగా ఉపయోగించడం, ఇలాంటి సందర్భాల్లో వాటిని ధరించడం వల్ల మతపరమైన మనోభావాలు దెబ్బతింటాయని ఆయన ఆ నోటీసులో స్పష్టం చేశారు. వెంటనే సోషల్ మీడియా నుంచి ఆ ఫోటోలను తొలగించి, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ కరీనా ఆ ఫోటోలను తొలగించకపోయినా, క్షమాపణ చెప్పకపోయినా పోలీసుల ద్వారా లేదా కోర్టు ద్వారా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం ఈ వివాదం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

ఈ నగరానికి ఏమైంది

వేడుకలను మొదలుపెడదామంటూ శివాత్మిక పోస్ట్

తెలుగు చిత్రసీమలో కల్ట్ క్లాసిక్ హిట్‌గా నిలిచిన 'ఈ నగరానికి ఏమైంది' సినిమాకు సీక్వెల్‌గా 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' రాబోతుంది. మొదటి భాగంలో ప్రేక్షకులను విపరీతంగా అలరించిన మాస్ కా దాస్ విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమానులతో పాటు ఈసారి సుశాంత్ స్థానంలో శ్రీనాథ్ మాగంటి కూడా ఈ టీమ్‌తో కలిసి నవ్వులు పూయించడానికి సిద్ధమయ్యారు. క్రియేటివ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తనదైన మార్క్ క్యాచీ డైలాగ్స్, రియలిస్టిక్ కామెడీతో ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించారు. ఇక ఈ సీక్వెల్‌లో శివాత్మిక రాజశేఖర్, అనీషా ఆంబ్రోస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రూట్‌నోడ్ సినిమా బ్యానర్‌పై శృజన్ యెరబోలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి, సంగీత దర్శకుడు వివేక్ సాగర్ మరొకసారి తన మ్యాజికల్ ట్యూన్స్‌తో అలరించడానికి రెడీ అయ్యారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 19న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో, ప్రమోషన్ల వేగాన్ని మరింత పెంచిన మేకర్స్ తాజాగా, ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్‌కు సంబంధించిన అప్‌డేట్‌ను సోషల్ మీడియా ద్వారా అనౌన్స్ చేశారు. నవంబర్ 12న అసలైన సెలబ్రేషన్స్ మొదలుపెడదామంటూ ప్రకటన ఇచ్చారు. అంతేకాకుండా హీరోయిన్ శివాత్మిక అద్దం ముందు నిల్చొని చాలా కంగారుగా రెడీ అవుతున్న ఒక క్యూట్ పోస్టర్‌ను నెట్టింట పంచుకున్నారు. ఈ పోస్ట్‌ను శివాత్మిక లీషేర్ చేస్తూ.. ఈ పాట నా మనసుకి ఎంతో దగ్గరైందని తెలిపింది.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737